

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు



వైద్య బీమా ఉంటే చాలు.. ఏ ఆస్పత్రిలోనైనా
నగదు రహిత చికిత్స!
ది జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ నిర్ణయం
గురువారం నుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి
2

శుక్రవారం | 26-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 281 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి రా. 1.21 తదుపరి విదియ; నక్షత్రం: పుష్యమి ఉ. 10.29 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: రా.12.38-2.24; దుర్ముహూర్తం: ఉ.9.07-9.52, మ.12.51-1.35; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.04 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వెంకయ్య, చిరంజీవికి
పద్మవిభూషణ్

తెలుగు రాష్ట్రాల నుంచి 8 మందికి పద్మాలు





- తెలంగాణ నుంచి కేతావత్ సోమ్‌లాల్, కూరెళ్ల విఠలాచార్య, దాసరి కొండప్ప, గడ్డం సమ్మయ్య, వేలు ఆనందాచారికి పద్మశ్రీ
- ఏపీకి చెందిన హరికథా కళాకారిణి ఉమామహేశ్వరికి కూడా!
- 2024కు గాను పద్మ పురస్కారాలు ప్రకటించిన కేంద్రం
- పద్మవిభూషణ్‌కు ఎంపికైనవారిలో వైజయంతి మాల బాలి, పద్మా సుబ్రహ్మణ్యం, 'సులభ్' వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాఠక్
- మిథున్ చక్రవర్తి, ఉషా ఉతుప్, సీతారామ్ జిందాల్‌కు పద్మభూషణ్
- తమిళ నటుడు విజయ్‌కాంత్‌కు మరణానంతరం ఆ పురస్కారం
- ఐదుగురికి పద్మ విభూషణ్.. 17 మందికి పద్మభూషణ్.. 110 మందికి పద్మశ్రీ


కేతావత్ సోమ్‌లాల్
ఆనందాచారి
గడ్డం సమ్మయ్య

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాజకీయాల్లో.. సినిమాల్లో.. ఇలా రెండు వేర్వేరు రంగాల్లో ఎలాంటి నేపథ్యమూ లేకుండా అతి సామాన్యులుగా ప్రస్థానాన్ని ప్రారంభించి, తమ స్వయంకృషితో, అద్భుత ప్రతిభతో అత్యున్నత స్థానాలకు ఎదిగిన ఇద్దరు అసామాన్యులైన తెలుగు తేజాలను పద్మవిభూషణ్ పురస్కారం వరించింది! వారిలో ఒకరు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కాగా.. మరొకరు తెలుగు చిత్రపరిశ్రమలో మెగాస్టార్‌గా వెలుగొందుతున్న చిరంజీవి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని.. 2024కుగాను పద్మ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం గురువారం రాత్రి పొద్దుపోయాక ప్రకటించింది. ఆ జాబితాలో పద్మభూషణ్ కేటగిరీలో తెలుగువారు ఎవరూ లేరు. ఇక, పద్మశ్రీ పురస్కారాలు.. తెలంగాణకు చెందిన ఐదుగురికి, ఏపీకి చెందిన

మిగతా 2వ పేజీలో...



జ్ఞానవాపి మసీదు కింద
ఆలయ శిథిలాలు!

- ఔరంగజేబు హయాంలో మందిరం ధ్వంసం
- దానిపైనే మసీదు నిర్మాణం
- ఆలయ స్తంభాలు, రాళ్లు వాడారు
- కొన్ని గోడల్ని యథాతథంగా కలిపారు
- దేవనగరి, గ్రంథ, తెలుగు, కన్నడ లిపులలో 34 శిలా శాసనాలు
- కళాకృతులు, ప్రవేశద్వారాలు, శిల్పరీతి ఆలయమే: ఏఎస్ఐ
- కక్షిదారులకు నివేదిక ప్రతులు

వారణాసి, జనవరి 25: జ్ఞానవాపిలో గతంలో ఉన్న భారీ హిందూ ఆలయాన్ని కూల్చి, ఆ శిథిలాలపై మసీదును నిర్మించారని భారత పురావస్తు విభాగం (ఏఎస్ఐ) సర్వే తేల్చినట్లు వెల్లడైంది. మసీదు నిర్మాణంలో ఆలయం స్తంభాలను, రాళ్లను ఉపయోగించారని, ఆలయం గోడలతోపాటు కొన్ని ఇతర నిర్మాణాలను యథాతథంగా

మిగతా 2వ పేజీలో...


తెలంగాణ కాంగ్రెస్ బూత్ లీడర్స్ సమావేశంలో సీఎం రేవంత్, ఖర్గే

కేసీఆర్.. కొన ఊపిరితో ఉన్నావు.. కాస్కో..
ఆట మొదలైంది

- ఇప్పటిదాకా నడిచింది ఇంటర్వెలే.. అసలు సినిమా ముందుంది
- చార్లెస్ శోభరాజ్ ఇంట్లో పడుకుంటే.. బిల్లా, రంగా ఊరిమీదికి
- అవును.. వాళ్లని 100మీటర్ల గోతిలో పాతి గోరీకట్టే మేస్త్రీ నేనే
- ఫిబ్రవరిలో రెండు కొత్త పథకాలు.. రైతుబంధు కూడా పూర్తి
- ఐదుగురు సభ్యులతో గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు
- తెలంగాణ కాంగ్రెస్ బూత్ లీడర్స్ సమావేశంలో సీఎం రేవంత్
- దేవుడి పేరుతో ప్రధాని మోదీ డ్రామాలు: మల్లికార్జున ఖర్గే

13

పెద్దల సభకు
ఉద్యమ సారథి

- గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రొఫెసర్ కోదండరామ్
- మరో ఎమ్మెల్సీగా సియాసత్ న్యూస్ ఎడిటర్ అమీర్ అలీ ఖాన్
- గవర్నర్ తమిళిసై ఆమోదముద్ర
- ఈసీ ఆమోదం కోసం ఫైలు

14

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా
మహేందర్‌రెడ్డి

- మాజీ డీజీపీకి కీలక బాధ్యత అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం
- ప్రక్షాళనలో తొలి అడుగు
- సభ్యులుగా ఓసీ, బీసీల నుంచి ఇద్దరేసి, ఎస్సీ, ఎస్టీల నుంచి ఒక్కొక్కరు
- నేడు ప్రమాణ స్వీకారం చేయించనున్న గవర్నర్



నడ్డా సమక్షంలో బీజేపీలో చేరిన మాజీ సీఎం శెట్టర్

మళ్లీ బీజేపీ గూటికి శెట్టర్

- ఢిల్లీలో అమిత్‌షాతో భేటీ.. నడ్డా సమక్షంలో పార్టీలో చేరిక

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ సీఎం, లింగాయత్ ప్రముఖుడు జగదీశ్ శెట్టర్ తిరిగి బీజేపీ గూటికి చేరుకున్నారు. ఢిల్లీలో గురువారం కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిసిన కాసేపటికే.. ఆయన బీజేపీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శెట్టర్ మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొన్ని కారణాలతో బీజేపీని వీడానని, మళ్లీ పార్టీలోకి రావాలని సీనియర్ నేతలు ఆహ్వానించారని తెలిపారు. బేషరతుగా పార్టీలో చేరానని.. నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిని చేయాలన్నదే తన ఆశయమన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికీ రాజీనామా చేశానని తెలిపారు. అయితే తనకు కాంగ్రెస్‌లో సముచిత గౌరవం ఇచ్చారని, తనపై సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రేమాభిమానాలు చూపారంటూ వారికి ధన్యవాదాలు తెలిపారు.

గణతంత్ర వేడుకలకు పటిష్ఠ భద్రత

న్యూఢిల్లీ, జనవరి 25: 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు దేశ రాజధాని ముస్తాబైంది. ఢిల్లీలో 70 వేల మందికి పైగా భద్రతా సిబ్బందిని మోహరించారు. వీరిలో గణతంత్ర దినోత్సవ పరేడ్ జరిగే కర్తవ్యపథ్ వద్దే 14 వేల మందిని నియమించినట్లు అధికారులు తెలిపారు. కర్తవ్యపథ్‌లో 90 నిమిషాల పాటు పరేడ్ జరగనుంది. ఈ వేడుకల్లో తొలిసారిగా త్రివిధ దళాలకు చెందిన మహిళా అధికారులు పాల్గొననున్నారు. శుక్రవారం ఉదయం ప్రధాని మోదీ జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించి అమరులకు నివాళులు అర్పిస్తారు. అనంతరం రాష్ట్రపతి ముర్ము, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో కలిసి కర్తవ్యపథ్‌కు చేరుకుంటారని అధికారులు తెలిపారు. రాష్ట్రపతి జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం వాయుసేనకు చెందిన హెలికాప్టర్లు కర్తవ్యపథ్‌లోని ఆహూతులపై పూల వర్షం కురిపించనున్నాయి. కాగా, ప్రస్తుతం దేశవ్యాప్త భారత్ జోడో న్యాయ యాత్ర నిర్వహిస్తున్న రాహుల్ గాంధీ, రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా రెండు రోజులు సెలవు తీసుకొని, గురువారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్నారు.

పలువురు పంచాయతీ ప్రతినిధులకు ఆహ్వానం!

గణతంత్ర దినోత్సవానికి పంచాయతీరాజ్ సంస్థల నుంచి పలువురు ప్రతినిధులను ఆహ్వానించినట్లు పంచాయతీరాజ్ శాఖ గురువారం తెలిపింది. కర్తవ్యపథ్‌లో జరిగే పరేడ్‌ను వీక్షించేందుకు దేశవ్యాప్తంగా పలు పంచాయతీ ప్రతినిధులు, వారి జీవిత భాగస్వాములు సహా 500 మందికి ఆహ్వానాలు అందించినట్లు చెప్పింది. గతంలో జాతీయ పంచాయతీ అవార్డులు పొందిన లేదా విశేష కృషి చేసిన పంచాయతీల ప్రతినిధులను ఎంపిక చేసి పరేడ్‌కు ఆహ్వానించారు.

రామరాజ్యానికి భిన్నంగా నేటి పాలకులు

- ప్రధాని మోదీపై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పరోక్ష విమర్శలు

న్యూఢిల్లీ, జనవరి 25: రాముడి పాలనలో వివక్ష లేదని.. కానీ, నేటి పాలకులు ప్రజలను కులం, మతం పేరిట వర్గీకరించారని ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్ పరోక్షంగా ప్రధాని మోదీపై విమర్శలు చేశారు. ధరల పెరుగుదల కారణంగా ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంటే.. అది రామరాజ్యం కాబోదన్నారు. ఢిల్లీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఛత్రశాల్ స్టేడియంలో గురువారం నిర్వహించిన గణతంత్ర దిన వేడుకల్లో కేజ్రీ ప్రసంగించారు. రాముడి రాజ్యం తమకు ఆదర్శమని.. ప్రజలందరూ ఆయన ఆదర్శాలను స్వీకరించాలని సూచించారు.

వైద్య బీమా తీసుకుంటే చాలు

ఏ ఆస్పత్రిలోనైనా నగదు రహిత చికిత్స!

న్యూఢిల్లీ, జనవరి 25: మీరు ఆరోగ్య బీమా తీసుకున్నారా? చికిత్స కోసం సదరు బీమా కంపెనీ నెట్‌వర్క్ ఆస్పత్రికే వెళ్లాల్సిన పని లేదు. జాబితాలో లేని ఆస్పత్రికి వెళితే ఇన్సూరెన్స్ వర్తించదేమోనన్న కంగారూ అక్కర్లేదు. అది ఏ కంపెనీ అయినా సరే, మీరు ఆరోగ్య బీమా తీసుకుంటే చాలు.. నెట్‌వర్క్ జాబితాలో పొందుపర్చిన ఆస్పత్రులు సహా ఏ ప్రైవేటు ఆస్పత్రిలోనైనా 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్' (నగదు రహిత చికిత్స) సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఈ మేరకు దేశవ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సకు సంబంధించి మెడికల్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీల సౌజన్యంతో 'ది జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్' కీలక నిర్ణయం వెలువరించింది. ఇక నుంచి అన్ని ఆస్పత్రుల్లోనూ 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్' సదుపాయం లభిస్తుందని, ఇది గురువారం (జనవరి 25) నుంచే అమల్లోకి వచ్చిందని ప్రకటించింది. ఇప్పటి దాకా ఏదైనా హెల్త్ పాలసీ తీసుకుంటే.. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోనే 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్'కు అనుమతి ఉండేది. నెట్‌వర్క్‌యేతర ఆస్పత్రిలోనైతే చికిత్సకు ఎంత ఖర్చయితే అంత రోగి సొంతంగా చెల్లించుకోవాల్సి వచ్చేది. ఆ తర్వాత చికిత్స ఖర్చులను బీమా కంపెనీ నుంచి పొందేందుకు రీయింబర్స్‌మెంట్‌కు దరఖాస్తు చేయాల్సి వచ్చేది. ఈ దరఖాస్తుకు వైద్య చికిత్సకు సంబంధించి పత్రాలు, బిల్లుల



రూపంలో పెద్ద ఫైలునే జతచేసి ఇవాల్సి వచ్చేది. ఈ ప్రక్రియంతా కూడా సుదీర్ఘంగానూ.. సంక్లిష్టంగానూ ఉండేది. అయితే ఇక నుంచి ఈ తలనొప్పులు తప్పనున్నాయి. క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్‌పై కీలక నిర్ణయం వెలువడిన అనంతరం బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో.. జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ చైర్మన్ తపన్ సింఘేల్ స్పందించారు. బీమా పాలసీదారులకు చికిత్సను సులభతరం చేసేందుకే అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.

బిహార్‌లో రాజకీయ ప్రకంపనలు!

'ఇండియా' కూటమిలో లుకలుకలు.. జేడీయూ నేతలతో నితీశ్ భేటీ

- ఆర్జేడీతో ఎలాంటి సమస్య లేదు
- జేడీయూ సీనియర్ నేత కేసీ త్యాగి వెల్లడి





పట్నా, జనవరి 25: లోక్‌సభ ఎన్నికల ముంగిట బిహార్ రాజకీయాల్లో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మిత్రపక్షాల మధ్య వాగ్యుద్ధం మొదలవ్వడంతో రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు మొదలయ్యాయి. తాజా పరిణామాలతో ఎన్నికల్లోగా కూటముల్లో మార్పులు తప్పవనే వాదనలు వినిపిస్తున్నాయి. కేంద్రం బిహార్ జననేత కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించినప్పటి నుంచి.. 'మహాగఠ్‌బంధన్'(జేడీయూ,కాంగ్రెస్,ఆర్జేడీ) ప్రభుత్వంలో ముసలం మొదలైందని స్థానిక న్యూస్ చానళ్లు గురువారం కథనాలను ప్రసారం చేశాయి. వాటిని బలపరిచేలా పరిణామాలు మారుతున్నాయి.

మొదలైన వాగ్యుద్ధం

కర్పూరీ ఠాకూర్ శతజయంత్యుత్సవాల సందర్భంగా సీఎం నితీశ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలపై రాజకీయ దుమారం చెలరేగుతోంది. కుటుంబ రాజకీయాలపై ఆయన స్పందిస్తూ.. "కర్పూరీ ఠాకూర్‌లాగే నేను కూడా కుటుంబ రాజకీయాలకు పాల్పడడం లేదు. నా కుటుంబంలో ఎవరినీ రాజకీయాల్లోకి తీసుకురాలేదు" అని చేసిన వ్యాఖ్యలపై లాలూ కుమార్తె రోహిణీ ఆచార్య గురువారం ఎక్స్‌లో తీవ్రంగా స్పందించారు. "జనం తరచూ తమ తప్పులను మరిచిపోయి.. ఇతరుల మీద బురద చల్లుతుంటారు. అర్హత లేని వ్యక్తికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడు వచ్చే ఫలితాలు ఎలా ఉంటాయి? వ్యక్తి మనసులోనే కపటత్వం ఉన్నప్పుడు పద్ధతులను ఎవరు ప్రశ్నిస్తారు?" అంటూ నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. ఇవి నితీశ్‌ను ఉద్దేశించేనంటూ సోషల్ మీడియాలో చర్చ జరగటంతో, ఆ పోస్టును ఆమె ఎక్స్ నుంచి తొలగించారు.

దీనిపై రాష్ట్ర బీజేపీ నేతలు స్పందిస్తూ, నితీశ్‌ను రోహిణి అవమానించారని, దీనిపై ఆమె బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే.. నితీశ్ వ్యాఖ్యలు ఆర్జేడీని ఉద్దేశించినవి కావంటూ జేడీయూ సీనియర్ నేత, అధికార ప్రతినిధి కేసీ త్యాగి చెప్పుకొచ్చారు. బిహార్‌లో జేడీయూ-ఆర్జేడీ మధ్య సీట్ల పంపకాలపై ఎటువంటి సమస్యలు లేవని చెప్పారు. కాగా.. లాలూ గురువారం నితీశ్‌కు ఫోన్ చేసి మాట్లాడారని తెలిసింది.

మళ్లీ ఎన్డీఏ వైపు నితీశ్?

గతంలో బీజేపీతో చెలిమి చేసిన నితీశ్ మరోసారి, ఆర్జేడీని వదిలిపెట్టి బీజేపీని కలుస్తారంటూ బిహార్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇండియా కూటమికి ఖర్గేను చైర్మన్‌గా ప్రకటించినప్పటి నుంచే.. కాంగ్రెస్‌పై జేడీయూ గుర్రుగా ఉంది. నితీశ్‌కు కూటమి కన్వీనర్ పదవి ఇస్తామన్నా.. ఆయన సున్నితంగా తిరస్కరించారు. ఆ తర్వాత ఆయన కూటమితో అంటీముట్టనట్లుగా ఉంటున్నారు. తాజాగా కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడంతో.. మళ్లీ ఎన్డీయే వైపు చూస్తున్నారని తెలుస్తోంది. అయితే.. "లాలూను భయపెట్టాలనుకున్నప్పుడల్లా నితీశ్ బీజేపీ వైపు చూస్తుంటారు. ఇప్పుడు మాత్రం ఆయనకు ఎన్డీఏ తలుపులు తెరిచి లేవు" అని బిహార్‌కు చెందిన బీజేపీ నేత, కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్ వ్యాఖ్యానించారు.

అధీర్ రంజన్ వల్లే లుకలుకలు: టీఎంసీ

కోల్‌కతా: 'బెంగాల్‌లో పొత్తులు కుదరకపోవడానికి కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధరే బాధ్యుడని టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ ఆరోపించారు. ఆయన బీజేపీ భాషలో మాట్లాడుతుంటారని విమర్శించారు.

ఉన్నఫళంగా ఉన్నతస్థాయి భేటీలు

గురువారం సాయంత్రం వరకు పరిస్థితి వాగ్యుద్ధాలు, వివరణలతో వేడిని రగిలించగా.. ఆ తర్వాత ఇరు పార్టీలు వేర్వేరుగా తమ కీలక నాయకులతో భేటీలు ఏర్పాటు చేశాయి. నితీశ్‌కుమార్ అందుబాటులో ఉన్న జేడీయూ కీలక నాయకులతో పట్నా లో భేటీ అయ్యారు. అయితే.. ఎజెండా ఏమిటన్నదాన్ని బయటకు పొక్కనీయలేదు. దీంతో.. తిరిగి ఎన్డీయే గూటికి చేరాలని నితీశ్ నిర్ణయించుకున్నారనే ఊహాగానాలు వెలువడ్డాయి. అదే సమయంలో ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ కూడా కీలక నేతలతో భేటీ అవ్వడం గమనార్హం..! నితీశ్ తమకు మొండి చేయి చూపితే, సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి 8 మంది ఎమ్మెల్యేలు అవసరమని ఆర్జేడీ లెక్కలు వేసుకుంటున్నట్లు కొన్ని ఇంగ్లిష్ న్యూస్ చానళ్లు పేర్కొన్నాయి. మరోవైపు బీజేపీ అధిష్ఠానం కూడా బిహార్ నేతలను ఉన్నఫళంగా ఢిల్లీకి రావాలని ఆదేశాలు జారీ చేసింది.

లోకం తీరు



అయోధ్య రామమందిరం భారతీయుల విశ్వాసానికి ప్రతీక

- కర్పూరి ఠాకూర్ జీవితం స్ఫూర్తిదాయకం
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం



న్యూఢిల్లీ, జనవరి 25: అయోధ్య రామమందిరం ప్రజల విశ్వాసానికి, న్యాయవ్యవస్థపై భారతీయులకు ఉన్న అపారమైన నమ్మకానికి ప్రతీకగా నిలిచే గొప్ప నిర్మాణమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. అంతేకాక, అయోధ్య రామమందిరం భారత నాగరిక వారసత్వానికి ఓ చిహ్నంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఈ మేరకు దేశ పౌరులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్రపతి గురువారం జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. రాజ్యాంగం రూపకల్పనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి, పాత్రను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నారీ శక్తి వందన్ అధినియమ్ (చట్ట సభలో మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన బిల్లు) మహిళా సాధికారతకు విప్లవాత్మకమైన ఓ సాధనమని అభిప్రాయపడ్డారు. బిహార్ మాజీ సీఎం దివంగత కర్పూరి ఠాకూర్‌ను భారతరత్నతో గౌరవించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వెనకబడిన తరగతుల సంక్షేమానికి విశేష కృషి చేసిన కర్పూరి ఠాకూర్ జీవితం స్ఫూర్తిదాయకం అన్నారు. జీ20 సదస్సుకు అత్యద్భుతంగా ఆతిథ్యం ఇవ్వడంతో అంతర్జాతీయ వేదికపై భారతదేశ కీర్తి మరింత పెరిగిందని తెలిపారు. అంతరిక్ష పరిశోధన, ఐటీ రంగంలో భారత్ దూసుకెళుతోందని అన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా నిలవాలంటే దేశ ప్రజలంతా తమ బాధ్యతలను వంద శాతం నిర్వర్తించాలని ఆమె పిలుపునిచ్చారు.

సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ వరాలే ప్రమాణ స్వీకారం

- ఆయన నియామకంతో మూడుకు చేరిన దళిత న్యాయమూర్తుల సంఖ్య

న్యూఢిల్లీ, జనవరి 25: సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ పి.బి.వరాలే గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఇంత వరకు కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ వరాలేను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారమే నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయన పదవీ స్వీకారంతో సుప్రీంకోర్టు పూర్తి సామర్థ్యం మేరకు మొత్తం 34 మంది జడ్జీలతో పనిచేస్తున్నట్టయింది. సర్వోన్నత న్యాయస్థానంలో తొలిసారిగా ముగ్గురు దళిత న్యాయమూర్తులు ఉన్నటయింది. ఆయనతో పాటు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సి.టి.రవి కుమార్‌లు ఎస్సీ వర్గానికి చెందిన వారు కావడం గమనార్హం. గత నెల 25న జస్టిస్ ఎస్.కె.కౌల్ పదవీ విరమణ చేయడంతో ఏర్పడిన ఖాళీలో జస్టిస్ వరాలేను నియమించారు. ప్రస్తుతం ఉన్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల్లో సీనియర్ మోస్ట్ కావడం, ఎస్సీ వర్గానికి చెందిన ఒకే ఒక్క చీఫ్ జస్టిస్ కావడంతో సుప్రీంకోర్టు జడ్జి పదవికి కొలీజియం ఆయనను ఎంపిక చేసింది. ఆయన మాతృ న్యాయస్థానం బాంబే హైకోర్టు. ఆ హైకోర్టులో పనిచేసిన నలుగురు జడ్జీలు ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉన్నట్టయింది. జస్టిస్ వరాలేతో పాటు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకా బాంబే హైకోర్టులో పనిచేసిన వారే.

'యువ' కలలు నెరవేరుస్తా

కుటుంబ పార్టీలను ఓడించండి.. బీజేపీ మేనిఫెస్టోకు సలహాలివ్వండి

- నవ ఓటర్లకు 'మోదీ గ్యారెంటీ'
- నమో యాప్ ద్వారా పంపండి
- మంచి ఆలోచనలు పంపినవారిని స్వయంగా కలుస్తా: మోదీ

న్యూఢిల్లీ/బులంద్‌షహర్, జనవరి 25: యువతపై తనకు అపార విశ్వాసం ఉందని.. ఎల్లప్పుడూ వారికే తాను పెద్దపీట వేస్తానని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. వారి కలలు నెరవేర్చడమే తన సంకల్పమని.. ఇది 'మోదీ గ్యారెంటీ' అని పేర్కొన్నారు. కుటుంబ పార్టీలను ఓడించాలని వారికి పిలుపిచ్చారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ యువమోర్చా గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో నవ యువ ఓటర్లనుద్దేశించి ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 5వేల ప్రాంతాల నుంచి ప్రథమ ఓటర్లు ఆయన ప్రసంగాన్ని విన్నారు. ఇంత భారీ సంఖ్యలో యువ ఓటర్లతో సంభాషించే అవకాశంరావడం ప్రపంచంలో ఏ నాయకుడికైనా బహుశా ఇదే మొదటిసారని ప్రధాని వ్యాఖ్యానించారు. యువతకు అపార ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా మౌలిక వసతుల కల్పనకు పెద్దఎత్తున ఖర్చుచేస్తున్నామని.. 'స్టార్టప్ ఇండియా', 'డిజిటల్ ఇండియా' వంటి పురోగామి పథకాలు, వివిధ రంగాల్లో సంస్కరణలు చేపట్టామన్నారు. తొలిసారి ఓటు హక్కు పొందిన యువ ఓటర్లు బీజేపీ అభివృద్ధి ఎజెండాకు మద్దతిస్తున్నారని తెలిపారు. 'అవినీతికి, బంధుప్రీతి, కుటుంబవాదానికి యువత వ్యతిరేకం. కుటుంబ పార్టీలు ఇతర యువకుల పురోగతిని అంగీకరించవు. మీ ఓట్ల బలంతో ఈ పార్టీలను ఓడించాలి. భారీ మెజారిటీతో పటిష్ఠ సుస్థిర ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి' అని పిలుపిచ్చారు. ఏప్రిల్-మేలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ మేనిఫెస్టో రూపకల్పనకు సలహాలు పంపాలని యువతను కోరారు. 'నమో యాప్ ద్వారా సూచనలు పంపండి. సుసాధ్యమయ్యే మంచి ఆలోచనలు పంపిన వారిలో కొందరిని నేను స్వయంగా కలుస్తా' అని చెప్పారు. వచ్చే పాతికేళ్లలో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మలిచే బాధ్యత ఇప్పటి యువతరంపై ఉందని ప్రధాని చెప్పారు. కాగా లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ ప్రచారాన్ని ప్రారంభించింది. ఇందుకోసం ఓ వినూత్న గీతాన్ని ప్రధాని సమక్షంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా గురువారం ఢిల్లీలో ఆవిష్కరించారు. 'స్వప్నాలు సాకారం కానప్పుడు.. అందరూ మోదీనే ఎన్నుకుంటారు (సప్నే నహీ హకీకత్ బన్తే హై.. తబీ తో సబ్ మోదీకో చున్‌తే హై)' అనే ఈపాట అందరినీ ఆకర్షిస్తోంది. కాగా తనకు ఎన్నికల శంఖం పూరించాల్సిన అవసరంలేదని, తన కోసం ప్రజలే శంఖారావం చేస్తారని ప్రధాని అన్నారు. గురువారం ఆయన ఉత్తరప్రదేశ్‌లో రూ.19,100కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బులంద్‌షహర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు.



జైపూర్‌లో మోదీ, మేక్రాన్ రోడ్‌షో

జైపూర్, జనవరి 25: ఢిల్లీలో శుక్రవారం జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్యఅతిథిగా వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మేక్రాన్ గురువారం సాయంత్రం జైపూర్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు ఓపెన్ టాప్ వాహనంలో నిల్చుని కబుర్లు చెప్పుకుంటూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలను చూస్తూ చేతులు ఊపారు. హవా మహల్ ముందు ఇద్దరూ దిగారు. ఆ ప్రాంతంలో హస్తకళల దుకాణాన్ని సందర్శించారు. ముఖ్య అతిథి కోసం అయోధ్య రామమందిర ప్రతిమను ప్రధాని కొనుగోలు చేసి బహూకరించారు. అలాగే ఇద్దరూ కలిసి మసాలా చాయ్‌ని సేవించారు. ఆ తర్వాత మళ్లీ వాహనం ఎక్కి సంగనేరి గేట్ వరకు రోడ్‌షో నిర్వహించారు. తర్వాత డిన్నర్, ద్వైపాక్షిక చర్చల కోసం రామ్‌బాఘ్ ప్యాలెస్‌కు బయలుదేరారు.

జ్ఞానవాపి మసీదు కింద ఆలయ శిథిలాలు!

(మొదటి పేజీ తరువాయి)

మసీదులో కలిపేశారని ఈ సర్వే తెలిపింది. ఏఎస్ఐ సర్వే నివేదికను గురువారం జిల్లా కోర్టు ఆదేశాల మేరకు.. జ్ఞానవాపి కేసులోని ఇరుపక్షాలకు చెందిన 11 మంది కక్షిదారులకు అందజేశారు. హిందూ కక్షిదారుల తరఫు న్యాయవాది విష్ణుశంకర్‌జైన్ విలేకరుల సమావేశంలో ఏఎస్ఐ సర్వే నివేదికలో ఉన్న వివరాలను వెల్లడించారు. ఈ నివేదిక 839 పేజీలు ఉన్నదని తెలిపారు. గతంలో ఉన్న ఆలయాన్ని ధ్వంసం చేసి దాని శిథిలాలపైనే మసీదును నిర్మించారని, ఈ మేరకు పలు ఆధారాలు ఉన్నాయని ఈ నివేదిక స్పష్టం చేస్తోందని చెప్పారు. మసీదు నిర్మాణంలో ఆలయం స్తంభాలను ఉపయోగించారని, ఆలయ నిర్మాణంలోని కొన్ని భాగాలను యథాతథంగా అలాగే ఉంచారని తెలిపారు. 'సర్వే సందర్భంగా ఇప్పుడున్న మసీదు గోడలపై, అంతకు ముందటి ఆలయ నిర్మాణం తాలూకు గోడలపై 34 శాసనాలు ఉన్నట్లు ఏఎస్ఐ గుర్తించింది. వీటిలో 32 శాసనాలను నకలు చేసింది. ఇవి దేవనగరి, గ్రంథ, తెలుగు, కన్నడ లిపులలో ఉన్నాయి. వాస్తవానికి ఇవి హిందూ ఆలయంలో ఏర్పాటు చేసిన శిలాశాసనాలు. వాటిని మసీదు నిర్మాణంలో ఉపయోగించారు. ఈ శాసనాల మీద జనార్దన, రుద్ర, ఉమేశ్వర అనే దేవుళ్ల పేర్లు ఉన్నాయి' అని ఏఎస్ఐ నివేదిక వెల్లడించిందని విష్ణుశంకర్ జైన్ తెలిపారు. ఆలయం గోడల మీద చిత్రించిన కమలం గుర్తులను తొలగించి ఆ గోడలను మసీదు నిర్మాణంలో ఉపయోగించిన ఆధారాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.

భూమిలో కూరుకుపోయిన విగ్రహాలు

ఏఎస్ఐ సర్వే నివేదికలోని ఇతర వివరాలు కొన్ని వెబ్‌సైట్లలో వెల్లడయ్యాయి. వాటి ప్రకారం.. 17వ శతాబ్దంలో ఔరంగజేబు పాలన కాలంలో, అక్కడున్న ఆలయాన్ని ధ్వంసం చేసి మసీదును నిర్మించారు. అక్కడ లభించిన శిథిలాలు, వెల్లడైన కళాకృతులు, శాసనాలు, శిల్పరీతిని బట్టి అక్కడ అంతకుముందు హిందూ ఆలయం ఉండేదని శాస్త్రీయ అధ్యయనం రుజువు చేస్తోంది. దేవతల విగ్రహాలు, శిల్పాలు భూమిలో కూరుకుపోయి కనిపించాయి. పశ్చిమం వైపున్న ఆవరణలో తోరణంతో కూడిన భారీ ప్రవేశద్వారం ఉంది. పక్షులు, జంతువులు, పుష్పాలను చిత్రించిన ఒక చిన్న ద్వారం ఉంది. గోడలను లతలతో తీర్చిదిద్దారు. పశ్చిమం వైపున్న గోడ యథాతథంగా అంతకుముందటి ఆలయంలోనిదే. మసీదులోని ఒక గదిలో ఓ శాసనం లభ్యమైంది. అయితే దాని మీద మసీదు నిర్మాణం, విస్తరణకు సంబంధించిన సమాచారాన్ని చెరిపివేయటం కనిపించింది. అంతకుముందున్న ఆలయం విధ్వంసానికి ఔరంగజేబు ఇచ్చిన ఆదేశాలకు సంబంధించినదిగా ఈ శాసనాన్ని భావిస్తున్నారు.

నేపథ్యం ఇదీ..

వారణాసిలో విశ్వనాథుడి ఆలయం పక్కన ఉన్న మసీదు కింద ఆలయం ఉందని హిందూ కక్షిదారులు జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో.. కోర్టు ఆ ప్రాంతంలో ఏఎస్ఐ సర్వేకు గత ఏడాది జూలై 21న ఆదేశించింది. సర్వే జరిపిన ఏఎస్ఐ తన నివేదికను కోర్టుకు డిసెంబరు 18న సమర్పించింది. ఈ సర్వే నివేదిక ప్రతిని తమకు అందజేయాలని హిందూ, ముస్లిం కక్షిదారులు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. కోర్టు అందుకు అంగీకరించటంతో కక్షిదారులకు నివేదిక ప్రతులను అందించారు.

అయోధ్యలో దర్శన సమయం పొడిగింపు

అయోధ్య, జనవరి 25: అయోధ్య రామమందిరానికి భక్తులు పోటెత్తుతూనే ఉన్నారు. విపరీతమైన రద్దీ నేపథ్యంలో ఆలయ అధికారులు దర్శన వేళలను పొడిగించారు. గురువారం ఉదయం 6గంటల నుంచే బాల రాముడి దర్శనానికి భక్తులను అనుమతించారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకూ పూజలు, దర్శనాలకు అనుమతించాలని ట్రస్టు నిర్ణయించింది. మధ్యాహ్నం 12గంటలకు హారతి, భోగ్ కోసం 15 నిమిషాలు కేటాయించారు. ఇంతకు ముందు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ దర్శనాలకు అనుమతి ఉండేది. ఇందులో 2గంటలు విరామం ఇచ్చేవారు. ఇక వాహనాల రాకపోకలను నియంత్రించడంలో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారులను మూసివేశారు. ఈ నెల 22న ప్రాణప్రతిష్ఠ అనంతరం లక్షలాది మంది యాత్రికులు అయోధ్యకు తరలివస్తుండటంతో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఆలయం వెలుపల ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సెంట్రల్ రిజర్వ్ ఫోర్స్ బలగాలను మోహరించారు.

1,132 మందికి పోలీసు పతకాలు

- వారిలో 277 మందికి శౌర్య పతకాలు
- నక్సల్స్‌పై పోరులో పాల్గొన్న 119 మందికి కూడా
- కాంగోలో మృతిచెందిన బీఎస్ఎఫ్ జవాన్లకు పతకాలు

న్యూఢిల్లీ, జనవరి 25: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు, ఫైర్, జైళ్లు, హోంగార్డులు, సివిల్ డిఫెన్స్‌కు చెందిన 1,132 మంది శౌర్య, సేవా పతకాలకు ఎంపికయ్యారు. గతంలో 16 కేటగిరీల్లో ఉన్న శౌర్య పతకాలను నాలుగింటికి కుదించారు. వాటిల్లో రాష్ట్రపతి శౌర్య పతకం(పీఎంజీ), శౌర్య పతకం(జీఎం), రాష్ట్రపతి విశిష్ట సేవాపతకం(పీఎస్ఎం), విశిష్ట సేవాపతకం(ఎంఎస్ఎం) ఉన్నాయి. ఐక్య రాజ్య సమితి శాంతి దళంలో భాగంగా కాంగోలో సేవలందిస్తూ.. కాల్పుల్లో మృతిచెందిన ఇద్దరు బీఎస్ఎఫ్ జవాన్లకు రాష్ట్రపతి శౌర్య పతకాలు, 275 మందికి పోలీసు శౌర్య పతకాలు, 102 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవాపతకాలు, 753 మందికి పోలీసు విశిష్ట సేవాపతకాలను కేంద్ర హోంశాఖ ప్రకటించింది. గ్యాలంట్రీ(శౌర్య) అవార్డులను పొందినవారిలో అత్యధికంగా 72 మంది జమ్మూకశ్మీర్ నుంచి.. 26 మంది ఛత్తీస్‌గఢ్, 23 మంది ఝార్ఖండ్, 22 మంది తెలంగాణ నుంచి, 18 మంది మహారాష్ట్ర నుంచి, 12 మంది ఆంధ్రప్రదేశ్ నుంచి ఉన్నారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న 119 మంది, జమ్మూకశ్మీర్‌లో పనిచేస్తున్న 133 మంది పోలీసు విశిష్ట సేవాపతకాలకు ఎంపికయ్యారు. బిహార్‌లో మోస్ట్ వాంటెడ్ కేటగిరీలో ఉన్న ఆరుగురు నక్సల్స్‌ను ఎన్‌కౌంటర్ చేసిన 15 మంది సశస్త్ర సీమాబల్(ఎస్ఎస్‌బీ) సిబ్బందికి కూడా శౌర్య పతకాలు దక్కాయి. ఇక.. సీఐఎస్ఎఫ్ నుంచి విశిష్ట సేవాపతకానికి ఎంపికైన వారిలో 2005 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి మనోజ్‌కుమార్ శర్మ ఉన్నారు. మధ్యప్రదేశ్‌లోని చంబల్‌లోని మారుమూల ప్రాంతానికి చెందిన ఆయన ఐపీఎస్‌కు ఎంపికవ్వడానికి పడిన శ్రమ ఇతివృత్తంగా ఇటీవల విడుదలైన '12 ఫెయిల్' చిత్రం సూపర్ హిట్టయిన విషయం తెలిసిందే. ఆయన సతీమణి శారద కూడా ఐఆర్ఎస్ హోదాలో డిప్యూటేషన్‌పై సీఐఎస్ఎఫ్‌లో సేవలందిస్తున్నారు.

వెంకయ్య, చిరంజీవికి పద్మవిభూషణ్

(మొదటి పేజీ తరువాయి)

ఒకరికి దక్కాయి. తెలంగాణ నుంచి పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైనవారిలో.. జనగాం ప్రాంతానికి చెందిన చిందు యక్షగానం కళాకారుడు గడ్డం సమ్మయ్య, నారాయణపేట్ జిల్లా దామెరగిద్ద గ్రామానికి చెందిన ప్రముఖ బుర్ర వీణ కళాకారుడు దాసరి కొండప్ప, తనకు విఁగిలిన ఏకైక ఆస్తి అయిన ఇంటిని గ్రంథాలయంగా మార్చి 2 లక్షల పుస్తకాలను సమకూర్చిన డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, బంజారా జాతి జాగృతం కోసం పాటుపడుతున్న కేతావత్ సోమ్‌లాల్, యాదాద్రి సహా పలు ఆలయాల నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ప్రముఖ స్థపతి వేలు ఆనందాచారి ఉన్నారు. అలాగే.. ఏపీకి చెందిన ప్రముఖ హరికథా కళాకారిణి, దేశవిదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చిన డి.ఉమామహేశ్వరికి కూడా కేంద్రం పద్మశ్రీ పురస్కారం ప్రకటించింది.

132 మందికి..

విద్య, వైద్యం, సాహిత్యం, కళలు, సామాజిక సేవ.. ఇలా వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన 132 మంది ప్రముఖులకు ఈ పురస్కారాలను కేంద్రం పద్మ పురస్కారాలను ప్రకటించింది. మొత్తం 132 మందిలో ఐదుగురిని పద్మవిభూషణ్.. 17 మందిని పద్మభూషణ్, 110 మందిని పద్మశ్రీ పురస్కారాలు వరించాయి. బిహార్‌కు చెందిన శాంతిదేవి పాసవాన్, శివన్ పాసవాన్ ద్వయానికి కళల విభాగంలో ఒకటి.. కేరళకు చెందిన అశ్వతి తిరునల్ గౌరి, లక్ష్మీ బాయి తంపురట్టి ద్వయానికి సాహిత్యం, విద్య కేటగిరీలో ఒకటి చొప్పున పద్మశ్రీ పురస్కారాన్ని కేంద్రం ప్రకటించింది. మొత్తమ్మీద ఈ జాబితాలో మొత్తం 30 మంది మహిళలు ఉండగా.. ఎనిమిది మంది విదేశీయులు/ప్రవాస భారతీయులు/భారత మూలాలున్న వ్యక్తులు/ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కేటగిరీవారున్నారు. ఇటీవలే కన్నుమూసిన తమిళ నటుడు.. కెప్టెన్ విజయ్‌కాంత్ సహా తొమ్మిది మందికి మరణానంతర పురస్కారాలను కేంద్రం ప్రకటించింది.

పద్మభూషణ్ గ్రహీతలు..

పద్మవిభూషణ్ పురస్కారాలు లభించిన వారిలో వెంకయ్య నాయుడు, చిరంజీవితో పాటు.. తమిళనాడుకు చెందిన ప్రముఖ సినీ నటి వైజయంతీ మాల బాలి, ప్రముఖ నర్తకి పద్మా సుబ్రహ్మణ్యం, సులభ్ శౌచాలయ వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాఠక్ (మరణానంతర పురస్కారం) ఉన్నారు. ఇక, పద్మభూషణ్ లభించిన వారిలో.. ప్రముఖ సినీ నటుడు మిథున్ చక్రవర్తి, ప్రముఖ గాయని ఉషా ఉతప్, తమిళ నటుడు విజయ్‌కాంత్ (మరణానంతరం), కేంద్ర మాజీ మంత్రి సత్యవ్రత ముఖర్జీ (మరణానంతరం), ప్రముఖ సంగీత దర్శకుడు ప్యారేలాల్, ప్రముఖ వ్యాపారవేత్త సీతారామ్ జిందాల్, మహారాష్ట్రకు చెందిన సీనియర్ జర్నలిస్టు హోమస్‌జీ ఎన్ కామా, తైవాన్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఫాక్స్‌కాన్ గ్రూప్ చైర్మన్ యంగ్ లియూ, సుప్రీంకోర్టులో మొట్టమొదటి మహిళా జడ్జిగా నియమితురాలైన ఎం.ఫాతిమా బీవి (మరణానంతరం), ప్రముఖ గుండె వైద్య నిపుణులు అశ్విన్ బాలచంద్ మెహతా, తేజస్ మధుసూదన్ పటేల్, యూపీ మాజీ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి రామ్ నాయక్, తేజస్ మధుసూదన్ పటేల్, కేంద్ర మాజీ మంత్రి ఓలంచేరి రాజగోపాల్, దత్తాత్రేయ అంబాదాస్ మయాలు, తోగ్దాన్ రిన్‌పోచే (మరణానంతరం), కేంద్ర మాజీ మంత్రి చంద్రేశ్వర్ ప్రసాద్ ఠాకూర్, కుందన్ వ్యాస్ ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి పద్మశ్రీ పురస్కారాలు పొందినవారిలో ముగ్గురు (డి.ఉమామహేశ్వరి, గడ్డం సమ్మయ్య, దాసరి కొండప్ప).. 'అన్‌సంగ్ హీరోస్' పేరిట విడుదల చేసిన 34 మంది జాబితాలో ఉన్నారు. అలాగే, పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన తెలుగేతర ప్రముఖుల్లో.. రోహన్ బోపన్న, జోత్స్న చిన్నప్ప వంటివారు ఉన్నారు.

ధాన్యం అమ్మకానికి గ్లోబల్ టెండర్లు!

గతేడాది యాసంగి ధాన్యం విక్రయానికి గ్రీన్ సిగ్నల్.. ఈ-టెండర్ల నిర్వహణకు రాష్ట్రస్థాయి కమిటీ

- విధివిధానాలు ఖరారు చేయాలని సీఎస్ ఉత్తర్వులు
- గత ప్రభుత్వంలో టెండర్లు పిలిచి రద్దు చేసిన వైనం



హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గతేడాది యాసంగి సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత ప్రభుత్వ హయాంలో టెండర్ల ప్రక్రియను ప్రారంభించి, మధ్యలో రద్దు చేయగా.. మళ్లీ కొత్తగా టెండర్లు పిలవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. టెండర్ల ప్రక్రియను నిర్వహించేందుకు రాష్ట్ర స్థాయి కమిటీ (ఎస్‌ఎల్‌సీ) ఏర్పాటు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రణాళిక శాఖకు చెందిన ప్రిన్సిపల్ సెక్రటరీ ఛైర్మన్‌గా, ఆర్థికశాఖకు చెందిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ, రాష్ట్ర పౌర సరఫరాలశాఖ కమిషనర్, ఈవో-ప్రిన్సిపల్ సెక్రటరీ, రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి, ఇరిగేషన్ అండ్ క్యాడ్ శాఖకు చెందిన రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శిని ఈ కమిటీలో సభ్యులుగా చేర్చారు. ఈ కమిటీ టెండర్ల ప్రక్రియకు మార్గదర్శకాలు రూపొందిస్తుందని, టెండరు డాక్యుమెంట్లు, నిబంధనలు, ఈ-టెండర్ ప్రాసెస్, టెండర్ల దాఖలు, ఎంపిక, కాంట్రాక్టు ఫార్మేషన్.. తదితర అన్ని అంశాలను చూసుకుంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్లోబల్ టెండర్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని సీఎస్ స్పష్టం చేశారు.

గతేడాది టెండర్లలో అవకతవకలతో..

గతేడాది (2022-23) యాసంగి సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి 66.84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. కేంద్ర ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2,060 చొప్పున రైతులకు చెల్లింపులు చేసింది. సేకరించిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు పంపించింది. 67 శాతం రికవరీ రేటు చొప్పున 45.07 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోటాలో రైస్‌మిల్లర్లు ఇవ్వాల్సి ఉండగా... సీఎంఆర్ ప్రక్రియ రాష్ట్రంలో సజావుగా సాగటంలేదు. పైపెచ్చు అకాల వర్షాలకు కొంత ధాన్యం తడిసిపోయింది. ఎఫ్‌సీఐ కూడా బాయిల్డ్ రైస్ తీసుకోవటానికి ఆసక్తిని కనబరచలేదు. ఈక్రమంలో కొంత ధాన్యాన్ని టెండర్లు పెట్టి విక్రయించాలని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. అప్పుడు కూడా గ్లోబల్ టెండర్లు పిలిచింది. తొలుత ఒక్కో లాట్‌కు 4 లక్షల టన్నుల ధాన్యం కేటాయించి, 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 6 లాట్లుగా విభజించి టెండర్లు పిలవటంతో స్పందన రాలేదు. ఆ తర్వాత ఒక్కో లాట్‌కు లక్ష టన్నుల చొప్పున 25 లాట్లుగా విభజించి రీ-టెండర్లు పిలిచింది. 2023 ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో నిర్వహించిన ఈ ప్రక్రియలో.. 54 టెండరు బిడ్లు దాఖలయ్యాయి. కాంట్రాక్టర్లు, ట్రేడర్లు, రైస్‌మిల్లర్లు అంతా ఏకమై తక్కువ ధరకు బిడ్డింగ్ కోట్ చేశారు. గరిష్ఠంగా క్వింటాలుకు రూ.1,732 చొప్పున బిడ్డింగ్ దాఖలైంది. టెండర్ల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలు, కాంట్రాక్టు ఏజెన్సీలు కూటమి కట్టిన విధానాలు, ప్రజాధనాన్ని అప్పనంగా దోచుకునే ప్రయత్నాలపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. రూ.1,500 కోట్ల భారీ నష్టానికి ధాన్యం అమ్మే ప్రయత్నాలు చేస్తున్నదని.. రూ.900 కోట్లు దోచుకునేందుకు స్కెచ్ వేయటంతో అప్పటి ప్రభుత్వంపై విమర్శలు వచ్చాయి. దీంతో టెండర్లు రద్దు చేసింది.

ధాన్యం పరిమాణం పెంచుతారా..?

కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా మళ్లీ టెండర్లు పిలవాలని నిర్ణయించింది. 2022-23 యాసంగి ధాన్యాన్ని విక్రయించేందుకు ప్రక్రియ ప్రారంభించింది. 25 లక్షల టన్నులకు టెండర్లు పిలుస్తారా? పరిమాణం పెంచుతారా? తగ్గిస్తారా? అనే అంశంపై రాష్ట్ర స్థాయి కమిటీ నిర్ణయం తీసుకోనుంది.

దళితబంధు వర్తింపజేయలేదని ఎంపీపీపై డీజిల్ పోసి నిప్పంటించే యత్నం

- వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో ఘటన

వనపర్తి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): దళితబంధు వర్తింపజేయలేదని ఇద్దరు వ్యక్తులు ఎంపీపీపై డీజిల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించారు. సమీపంలో ఉన్న వ్యక్తుల అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. బీఆర్‌ఎస్‌కు చెందిన మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి వనపర్తి జిల్లా పాన్‌గల్ ఎంపీపీగా ఉన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గానికి తొలుత 200 దళిత బంధు యూనిట్లు మంజూరవగా మండలాలవారీగా కేటాయించారు. రెండో విడతలో 1,100 యూనిట్లు రాగా లబ్ధిదారుల ఎంపిక తర్వాత ప్రభుత్వం మారడంతో మోక్షం లభించలేదు. అయితే, తమను ఎంపిక చేయలేదంటూ పాన్‌గల్‌కే చెందిన ఆది శ్రీనివాస్, ఆది స్వామి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. వీరిద్దరూ అంతకుముందు ఎంపీపీకి మద్దతుదారులుగా ఉన్నారు. అయితే, బుధవారం రాత్రి భోజనం తర్వాత ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి ఇంటి వద్ద ఉన్న గుడి దగ్గరకు వచ్చారు. అదే సమయంలో అటు వెళ్తున్న స్వామి, శ్రీనివాస్ ఆయనతో వాగ్వాదానికి దిగారు. దాడికి ప్రయత్నించడంతో పాటు బాటిల్‌లోని డీజిల్‌ను ఎంపీపీపై గుమ్మరించి నిప్పంటించబోయారు. సమీపంలో ఉన్న వ్యక్తులు అప్రమత్తమై అడ్డుకున్నారు. కాగా, ఎంపీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితులను స్టేషన్‌కు తీసుకెళ్లారు. పది నిమిషాల్లోనే వదిలేయడంతో వారు ఎంపీపీ ఇంటికి వెళ్లి ఆయన తల్లిదండ్రులను చంపేస్తామని బెదిరించినట్లు ఎంపీపీ అనుచరులు తెలిపారు. దీంతో పోలీసుల తీరును నిరసిస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులు గురువారం స్టేషన్ ఎదుట రాస్తారోకోకు దిగాయి. రాత్రి వేళ కావడంతో నిందితులను వదిలేశామని, వారిపై కేసు నమోదు పెట్టి అరెస్టు చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

మిత్రమా.. నీవెంటే నేనంటూ..

- స్నేహితుడి ఆత్మహత్యతో ఏడాదిగా కలత
- రైలు కిందపడి యువకుడి బలవన్మరణం



విష్ణువర్ధన్ (ఫైల్)

అలంపూర్ చౌరస్తా, జనవరి 25: రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న స్నేహితుడి ఆలోచనలతో ఏడాదిగా దిగాలుగా ఉంటున్న ఆ యువకుడు, ఆ మిత్రుడు బలవన్మరణానికి పాల్పడ్డ చోటే రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. గద్వాల జిల్లా ఉండవల్లి మండల శివారులోని జోగులాంబ రైల్వే హాల్ట్ సమీపంలో ఈ ఘటన జరిగింది. ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరుకు చెందిన విష్ణువర్ధన్ (18) ఉండవల్లి ఐటీఐ కాలేజీలో ఎలక్ట్రికల్ విభాగంలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. అతడి మిత్రుడు, అదే గ్రామానికి చెందిన రమేశ్ నిరుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి రమేశ్ గురించే విష్ణువర్ధన్ ఆలోచించేవాడు. రమేశ్‌తో తన జ్ఞాపకాలను స్టేటస్‌గా పెట్టుకొని, అతడి పేరును టాటూగా వేయించుకున్నాడు. గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బైక్‌పై రమేశ్ చనిపోయిన స్థలానికి వెళ్లాడు. అక్కడి నుంచి తన స్నేహితుడు నాగరాజుకు ఫోన్ చేశాడు. 'అరేయ్ రమేశ్ గాడు చనిపోయిన చోటుకే వచ్చాను.. మరికాసేపట్లో నేనూ వాడివద్దకే వెళ్తున్నాను.. బాయ్‌రా ఇక' అంటూ ఫోన్ కట్ చేశాడు. వెంటనే నాగరాజు తన బావ అయిన మధు, మిత్రుడైన చరణ్‌కు విషయం తెలిపాడు. హుటాహుటిన జోగులాంబ రైల్వేహాల్ట్ వద్దకు వచ్చి చూడగా అప్పటికే విష్ణువర్ధన్ మృతదేహం పట్టాలపై ముక్కలై కనిపించింది.

ఐదేళ్ల చిన్నారిపై 17 ఏళ్ల బాలుడి అత్యాచారం

- పోలీసుల అదుపులో నిందితుడు.. పోక్సో కేసు నమోదు

ఆత్మకూరు, జనవరి 25: వనపర్తి జిల్లా ఆత్మకూరులో ఓ ఐదేళ్ల చిన్నారిపై 17 ఏళ్ల బాలుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. ఆత్మకూరులో ఓ కాలనీకి చెందిన భార్యాభర్తలు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఐదేళ్ల కూతురు ఉంది. అదే కాలనీకి చెందిన ఓ 17 ఏళ్ల బాలుడు ఆ చిన్నారికి చాక్లెట్లు ఎరచూపి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. బుధవారం రాత్రి చిన్నారికి తీవ్ర రక్తస్రావమై, తలనొప్పి రావడంతో తల్లి ఆరా తీయగా విషయం బయటపడింది. బాధితురాలి తల్లి నిందితుడి కుటుంబసభ్యులను నిలదీయగా వారు ఎదురుతిరిగి ఆమెను చితకబాదారు. దీంతో ఆమె గురువారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మా ఊరిలో నేవీ రాడార్ స్టేషన్ వద్దు

- దామగుండం గ్రామస్థుల ధర్నా

పూడూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): తమ ఊరిలో నేవీ రాడార్ స్టేషన్ నిర్మించొద్దంటూ వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామకుండం గ్రామస్థులు, స్థానిక రాజకీయ నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. రాడార్ స్టేషను నిర్మిస్తే రేడియేషన్ ప్రభావంతో.. ఆయుర్వేద, కలప మొక్కలకు, జంతువులు, పక్షులకు మనుగడ ఉండదన్నారు. హై ఫ్రీక్వెన్సీ రేడియేషన్‌తో మనుషులకు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపడుతామని గ్రామస్థులు హెచ్చరించారు.

ఓ చేతిలో స్టీరింగ్.. మరో చేతిలో బీరు..

- మద్యం మత్తులో కారు నడిపి ఒకరి మృతికి కారణమైన యువకుడు
- 3 రోజుల క్రితం జూబ్లీహిల్స్‌లో ఘటన.. ఐదుగురి అరెస్టు



నిందితుడు రిత్విక్

బంజారాహిల్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగమొచ్చిందనే ఆనందంలో పూటుగా తాగి.. స్నేహితులను కారులో ఎక్కించుకొని విచ్చలవిడిగా... ఎతిమీరిన వేగంతో నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ఒకరి మృతికి కారణమయ్యాడు. బీరు తాగుతూనే స్టీరింగ్ తిప్పుతూ కారుతో ద్విచక్ర వాహనదారుడిని ఢీకొడితే.. ఆ బైకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లో మూడు రోజుల క్రితం జరిగిన ప్రమాదానికి సంబంధించి ప్రధాన నిందితుడి సహా ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ వెల్లడించిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ తుకారంగేట్‌కు చెందిన కొవ్వూరి రిత్విక్ రెడ్డికి అమెజాన్‌లో ఉద్యోగమొచ్చింది. ఈ విషయాన్ని తన స్నేహితులతో పంచుకొని.. తాను పనిచేయబోయే కార్యాలయాన్ని చూసి రెస్టారెంట్‌లో బిర్యానీ తినొద్దామని వారికి చెప్పాడు. ఈనెల 23న రాత్రి 10 గంటలకు ఇంటి వద్ద తన బావకు చెందిన కారును బయటకు తీశాడు. తొలుత తన స్నేహితురాలైన వైష్ణవిని కారులో ఎక్కించుకొని లాలాపేట్ వెళ్లి అక్కడ స్నేహితుడు పోల్సాని లోకేశ్వర్‌రావును ఎక్కించుకున్నాడు. అటు నుంచి మారేడ్‌పల్లి వెళ్లి అనికేత్‌ను, మౌలాలిలో అభిలాషను కారులో ఎక్కించుకొని తుకారం గేట్ దగ్గరకు వచ్చి నాలుగు బీర్లు కొనుగోలు చేశాడు. రిత్విక్ రెడ్డి మద్యం తాగుతూనే కారు నడిపాడు. నగరంలోని పలు ప్రాంతాల్లో చక్కర్లు కొట్టి మాదాపూర్‌లో తాను పనిచేయనున్న కంపెనీని స్నేహితులకు చూపించాడు. అప్పటికే రుత్విక్ రెడ్డి మూడు బీర్లు తాగాడు. అక్కడి నుంచి ఐదుగురు కలిసి మాదాపూర్‌లోని ఓ రెస్టారెంట్‌కి వచ్చి బిర్యానీ తిన్నారు. అక్కడి నుంచి ఐదుగురూ కారులో ఇంటికి వెళ్లే క్రమంలో వాహనాన్ని అతివేగంగా నడిపి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లో బైక్‌ను ఢీ కొట్టి ఆగకుండా వెళ్లిపోయారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న బౌన్సర్ లింగాల తారక్‌రామ్ మృతి చెందగా రాజు అనే బౌన్సర్ గాయపడ్డాడు. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలను సేకరించిన పోలీసులు.. నిందితులను అమీర్‌పేట్ మైత్రివనం వద్ద ప్రమాదం జరిగిన 12 గంటల్లోపు అదుపులోకి తీసుకున్నారు.

సీసీ కెమెరాలకు చిక్కొద్దని..

ప్రమాదం జరిగాక ఆగకుండా కారులో పంజాగుట్ట వరకు వచ్చిన నిందితులు తుకారం గేటుకు వెళ్తే సీసీ కెమెరాల్లో దొరికే ప్రమాదం ఉందని గ్రహించి బల్కంపేట మీదుగా బాలనగర్‌లోని బంధువైన గుడిమెట్ల సురేశ్ రెడ్డి ఇంటికి వెళ్లి జరిగింది చెప్పారు. ప్రమాదానికి కారణమైన కారును అక్కడే ఉంచి మరో కారులో ఆరుగురు కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. అక్కడ ఒకరు మృతి చెంది పడివుండటం, పోలీసులు హడావుడిని చూసి భయపడి అక్కడి నుంచి పారిపోయారు. పోలీసులు కేసును ఛేదించి అందర్నీ పట్టుకున్నారు. కారును సీజ్ చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకోగా సురేశ్ రెడ్డి పరారీలో ఉన్నాడు.

మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక

- అసెంబ్లీ సమావేశాల నాటికి ప్రభుత్వానికి అందుతుంది
- ప్రాథమిక విచారణ నివేదిక నాకు రాలేదు: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల నాటికి మేడిగడ్డపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ నివేదిక ప్రభుత్వానికి వస్తుందని నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ప్రాథమిక విచారణ నివేదిక ఇప్పటిదాకా తన చేతికి చేరలేదని ఆయన గురువారం గాంధీభవన్‌లో మీడియాకు వెల్లడించారు. త్వరలోనే అసెంబ్లీ సమావేశాల షెడ్యూల్‌ను ప్రకటించనున్నామన్నారు. ఇక కేటీఆర్ భ్రమల్లో బతకడం మానేసి... వాస్తవంలోకి రావాలని సూచించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఉనికి ఇక కష్టమేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో 13 ఎంపీ సీట్లు కాంగ్రెస్‌కి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యనే ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్న ఉత్తమ్.. సమస్యలను లిఖిత పూర్వకంగా అందజేస్తే నమోదు చేసుకుని దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అజారుద్దీన్ నారాజ్!

- ఎమ్మెల్సీ దక్కక పోవడంపై కినుక
- కాంగ్రెస్ పార్టీకి రాజీనామాకు యోచన

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ కోటాలోనూ ఎమ్మెల్సీ సీటు దక్కకపోవడంతో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పార్టీకి 20 ఏళ్లుగా సేవలు అందిస్తున్న తనకు కాకుండా ఓ పత్రికాధిపతికి ఎలా ఇస్తారంటూ పార్టీ నేతల వద్ద ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పార్టీకి రాజీనామా చేసే ఆలోచనలో అజారుద్దీన్ ఉన్నారని, అయితే అధిష్ఠానం పెద్దలతో మాట్లాడాకే తుది నిర్ణయం తీసుకోనున్నారని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలైన అజారుద్దీన్.. గవర్నర్ కోటాలో క్రీడా రంగం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యేందుకు తన వంతు ప్రయత్నాలు చేశారు. ఆయనతో పాటుగా మాజీ మంత్రి షబ్బీర్ అలీ సైతం ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ సీటు కోసం ప్రయత్నించారు. పార్టీ నేత ఫిరోజ్ ఖాన్ పేరు కూడా వినిపించింది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన వారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వొద్దనే నియమం పెట్టుకున్న నేపథ్యంలో ఆ కారణంతో షబ్బీర్ అలీ, అజారుద్దీన్, ఫిరోజ్‌ఖాన్‌లకు ఎమ్మెల్సీ ఇచ్చేందుకు అధిష్ఠానం నిరాకరించింది. షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుగా సీఎం రేవంత్‌రెడ్డి నియమించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సరైన చికిత్స...!

కాస్తంత ఒళ్ళు వెచ్చబడి, దగ్గూ జలుబూ తోడైతే ఓ నాలుగురోజులు యాంటీబయాటిక్స్ వాడేయడం అలవాటుగా మారినకాలంలో కేంద్ర ఆరోగ్యశాఖ ఇటీవల జారీచేసిన ఆదేశాలు మెచ్చుకోదగినవి. వైరల్ ఇన్ఫెక్షన్లకు సైతం యాంటీబయాటిక్స్ రాసేస్తున్న వైద్యుల సంఖ్య అధికంగా ఉన్నందువల్ల కాబోలు, ఈ మందుల విషయంలో కాస్తంత బాధ్యతగా నడుచుకోమని అది ఆదేశాలు జారీ చేసింది. రోగికి ఈ మందులు సూచించడానికి దారితీసిన నిర్దిష్టమైన కారణాలని కూడా వైద్యుడు విధిగా రాయాలని, ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపులవారు ఈ మందులను అమ్మకూడదని ఆరోగ్యశాఖ పేర్కొంది. ఇది సూచనో, హెచ్చరికో, ఆదేశమో తెలియదు. ఈ మార్గదర్శకాలను ఉల్లంఘించినపక్షంలో సహించేది లేదని ఆరోగ్యశాఖ అటు వైద్యులను కానీ, ఇటు దుకాణదారులను కానీ ప్రత్యేకంగా హెచ్చరించలేదు. డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ నిబంధనల్లో యాంటీబయోటిక్స్ ఇప్పటికే షెడ్యూల్ హెచ్, హెచ్1లో ఉన్నాయి. అర్హతగల వైద్యుడు రాసిచ్చిన చీటీ ఆధారంగానే వాటిని దుకాణదారు అమ్మాలి. అయినా, ప్రిస్క్రిప్షన్ లేకుండానే వాటి అమ్మకం జోరుగా సాగిపోతున్నది. గతంలోనూ పలుమార్లు ఇటువంటి ఆదేశాలు వెలువడిన నేపథ్యంలో, కేంద్ర ఆరోగ్యశాఖ వాటిని మరోమారు గుర్తుచేసిందని మాత్రమే అనుకోవాలి. అలాగే, వీటిని ఏ దశలో, ఎటువంటి రోగిమీద ప్రయోగించాలన్నది ఏళ్ళతరబడి వైద్యశాస్త్రం చదివిన వైద్యులకూ తెలుసు. ఇప్పుడు కార్యకారణసంబంధాలను కూడా విధిగా ప్రస్తావించాలన్న నియమం వారిమీద ఏ మేరకు పనిచేస్తుందో చూడాలి.

నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ ఒక ఏడాదిపాటు పదిహేను రాష్ట్రాల్లో నిర్వహించిన అధ్యయన ఫలితాలను కేంద్ర ఆరోగ్యశాఖ ఇటీవల ప్రకటించింది. పదివేలమంది ఆస్పత్రి పేషంట్లమీద యాంటీబయాటిక్స్ వాడకం ఏ విధంగా ఉన్నదో ఆ సర్వే గమనించింది. మిగతా వివరాలను అటుంచితే, 94శాతం మందికి కచ్చితమైన డయాగ్నసిస్ జరిగి, ఇన్ఫెక్షన్ మూలం రూఢీకాకముందే యాంటీబయాటిక్స్ ప్రయోగం జరిగిపోయిందని ఈ సర్వే చెబుతోంది. వీటి వాడకం తప్పదని ఇదమిత్థంగా తేలినతరువాత ఇచ్చింది ఆరుశాతంమందికి మాత్రమేనని సర్వే గ్రహించింది. కేవలం లక్షణాల ఆధారంగా రోగికి వైద్యుడు యాంటీబయాటిక్స్ రాయడమే అత్యధికశాతంమంది విషయంలో జరుగుతోంది. ఇక, ఇంటెన్సివ్ కేర్‌లో ఉన్నవారికీ, ఇతరవార్డుల్లో ఉన్నవారికీ మధ్య ఈ మందుల ప్రయోగంలో తేడా స్వల్పమేనని, వీటిని అత్యధికంగా వాడుతూండటం దేశంలో యాంటీ బయాటిక్ రెసిస్టెన్స్ హెచ్చడానికి దారితీస్తున్నదని ఈ సర్వే తేల్చింది.

అరుదుగా, ఆపదలో మాత్రమే వాడాల్సిన ఈ మందులను మనదేశంలో ప్రజలు, వైద్యులు యథేచ్ఛగా వాడుతున్నట్టు లాన్సెట్ వంటివి చెప్పడమే కాక, అనుభవంలోనూ ఉన్నదే. మందులషాపుల్లో కొనుక్కొని వాటిని మింగే అలవాటు మిగతాదేశాల్లో కంటే మనకు ఎక్కువే. ఈ దుర్వినియోగంతో అవి క్రమంగా పనిచేయకపోవడం, దేహానికి మేలు చేసే బాక్టీరియా బలహీనపడటం, రోగనిరోధకశక్తి సన్నగిల్లడం, జీర్ణాశయ సమస్యలతో సహా కొత్తరోగాలు పుట్టుకురావడం వంటి ప్రమాదాలున్నాయని తెలియకపోదు. కానీ, యాంటీబయాటిక్స్ చుట్టూ వేలకోట్ల వ్యాపారం జరుగుతూనే ఉంది, ప్రభుత్వాలు అప్పుడప్పుడు హెచ్చరికలతో చేతులు దులిపేసుకోవడమూ జరుగుతోంది.

రోగలక్షణాలన్నీ వెంటనే మటుమాయం కావాలని, తక్షణ ఉపశమనం దక్కాలని తమదగ్గరకు వచ్చే పేషెంట్లు డిమాండ్ చేస్తున్నప్పుడు తాము మాత్రం ఏం చేయగలమని వైద్యుల వాదన. రోగనిదానానికి కాస్తంత సమయం పడుతుందన్న గ్రహింపుతో నిదానంగా ఉండే లక్షణం ప్రజల్లోనూ తగ్గింది. కాలంతో పరుగులు తీయాల్సిన పాడుకాలం వల్ల కూడా రోగలక్షణాలను ఎక్కువకాలం భరించే ఓర్పు తగ్గిపోయి, వైద్యుడిని తప్పుబట్టడమూ పెరిగిపోతోంది. కానీ, అతితక్కువగా ఉండే యాంటీబయాటిక్స్‌ను ఎంత ఎక్కువగా దుర్వినియోగం చేస్తే, ఆపదలో అవి ఉపకరించకుండాపోతాయన్న గ్రహింపు ప్రజలకు, వైద్యులకూ ఉండాలి. డాక్టర్నీ, అమ్మకందారుడినీ హెచ్చరించి యాంటీబయాటిక్స్ విస్తృత వినియోగాన్ని నియంత్రించడానికి ఇప్పుడు జరుగుతున్న ప్రయత్నానికి తనిఖీలు, జరిమానాలు కూడా తోడైతేనే కాస్తంత ఫలితం ఉంటుంది. దానితోపాటు, ఈ మందులే కాదు, అన్ని మందులూ అనవసరంగా వాడటం వల్ల వచ్చిపడే ప్రమాదం గురించి ప్రజలను చైతన్యవంతం చేసే పని కూడా విస్తృతంగా జరగాలి.

రామరాజ్యానికి మోదీ రహదారి ఏది?





■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

నరేంద్ర మోదీ 'ప్రతిభావంతుడైన ఒక ఈవెంట్ మేనేజర్ మాత్రమే'నని 2014లో భారతీయ జనతా పార్టీ అగ్ర నాయకుడు లాల్ కృష్ణ అడ్వానీ కొట్టి వేశారు. నాటి సార్వత్రిక ఎన్నికలలో ప్రధానమంత్రి పదవికి బీజేపీ అభ్యర్థిత్వానికై నరేంద్ర మోదీతో ఆయన పోటీ పడవలసివచ్చిన సందర్భమది. ఒక దశాబ్దం అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన 'ఈవెంట్ మేనేజ్‌మెంట్' శక్తి సామర్థ్యాలను తిరుగులేని రీతిలో నిరూపించారు. అయోధ్య రామ మందిరంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం గురించి నేను ప్రస్తావిస్తున్నాను. 1947 అనంతరం భారత ప్రజలు అటువంటి మత–రాజకీయ మహోత్సవాన్ని చూసి ఉండరనడంలో సందేహం లేదు. రాజ్యాధికారం, మతాభినివేశం, మీడియా అత్యుత్సాహం, ప్రజాభీష్టం సమ్మిళితమైన సంఘటనే అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ. బహుశా, దీనికి సాటి రాగల సంఘటన ఏదైనా ఉంటే అది, 1990లో అడ్వాణీ అయోధ్య రథయాత్ర మాత్రమేనని చెప్పవచ్చు. బీజేపీని దేశ రాజకీయాలో కేంద్ర స్థానంలోకి తీసుకు వెళ్లిన సంఘటన అది. ఆ చరిత్రకు తార్కిక ముగింపే రాముడి ప్రాణప్రతిష్ఠ. అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామాలయంలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని దేశ రాజకీయాలో మరికొంత కాలం తిరుగులేని శక్తులుగా నిలబెట్టనున్నది. ఒక విధంగా రఘురాముడికి లభించిన అపూర్వ గౌరవం నరేంద్ర మోదీకి సైతం అపూర్వ గౌరవమే. ఈ గౌరవం మోదీకి చరిత్రలో స్థానాన్ని కల్పించనున్నది.

జి–20 శిఖరాగ్ర సదస్సు నిర్వహణతో మోదీకి 'విశ్వగురు' ప్రతిష్ఠను సమకూర్చింది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న అధికరణ 370 రద్దు, పుల్వామాలో పాక్ ఉగ్రదాడికి దీటైన ప్రతిచర్య మోదీని మహా శక్తిమంతుడైన జాతీయవాది అనే యశో శోభితుడిని చేసింది. బాలాకోట్ దాడి అనంతరం 'ఘర్ మే ఘుస్కర్ మారా' (మనం వారి భూభాగంలోకి వెళ్లి, వారి ఇంటిని కూల్చివేశాం) అన్న ఉద్విగ్నభరిత ప్రకటన 2019 సార్వత్రిక ఎన్నికలలో మోదీ మహాశక్తిని అద్వితీయంగా గెలిపించింది.

ఇప్పుడు అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవం మోదీని మరింత సమున్నత స్థాయికి తీసుకువెళ్లింది. ఆధునిక హిందూ చక్రవర్తి లేదా హిందూ హృదయ్ సమ్రాట్‌గా దేశ ప్రజల మనస్సుల్లో మోదీ సుప్రతిష్ఠితమయ్యారు. మహా వైవిధ్యభరితమైన హిందూ మతంలోని సంప్రదాయ లోపాలు, లొసుగులకు అతీతంగా మోదీ అందరి మనసులను గెలుచుకున్నారు. బాల రాముడిని ఒక తాత్కాలిక శిబిరం నుంచి కొత్తగా నిర్మించిన ఒక దివ్య మందిరంలోకి ఆహ్వానిస్తూ ఈ శుభ సంఘటన చోటుచేసుకున్న జనవరి 22 ఒక మహత్వపూర్ణ తేదీగా రాబోయే 1000 సంవత్సరాలపాటు దేశ ప్రజలు గుర్తుంచుకుంటారని మోదీ ఉద్ఘాటించారు. అయోధ్య ఆలయంలో పూజాది కార్యక్రమాలను ఆయన చాల నిష్ఠగా నిర్వహించారు. అంతకు ముందు దేశంలోని వివిధ ఆలయాలను సందర్శించడంతో పాటు ఆహారాదుల విషయంలో సంప్రదాయం నిర్దేశించిన నిష్ఠలను పాటించారు. మోదీ ఏ ఆలయాన్ని సందర్శించినా టీవీ కెమెరాలు ఆయన ప్రతి కదలికను ప్రజలకు విపులంగా చూపాయి. మోదీ ఉద్దేశపూర్వకంగానే మతానికి, రాజ్యవ్యవస్థకు మధ్య ఉన్న విభజన రేఖలను చెరిపివేశారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే మతమే రాజ్యంగా రాజ్యమే మతంగా పరిణమించింది.

సంఘ్ పరివార్ దృష్టిలో రామ జన్మభూమి ఆందోళన కేవలం ఒక వివాదాస్పద స్థలంలో రామాలయాన్ని నిర్మించడానికి పరిమితమైనది మాత్రమే కాదు. అది హిందూ మత ఔన్నత్యాన్ని నిశ్చితంగా ప్రకటించడం, హిందువులకు చారిత్రకంగా జరిగిన అవమానాలకు ప్రతీకారం తీర్చుకోవడం. అలాగే నాగరికతా సంబంధాలను నిర్మించుకోవడం, రాజ్యాంగబద్ధమైన లౌకికవాదాన్ని కూలదోసి, తమ సొంత దార్శనికతను ప్రతిబింబించే ఏకీకృత హిందూత్వ రిపబ్లిక్‌ను నిర్మించుకోవడం. ఈ కొత్త గణరాజ్యంలో హిందూ మతాన్ని అనధికారిక రాజ్య మతంగా పాటించడం. సైద్ధాంతిక విశ్వాసాలు, రాజకీయ అనివార్యతల మధ్య ఒక సమతూకాన్ని బీజేపీ చాలా కాలంగా పాటిస్తూ వచ్చింది. వాజపేయి హయాంలో సంకీర్ణ ప్రభుత్వాల సారథిగా అయోధ్యలో రామాలయ నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వలేకపోయింది. మోదీ హయాంలో పార్లమెంటులో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ లభించడంతో అయోధ్యలో రామాలయ నిర్మాణానికి పార్టీ, ప్రభుత్వమూ తమ ఎజెండాలో అగ్ర ప్రాధాన్యమిచ్చాయి. సార్వత్రిక ఎన్నికల సంవత్సరంలో తమకు కలసివచ్చేట్టుగా ఆ ఎజెండాను అమలుపరిచాయి.

ఈ కారణంగానే ప్రధాని మోదీ సంభావ్య విమర్శలను ఉపేక్షించి, నిస్సంకోచంగా ఆలయ ప్రారంభోత్సవ వేడుకలను తానే స్వయంగా నిర్వహించారు. ఆరెస్సెస్ సర్ సంఘ్ సంచాలక్ మోహన్ భాగవత్ కేవలం మోదీకి సహాయకుడుగా మాత్రమే ఆ వేడుకలలో పాల్గొనడం గమనార్హం. 'దేవ్ సే దేశ్, రామ్ సే రాష్ట్ర' (దేవుని నుంచి దేశానికి, రాముడి నుంచి జాతికి) అనేది కొత్త మంత్రంగా ఉన్న భారత్‌కు తనను తాను తిరుగులేని నాయకుడుగా మోదీ ప్రతిష్ఠించుకున్న వైనమది. చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుని అయోధ్యకు ఆహ్వానించిన సాధువులు, సన్యాసులు, ఇతర హిందూ మత పెద్దలు, వివిఐపి సెలెబ్రిటీలు ముక్తకంఠంతో మోదీకి జేజేలు పలికారు.

అయోధ్యకు రాముడు మళ్లీ విచ్చేశాడు. కాలం ఇంతటితో ఆగిపోదు కదా. దేశ ప్రజలకు మరింత మెరుగైన భవిష్యత్తు నిర్మించడం ఎలా? ఇది ఇప్పుడు దేశం ముందున్న ప్రశ్న. మోదీ నిర్వర్తించాల్సిన బృహత్తర బాధ్యత. శ్రీరాముడు అందరివాడని మోదీ ఉద్ఘాటించారు. అయితే చాలా సంవత్సరాలుగా 'జైశ్రీరామ్' అని వీధుల్లో నినదిస్తూ భిన్న మతాల వారిని బెదిరించిన, 1992లో బాబ్రీ మసీదును కూల్చివేసిన నేరానికి పాల్పడిన సంఘ్ పరివార్ కార్యకర్తలు మోదీ అభిభాషణను గౌరవిస్తారా? ఇస్లామిక్ మత ఛాందసవాదానికి ప్రతిస్పందనగా రామాలయ అంశాన్ని ఒక అస్త్రంగా చేసుకోవడం వల్ల మత సామరస్యం దెబ్బతింది. రాజకీయ విభేదాలు తీవ్రమయ్యాయి.

ప్రధానమంత్రి వక్కాణించినట్టు 'రాముడు అగ్ని కాదు, శక్తి, ఒక వివాదం కాదు, ఒక పరిష్కారమే' అయితే మైనారిటీ వర్గాల వారు అణగివుండేలా చేసేందుకు చట్టబద్ధ ప్రక్రియలకు విరుద్ధంగా బుల్‌డోజర్లతో వారిని కుమ్మడం, చావుదెబ్బ కొట్టడం ఎందుకు? హిందూ–ముస్లిం సంబంధాలను 'లవ్ జిహాద్'గా దుష్ప్రచారం చేయడమెందుకు? గోరక్షణ నిషా బృందాలు ముస్లింలను చట్ట విరుద్ధ పద్ధతుల్లో వధించడమెందుకు? భిన్న మతాల వారి మధ్య సదవగాహనను పెంపొందించి సామరస్యాన్ని నెలకొల్పే ప్రయత్నాలు ఎందుకు జరగడంలేదు? ప్రజా జీవితంలో మరింత ఎక్కువగా పాల్గొనేలా ముస్లింలను ఎందుకు ప్రోత్సహించడం లేదు. ముస్లిం జనాభా అత్యధికంగా ఉన్న ఏకైక రాష్ట్రమైన జమ్ము–కశ్మీర్‌ను విభజించి ఒక కేంద్రపాలిత రాష్ట్రంగా చేయవలసిన అవసరమేమిటి? ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌ను సుదీర్ఘ కాలంగా అతలాకుతలం చేస్తున్న జాతుల ఘర్షణపై ప్రధానమంత్రి మౌనంగా ఎందుకు ఉండిపోయారు? సమాజంలోని భిన్న వర్గాల మధ్య అడ్డుగోడలు సృష్టిస్తున్న వివాదాలను సత్వరమే పరిష్కరించేందుకు ఎందుకు శ్రద్ధ చూపడం లేదు? క్రైస్తవ మిషనరీలపై సంఘ్ పరివార్ తరచు చేస్తున్న దాడులను ఎందుకు అరికట్టడం లేదు? అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని నిజంగా ఒక నవశకానికి నాందిగా ఉద్దేశించారా. సకల మత, సర్వ సమత్వ సమ్మిళిత రామరాజ్యానికి ఆ మందిరం ఒక ప్రతీకగా భాసిల్లనున్నదా? ఇటువంటి సదుద్దేశమే ఆ ఆలయ నిర్మాణం వెనుక ఉంటే కుల మతాలకు, ఆర్థిక, సామాజిక అంతరాలకు అతీతంగా పౌరులు అందరినీ సమ భావంతో చూడాలని, వారికి సమ న్యాయం అందించాలని, ఇది భారత లౌకిక రాజ్యవ్యవస్థ విద్యుక్త ధర్మమని ప్రధానమంత్రి దేశపాలనా వ్యవస్థలోని అన్ని స్థాయిలలో ఉన్న తన సహచరులు అందరికీ ఒక దృఢమైన సందేశాన్ని పంపడం ద్వారా ఆ నవశకానికి నాంది పలకాలి. కొన్ని సామాజికవర్గాల వారిని దేశద్రోహులుగా పరిగణించే ధోరణులకు స్వస్తి చెప్పి తీరాలి. అలా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలి. ధరల పెరుగుదలకు 'మియా' కూరగాయల విక్రేతలే కారణమని అస్సాం ముఖ్యమంత్రి ఆరోపించినప్పుడు, పాఠశాల బాలలు శాంటాక్లాజ్ వేషధారణ చేయడాన్ని మధ్యప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా ఆక్షేపించినప్పుడు, ఢిల్లీలో మైనారిటీలను సామాజికంగా, ఆర్థికంగా వెలివేయాలని పిలుపునిచ్చినప్పుడు మౌనంగా ఉండిపోవడం లేదా ఎటువంటి చర్య చేపట్టకపోవడం రామ రాజ్య ఆవిర్భావానికి ఎలా దారితీస్తుంది?

అయోధ్యలో రాముడికి ప్రాణప్రతిష్ఠ కేవలం ఉత్సవ సమయం మాత్రమే కాదు, సత్సంకల్పాలను సత్కార్యాచరణలోకి తీసుకువచ్చేందుకు ఒక మహత్వ పూర్ణ అవకాశాన్ని కల్పించిన సందర్భం కూడా. నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధానమంత్రి కావడాన్ని రాముడి ప్రాణప్రతిష్ఠ ఖాయం చేసింది. ఆ హ్యాట్రిక్ మోదీకి, జవహర్‌లాల్ నెహ్రూ అనంతరం వరుసగా మూడోసారి ప్రధానమంత్రి అయ్యే ఘనతను సమకూర్చుతుంది. అయితే చరిత్రలో తనకు లభించే సుప్రతిష్ఠ సార్థకం కావాలన్నా, తన పాలనా వారసత్వం భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోవాలన్నా అయోధ్యలో రఘురాముడికి ప్రాణప్రతిష్ఠ చేస్తూ దేశప్రజలకు ఇచ్చిన సమున్నత హామీలు, మహోదాత్త వాగ్దానాలను నెరవేర్చాలి. గోధ్రా అనంతర అల్లర్లు 2002–2014 సంవత్సరాల మధ్య నరేంద్ర మోదీకి ప్రజల్లో మతపరమైన చీలికలు సృష్టించే రాజకీయవేత్త అనే కళంకాన్ని కలిగించాయి. ఇప్పుడు చరిత్రలో తన స్థానాన్ని మహోన్నతంగా నిలుపుకునేందుకు ఉద్యుక్తుడు అయినందున మోదీ అటువంటి కళంకాలకు ఆస్కారం లేని రీతుల్లో విశాల దృక్పథంతో దేశ పాలన చేయాలి. అవును, అయోధ్యలో ఆయనే అన్నట్టు ఇది విజయోత్సవ వేళ మాత్రమే కాదు, వినయంగా జాతినిర్మాణానికి సమాయత్తం కావల్సిన శుభ సందర్భం.

> అయోధ్యలో రాముడికి ప్రాణప్రతిష్ఠ నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధానమంత్రి కావడాన్ని ఖాయం చేసింది. ఆ హ్యాట్రిక్ మోదీకి, జవహర్‌లాల్ నెహ్రూ అనంతరం వరుసగా మూడోసార్లి ప్రధానమంత్రి అయ్యే ఘనతను సమకూరుస్తుంది. చరిత్రలో తనకు లభించే సుప్రతిష్ఠ సార్థకం కావాలన్నా, తన పాలనా వారసత్వం భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోవాలన్నా, అయోధ్యలో రఘురాముడికి ప్రాణప్రతిష్ఠ చేస్తూ దేశప్రజలకు ఇచ్చిన సమున్నత హామీలు, మహోదాత్త వాగ్దానాలను మోదీ తప్పక నెరవేర్చాలి.

కళాస్రష్ట కొండపల్లి శతజయంతి వేళ ఒక మాట!

జనవరి 27న ప్రసిద్ధ చిత్రకారులు, స్వాతంత్ర్య సమరయోధులు, నిజాం వ్యతిరేక పోరాటకారులు కొండపల్లి శేషగిరిరావు జయంతి. జయంతి మాత్రమే కాదు, శత జయంతి సందర్భం. వారి కళను, సేవలను ఏడాదిపాటు ప్రభుత్వం ఘనంగా స్మరించుకోవలసిన ఉత్సవ వేళా శుభసందర్భం. ఈ తరుణంలో వారిని ఆత్మీయంగా యాది చేసుకోవడం, ప్రభుత్వానికి చిరు సూచన చేయడం అంటే అది నూతన ప్రభుత్వానికి కూడా వన్నె తేగల సదవకాశమే.

భారతీయ పురాణేతిహాసాల పాత్రలెన్నిటినో తన కుంచెతో అపూర్వంగా మనకు అందించిన కొండపల్లి శేషగిరిరావు తన ఒడిలో ల్యాప్‌టాప్ పెట్టుకుని చిరునవ్వులు చిందించే ఈ చిత్రం తీసిన అదృష్టం నాది. ఇది వారిలోని సంప్రదాయత – ఆధునికతల మేలు కలయికలను రూపుకడుతుంది. అది వారి ప్రత్యేకతను, ప్రయోగాత్మను సైతం వెల్లడి చేసే మంచి జ్ఞాపకం. కాలం గడిచే కొద్దీ వన్నె తేలేది కళా వ్యక్తిత్వమే. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన వారిని వందేళ్ళ సందర్భంగా అక్షరాలా స్మరించుకోవడం తెలంగాణకు మాత్రమే కాదు, తెలుగు ప్రజలకూ గర్వకారణమే.

ఓరుగల్లులో జన్మించిన కొండపల్లి విద్యార్థిగా వారాల అబ్బాయి. మెహిది నవాజ్ జంగ్ ప్రోత్సాహంతో శాంతినికేతన్‌లో చదువుకున్న చిత్రకళా విద్యార్థి. తర్వాత చిత్రకళా ఉపాధ్యాయులు. జేఎన్‌టియూ చిత్రకళా విభాగంలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. పూర్తికాలం చిత్రకారుడిగా జీవితకాలమూ కృషి చేశారు. చిత్రకారులుగా రామాయణ మహాభారతాల వంటి కావ్యాల నుంచి ఎన్నో పాత్రలను తీసుకుని జీవం పోశారు. వారి చిత్రాలలో శకుంతల, దమయంతి వంటి పురాణ పాత్రల రమణీయత చూడవలసిందే తప్ప చెప్పదగినది కాదు. కొలనులో లచ్చి మొదలు విశ్వామిత్రుడు దాకా వారు చూడనిది లేదు, చిత్రించని శైలి లేదు. వరూధినీ ప్రవరాఖ్యుడు మొదలు రాణి రుద్రమ, గణపతి దేవుడు, అన్నమయ్య, త్యాగయ్య వంటి వాగ్గేయకారులు మొదలు శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్నాటి బ్రహ్మనాయుడు వంటి చారిత్రక వ్యక్తుల దాకా, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ నుంచి మొన్నటి మన తెలుగుతల్లి వరకూ వారి చేతుల్లో జీవం పోసుకున్నవే అన్న గ్రహింపు సహృదయులకు ఉన్నదే.

దేశంలో శిల్పకళకు పేరొందిన ఎన్నిటినో, ముఖ్యంగా మన దక్కనీ రాళ్ళను రప్పలనూ, అజంతా ఎల్లోరా రామప్ప రాచకొండలను వారు ఎంత గొప్పగా చిత్రించి పదిలం చేశారో చెప్పనవసరం లేదు. కాలుకు బలపం కట్టుకుని చేర్యాల వెళ్లి కాకిపడగల చిత్రకళను లోకానికి చాటి చెప్పినదీ వీరే కదా. కాకతీయ శిల్పకళను రేఖల్లో నిక్షిప్తం చేసి భావితరాలకు అందించిన తీరు కళాకారులకూ నిరంతర స్ఫూర్తి. కొండపల్లి అందించిన కళా నిధినిక్షేపాల్లో 'సురేఖ' గ్రంథం కాకతీయ శిల్పకళకు మకుటాయమానమైన రేఖల పొదుగు.



తెలంగాణలో ముగ్గురు చిత్రకారుల గురించి మొదట ప్రస్తావించదలిస్తే, ముగ్గురూ మూడు పండుగలకు ప్రతీకలు. వినాయక చవితి అంటే దివంగత పి.టి.రెడ్డిని తలచుకోవాలి. వారి గణేషుడి చిత్ర రాజాలు ఇప్పటికీ అద్వితీయం. వీరు కొండపల్లి కన్నా వయసులో పెద్దలు. ఇక, బతుకమ్మ అంటే కాపు రాజయ్య. వీరు కొండపల్లి తర్వాతి వయస్కులు. ఈ ఏడు కొండపల్లి శత జయంతి అయితే, వచ్చే ఏడూ రాజయ్య గారిది. ఇక, దసరా అంటే కొండపల్లి శేషగిరిరావునే చెప్పాలి.

అవును మరి. కొండపల్లి గారు పోతన భాగవతాన్ని పదహారుసార్లు చదివి అందంగా ప్రశాంతంగా భక్తిభావం వొలికేల చిత్రించిన మాదిరే, అంతకన్నా గొప్ప ఏకాగ్రతతో పూర్ణదీక్షతో నవరాత్రుల సందర్భంగా ఉండేవారు. తన పౌరాణిక అధ్యయనం నుంచి, లోతైన తాత్వికత నుంచి, అంతకుమించి గొప్ప ధ్యానంతో తన మనోనేత్రంతో దుర్గామాతలను వీక్షించి, తొమ్మిది రోజులలో ఒక చిత్రాన్ని ఒక్కో ఏడు ఒక చిత్రాన్ని పూర్తి చేసి, అలా ఆ విశ్వ మాతలను ఆరాధించిన వైనం ఒక తపస్సు. చిత్రకళలో దుర్గామాతను వారివలే కొలిచి, పునీతులు అయిన భారతీయ చిత్రకారులు మరొకరు ఉండరనే అనుకుంటాను.

ఒక్క మాటలో చెప్పాలంటే, చిత్రకళలో వారు కాకిని చిత్రించారు, కావ్య నాయకులనూ చిత్రించారు, దేవీ దేవతలను చిత్రించారు. అనేక విలువైన రచనలూ చేశారు. శిల్పకళ, కుడ్యకళ, అలంకార కళ గురించి లోతైన వ్యాసాలు రాశారు. స్త్రీల చిత్రలిపి గురించి కూడా పరిశోధన గావించారు. తెలంగాణ సోయితో ఆయన చేసిన రచనలు 'చిత్రకళా రమణీయము' గ్రంథంగా వచ్చింది. అది పండిత పామరులనూ నిత్య విద్యార్థులను చేయగల దిక్సూచి. ఇలా పరిపరి విధాలా కొండపల్లి జీవిత పర్యంతం కృషిచేస్తూ తెలంగాణకు విలువైన మేధో ఆస్తిపాస్తులను వదిలి వెళ్లారు. కానీ, వారు సృజించిన అనేక చిత్రకళా ఖండాలను చూడాలంటే ఒక శాశ్వత మ్యూజియం ఇప్పటికీ లేదు. వారి రచనలు విస్తృతంగా ప్రజల్లోకి చేరలేదు కూడా. నూతన తరానికి వారి పట్ల లోతైన అవగాహన లేదంటే అతిశయోక్తి కాదు. ఆ దిశలో గత ప్రభుత్వం కూడా ఎలాంటి చొరవ తీసుకోలేదు. ఇప్పటికైనా ఈ ముగ్గురి కళాకారులనే కాదు, మిగతా వారిని సమున్నతంగా గుర్తించుకునే దిశలో ప్రభుత్వం ఈ ఉత్సవ వేళలోనైనా పూనుకోవాలి.

సాహిత్య రంగంలో గత ప్రభుత్వం కాళోజీ, దాశరథి వంటి వైతాళికులను గుర్తు చేసుకుంటూ వారి పేరిట ఒక విశిష్ట పురస్కారాన్ని ఏర్పాటు చేసింది. కానీ తెలంగాణ గర్వించదగ్గ చిత్రకారుల స్ఫూర్తిని నాటి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇప్పటి ప్రభుత్వమైనా ఉద్దండులైన కళాకారులను గుర్తు చేసుకోవడం తెలంగాణ పునరుజ్జీవనానికి అత్యవసరం. కొండగుర్తు వంటి కొండపల్లి శేషగిరిరావు స్మృతిలో ప్రభుత్వం ఏ చిన్న పని చేసినా విస్మృత కళా రంగానికి అదొక ఒరవడి అవుతుంది. నాందీ ప్రస్తావనగా గుర్తించబడుతుంది. మహోన్నత కళాకారుడిగా, విశిష్ట రచయితగా, విస్తృత పరిశోధకుడిగా కొండపల్లి సేవలను గుర్తుచేసుకోవడం, వారి కళా ఖండాలను పరిరక్షించడం, చిత్రకళా ప్రదర్శనలు నిర్వహించడం, రచనలను గ్రంథాలుగా అచ్చువేయడం, వారి పేరిట గొప్ప పురస్కారం ఏర్పాటు చేయడం, ఒక కళా పీఠాన్ని ఏర్పాటు చేసి స్మారక ప్రసంగాన్ని ప్రారంభించడం – ఇటువంటివన్నీ వారి కోసం కాదు, మనల్ని మనం గౌరవించుకోవడానికే. మన వైభవాన్ని మనం చాటుకోవడానికే. చిత్రకారులుగా ప్రారంభమై నేడు ముఖ్యమంత్రి స్థానంలో కొలువు తీరిన రేవంత్ రెడ్డి గారికి ఈ మాట చేరుతుందనే భావిద్దాం. అంతేకాదు, ప్రభుత్వం ఒక సాంస్కృతిక విధానాన్ని ఏర్పాటు చేసుకుని, సలహాదారులను పెట్టుకునే దశలో ఈ వ్యాసం ఒక చిరు ఆలోచన కలిగించినా మంచిదని రాయడం.

> తెలంగాణ గర్వించదగ్గ చిత్రకారుల స్ఫూర్తిని నాటి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇప్పటి ప్రభుత్వమైనా ఉద్దండులైన కళాకారులను గుర్తు చేసుకోవడం తెలంగాణా పునరుజ్జీవనానికి అత్యవసరం. కొండగుర్తు వంటి కొండపల్లి శేషగిరిరావు స్మృతిలో ప్రభుత్వం ఏ చిన్న పని చేసినా విస్మృత కళా రంగానికి అదొక ఒరవడి అవుతుంది. చిత్రకారులుగా ప్రారంభమై నేడు ముఖ్యమంత్రి స్థానంలో కొలువు తీరిన రేవంత్ రెడ్డికి ఈ మాట చేరుతుందనే భావిద్దాం.

(జనవరి 27: కొండపల్లి శేషగిరిరావు శత జయంతి ఆరంభం)

■ కందుకూరి రమేష్‌బాబు
స్వతంత్ర జర్నలిస్ట్, ఛాయాచిత్రకారుడు

'లలిత కళా అకాడమీ' కావాలి

స్వతహాగా చిత్రకారులైన రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి కావటం తెలంగాణలోని ప్రతి కళాకారునికి ఎంతో సంతోష కారణమైంది. తెలంగాణలో ఎంతోమంది ప్రతిభ కలిగిన చిత్ర, శిల్పకారులున్నారు. వారు కళా ప్రపంచంలో 'తెలంగాణ కళ'కు ప్రత్యేక ముద్రను తీసుకువచ్చారు. ఇక్కడి కళలో తెలంగాణ మట్టి వాసన గుభాళిస్తుంది. ఎన్నో ప్రత్యేకతలున్న తెలంగాణ కళ గత దశాబ్ద పాలనలో ఆదరణలేక వెలవెలపోయింది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇక్కడి కళాకారులు తమ కళతో ప్రజలను చైతన్యపరిచారు. తెలంగాణలోని జిల్లాల్లో పర్యటించి చిత్రకళా ప్రదర్శనల ద్వారా ఉద్యమవ్యాప్తికి పని చేశారు. రాష్ట్ర సాధన పోరాటంలో తమవంతు పాత్రను పోషించారు. తెలంగాణ జేఏసీ కన్వీనర్ కోదండరాం పలు సందర్భాలలో మా ప్రదర్శనలకు వచ్చారు. తెలంగాణ సాధన తర్వాత కళాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఊహించిన కళాకారులకు నిరాశే మిగిలింది.

తెలంగాణ ఏర్పడిన కొత్తలో ప్రభుత్వానికి దగ్గరగా ఉన్నవారు 'ఆర్ట్ తెలంగాణ' అనే సంస్థను ప్రారంభించి కొంతమంది కళాకారులకు మేలు జరిగేలా వ్యవహరించారు. దీనిపట్ల తెలంగాణ కళాకారులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. అయినా గత దశాబ్ద కాలంలో ప్రభుత్వ వైఖరిలో ఏ మార్పూ కనిపించలేదు. తెలంగాణ కళను విశ్వవ్యాప్తం చేయాలంటే ఇక్కడి కళాకారులు సృజనాత్మక క్రియాశీలురుగా తయారుకావడానికి కావలసిన వసతులు, అవకాశాలు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ఆ బాధ్యతను గత ప్రభుత్వం మరిచింది, దశాబ్దకాలం తొక్కిపట్టింది. హైదరాబాదులో ఇందిరా పార్కు ఎదురుగా ఉన్న పద్నాలుగు ఎకరాలలో 'కళాభారతి' నిర్మిస్తామని, ఆర్ట్ మ్యూజియం, ఆర్ట్ గ్యాలరీ, శిల్ప కళామందిరం ఏర్పాటు చేస్తామని ప్రకటించి మరచిపోయింది.

జిల్లాల్లో కళా ప్రదర్శనలకు అవకాశమే లేదు. రాజధాని హైదరాబాద్‌లో కళాభవన్, ఇతర గ్యాలరీలు అరకొర సౌకర్యాలతో నడుస్తున్నాయి. ఈ ప్రదర్శనశాలల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కళాకారులను వారి కళాకృతుల ప్రదర్శనకు, మార్కెట్ చేసుకునే అవకాశాలకు దూరం చేశారు. కళాకారులు ఫీజులు చెల్లించి ప్రదర్శన ఏర్పాటు చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ కార్యాలయాలు, పర్యాటక శాఖ, భాషా సాంస్కృతిక శాఖ, ఇంకా అనేక ప్రభుత్వ శాఖలు కొందరు కళాకారులకే మేలు జరిగేలా వ్యవహరించాయి.

ఈ ప్రాంత కళాకారులు సృజనాత్మక కళల్లో ప్రావీణ్యం సంపాదించడానికి, భవిష్యత్తులో మంచి కళాకారులుగా ఎదిగి ప్రపంచానికి తెలంగాణ కళలను పరిచయం చేయడానికి ఇక్కడ 'లలిత కళా అకాడమీ' ఏర్పాటు చేయవలసిన అవశ్యకత ఎంతో ఉంది. సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ ఇలా అన్నింటికీ అకాడమీలు ఉన్నప్పుడు చిత్ర, శిల్పకళలకు సంబంధించి 'తెలంగాణ లలిత కళా అకాడమీ' ఎందుకు ఉండకూడదు? రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ చిత్ర, శిల్ప కళలకు సంబంధించి వెంటనే ఈ అకాడమీ ఏర్పాటుచేసి, ఇక్కడి కళాకారులకు సహకారం అందించాలి.

తెలంగాణలోని బాలలు కళను నేర్చుకొనేందుకు వీలుగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చిత్రకళా ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టాలి. ఇంకా హైదరాబాద్‌లో జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఒక ఆర్ట్ కళాశాల మాత్రమే ఉంది. దీనిని అరకొర సౌకర్యాలతో నడుపుతున్నారు. ఈ విషయంపై దృష్టి సారించి, ఇంకా కొన్ని కళాశాలలను జిల్లాల్లో ఏర్పాటు చేయాలి. తెలంగాణ ఉద్యమంలో చిత్రకారుల పాత్రను గుర్తించవలసిన సమయం ఇది. మా ఆశలు, ఆకాంక్షలు నెరవేరుస్తారని, తెలంగాణ కళకు ఉజ్వల భవిష్యత్తు వస్తుందని ఆశిస్తున్నాం.

– శ్రీచంద్ర, 'చిత్ర' విఘ్నేశ్వరాచారి
తెలంగాణా చిత్రకారుల వేదిక

రాహుల్ యాత్ర: భయంలో బీజేపీ!

గత రెండు సార్వత్రిక ఎన్నికల్లోనూ ఓటమి పాలైన కాంగ్రెస్ పార్టీకి జవసత్వాలు నింపేందుకు గాంధీయేతర కుటుంబానికి పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పిన రాహుల్‌గాంధీ, ప్రజల కష్టసుఖాలను తెలుసుకునేందుకు భారత్ జోడో యాత్ర చేశారు. 12 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో, 136 రోజుల పాటు కన్యాకుమారి నుండి జమ్మూకాశ్మీర్ వరకు 4080 కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. లక్షలాది మంది ప్రజలు, కవులు, కళాకారులు, ప్రజాస్వామ్యవాదులు, సామాజిక కార్యకర్తలు ఈ ఉద్యమంలో స్వచ్ఛందంగా పాల్గొని గళాన్ని వినిపించారు. దాని ప్రభావం కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో భారత్ జోడో యాత్ర కొనసాగిన జిల్లాల్లో పడింది. అక్కడ వచ్చిన ఫలితాలు ఆ విషయం రుజువు చేశాయి. యాత్ర సందర్భంగా రాహుల్ సంధించిన ప్రశ్నలు, కేంద్ర ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఆయా రాష్ట్రాల అస్తిత్వ సమస్యలు, ప్రతిపాదించిన గుణాత్మక పరిపాలన విధానాల వల్ల కర్ణాటకలో అధికారంలో ఉన్న బీజేపీ తమ అభ్యర్థులను గెలిపించుకోలేని దుస్థితి వచ్చింది.

2014 లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ముక్త భారత్ పేరుతో, హిందుత్వ ఎజెండాగా 282 స్థానాలు గెలిచిన భారతీయ జనతా పార్టీ 2019లో 303 సీట్లతో అజేయంగా నిలవడానికి విపక్షాల ద్వంద్వ వైఖరే కారణం. ప్రజలు కేంద్రంలో అధికారం మార్పు కోరుకుంటున్నా, దాన్ని అందిపుచ్చుకోవడానికి విపక్షాలు సిద్ధంగా లేవు. అవి తమ సొంత ఎజెండాతో ముందుకు సాగడం వల్ల, ప్రజల్లో నమ్మకం సన్నగిల్లి అపశకునాలు ఎదురవుతున్నాయి. దేశంలో బీజేపీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో విపక్షాలు పూర్తిగా విఫలమయ్యాయి. నాడు ఎన్నికల ప్రచారంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, సంకీర్ణ ప్రభుత్వాలతో అభివృద్ధి జరగదని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఉపన్యాసాలతో నమ్మించి మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టి రైతుల, యువత గొంతు కోసింది. కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు తెచ్చిన నల్లచట్టాలతో వ్యవసాయరంగం ప్రమాదంలో పడనున్నదని నిపుణులు చెప్పినా ఖాతరుచేయలేదు. ఇలా చెప్పుకుంటూ వెళ్తే కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు అనేకం. విపక్షాల అనైక్యత కారణంగా కేంద్రప్రభుత్వాన్ని అవి తగిన స్థాయిలో ఎండగట్టలేకపోయాయి. దేశ ప్రజలకు ఇచ్చిన హామీలపై విపక్షాలు పార్లమెంటులో, వెలుపల గొంతెత్తితే నిమ్మకు నీరెత్తినట్టు అధికార పార్టీ వ్యవహరించింది. భారతదేశం ప్రజాస్వామ్య దేశం అంటూ ప్రపంచదేశాలు చెప్పుకుంటాయి. కానీ, దేశ పార్లమెంటరీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 146 మంది ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేసి ప్రజా వ్యతిరేక బిల్లులను ఆమోదించడం బీజేపీ అప్రజాస్వామిక పాలనకు నిలువెత్తు నిదర్శనం. ఈ నియంతృత్వ వైఖరివల్ల బీజేపీకి సుదీర్ఘకాలం మిత్రులుగా కొనసాగిన ఉద్ధవ్ శివసేన, అకాలీదళ్ దూరమైనాయి. దక్షిణాదిన పాగా వేయాలని కలలుకన్న బీజేపీకి కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత ప్రమాద ఘంటికలు మోగాయి. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఫలితాలు వాపును చూసి బలుపు అనుకుంటే పొరపాటే. అక్కడి ప్రజలు అసెంబ్లీకి అవకాశం ఇస్తే, పార్లమెంట్‌కు ఇవ్వరని గత ఫలితాలు చెబుతున్నాయి.

భారత్ జోడో యాత్రకు వచ్చిన ఆదరణ చూసిన రాహుల్ గాంధీ, ప్రజలతో మరోమారు మమేకం కావాలనే సంకల్పంతో భారత జోడో న్యాయయాత్ర ఆరంభించారు. ఈ నెల 14న మణిపూర్‌లో మొదలైన ఈ యాత్ర మార్చి 20న ముంబైలో ముగుస్తుంది. ఈ యాత్రలో జీఎస్టీ పేరుతో ప్రభుత్వం చేస్తున్న దోపిడీని, గ్యాస్, డీజిల్, పెట్రోల్ అధిక ధరల భారాన్ని, సామాన్యులకు జరుగుతున్న అన్యాయాలను రాహుల్ దేశ ప్రజలకు చాటి చెప్పనున్నారు. దేశవ్యాప్తంగా, మహిళలు, దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ న్యాయం కోసం నినదించనున్నారు. 15 రాష్ట్రాల్లోని 110 జిల్లాల్లో 6,713 కిలోమీటర్ల మేర ఈ యాత్ర కొనసాగితే తాను హ్యాట్రిక్ మిస్ అవుతాననే భావనతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడుగడుగునా అవరోధాలు కల్పిస్తున్నది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, కేంద్ర–రాష్ట్రాల సమాఖ్య స్ఫూర్తికి భంగం కల్గిస్తూ ఫాసిస్టు పాలన కొనసాగిస్తున్న బీజేపీని గద్దెదించడానికి భారత్ జోడో న్యాయ యాత్ర దోహదపడుతుందనే నమ్మకం కాంగ్రెస్ శ్రేణుల్లోనే కాదు, ప్రజాస్వామ్యవాదుల్లోనూ ఏర్పడింది.



మూడు రాష్ట్రాల్లో గెలుపొందిన బీజేపీ 2024లో 400 సీట్లు కైవసం చేసుకుంటామని చెబుతోంది. అయితే ఓటు షేర్ భాజపా కంటే కూడా కాంగ్రెస్‌కు పెరిగిందంటే అది అతిశయోక్తి కాదు. ఇండియా కూటమిలో దాదాపు పాతిక పార్టీలు బీజేపీని ఓడించే క్రమంలో ఒక్కతాటి మీదికి వచ్చాయి. ఇదే అదనుగా దేశంలో నరేంద్ర మోదీని వ్యతిరేకిస్తున్న బలమైన ప్రాంతీయ పార్టీలు ఎన్నికల్లో పరస్పరం సహకరించుకుంటే కాంగ్రెస్‌కు మేలు జరుగుతుందనే భావన ప్రధానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. కట్ చేస్తే భారత్ జోడో న్యాయ యాత్ర చేపట్టాలన్న ప్రతిపాదన ఇండియా కూటమిలో కాంగ్రెస్ పెట్టలేదని నితీష్ దీర్ఘాలు తీయడం వెనుక బీజేపీ పాత్ర ఉన్నదనే రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం.

• డాక్టర్ సంగని మల్లేశ్వర్
కాకతీయ విశ్వవిద్యాలయం

రాజ్యాంగమే మన వెలుగుబాట

భారత రాజ్యాంగం 1950, జనవరి 26న అమలులోకి వచ్చింది. డా. బాబూ రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో రాజ్యాంగాన్ని రూపొందించి, ఆమోదించింది భారత రాజ్యాంగసభ. బాబా సాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. ప్రజలు రాజ్యాంగబద్ధ విధానాల ద్వారానే తమ సమస్యలను పరిష్కరించుకోవాలని అంబేడ్కర్ పిలుపునిచ్చారు. కానీ నేటికీ రక్తపాత విప్లవం ద్వారా మార్పు కోసం నక్సలైట్లు పనిచేయడం దురదృష్టకరం. పరిపాలకులు కూడా ప్రజల సమస్యలను మొదటి దశలోనే గుర్తించి సకాలంలో పరిష్కరించే ప్రయత్నం చేయాలి.

రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా చట్టసభలు చట్టాలు చేయాలి. ఈ చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉన్నాయా లేదా అన్నది తేల్చాల్సింది ఉన్నత న్యాయస్థానాలు. రాజ్యాంగంలో ఉన్న 'అత్యయిక పరిస్థితి' నిబంధనను దుర్వినియోగం చేసి, ఆనాటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ తన అధికారాన్ని, పదవిని కాపాడుకోవడానికి ప్రయత్నించారు. ఆ చీకటి కాలంలో కొంత మంది ఉన్నత న్యాయమూర్తులు సైతం తమ పదవుల కోసం దానిని సమర్థించారు. అదో చీకటి అధ్యాయం.

భారత రాజ్యాంగ పీఠిక (Pre-amble)పై రాజ్యాంగసభలో వారం రోజులు విస్తృత చర్చ జరిగింది. కొందరు సెక్యులర్, సోషలిస్టు పదాలను జోడించాలని సూచించారు. వారి సలహాలను డా.అంబేడ్కర్ తార్కికంగా తిరస్కరించారు. 1975 అత్యయిక పరిస్థితిలో ప్రతిపక్ష నాయకులు జైలులో ఉన్న వేళ, సమగ్ర చర్చ లేకుండానే భారత రాజ్యాంగ పీఠికలో సోషలిస్టు, సెక్యులరిస్ట్ పదాలను జోడించారు. నేటి వ్యవహారంలో సెక్యులరిజం అంటే మత సమభావన కాదు. ధర్మ(మత) వ్యతిరేక, హిందూ వ్యతిరేక, మైనారిటీ మతాల సమర్థనగా చెలామణి అవుతున్నది.

కొన్ని విజాతీయ శక్తులు నిర్మించిన భ్రమల వల్ల మన దేశానికి, అయోధ్య సమస్య పరిష్కారానికి నష్టం వాటిల్లింది. భారతదేశపు ఆత్మకు ప్రతీక అయిన అయోధ్యలో శ్రీరామ జన్మభూమి కోసం ఈ దేశ ప్రజలు 74 ఏళ్లు పోరాటాలు చేశారు. 1947 నుంచి న్యాయ స్థానాలలో కేసులు నిరవధికంగా కొనసాగాయి. ప్రజాజాగరణ ఉద్యమాలు, కరసేవకుల బలిదానాలు, ప్రజల ఆగ్రహం వల్ల, ఎట్టకేలకు సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు మేరకు బాల రాముని మందిర నిర్మాణం సుగమం అయింది. రామ మందిర నిర్మాణ పనులు చురుకుగా సాగి, జనవరి 22న అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. 550 సంవత్సరాల క్లిష్ట సమస్యకు భారత రాజ్యాంగం ఆధారంగా భారత న్యాయ వ్యవస్థ సమస్యను పరిష్కరించింది. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మన భారతదేశాన్ని ఒక సుసంపన్న దేశంగా తీర్చిదిద్దుకుందాం.

– శ్యాం ప్రసాద్
అఖిల భారతీయ సామాజిక సమరసత ప్రముఖ్

గురువారం ఉష్ణోగ్రత గరిష్టం 30.7 కనిష్టం 20.0





ఉప్పల్ స్టేడియంలో విద్యార్థులు

టెస్ట్ మ్యాచ్.. విద్యార్థుల జోష్

- మైదానంలోకి దూసుకెళ్లిన అభిమాని
- యువకుడిపై కేసు

6





గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని త్రివర్ణ కాంతుల్లో ధగధగలాడుతున్న సచివాలయం, అసెంబ్లీ

రాజ్‌భవన్, పబ్లిక్ గార్డెన్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

8



నేడు మహా హారతి

ఖైరతాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా నేడు భరతమాత మహాహారతి నిర్వహించనున్నారు. ఏటా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందుకోసం గురువారం రాత్రి ఐమాక్స్ పక్కనున్న ఖాళీ స్థలం నుంచి కార్యక్రమం జరగనున్న పీపుల్స్ ప్లాజా మైదానం వరకు భరతమాత విగ్రహాన్ని బ్యాండ్ మేళాలతో భారీ ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య, బీజేపీ నాయకులు చింతల రామచంద్రారెడ్డి, గౌతమ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

తట్టిఅన్నారంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు



ఎలా ఉండేది..?

తాగునీరు, విద్యుత్ లేని డబుల్ ఇళ్లు

- ఆందోళనలో లబ్ధిదారులు
- మరమ్మతు, మౌలిక సదుపాయాలు లేకుండా అందజేసిన వైనం
- ఎన్నికల వేళ హడావిడిగా పంపిణీ
- ఇళ్లల్లో ఉంటోంది ఐదు శాతంలోపే
- పని చేయని లిఫ్టులు, జనరేటర్లు
- మరమ్మతుకు మరో నెల పడుతుందంటున్న అధికారులు
- పలు ప్రాంతాల్లో డ్రైనేజీ, రోడ్లూ లేని వైనం

గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించిన రెండు పడకల ఇళ్లు ఇప్పటికీ నిరుపయోగంగానే ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు పంపిణీ చేసినా.. లబ్ధిదారులు ఇంకా సొంతిళ్లలో ఉంటున్న దాఖలాలు లేవు. పనులు పూర్తయ్యాక రెండు, మూడేళ్ల అనంతరం పంపిణీ చేసిన గత ప్రభుత్వం.. అవి నివాసయోగ్యంగా ఉన్నాయా, లేదా అనేది పట్టించుకోలేదు.

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల స్టంట్‌గా లబ్ధిదారులను ఎంపిక చేసి గత ప్రభుత్వంలో డబుల్ ఇళ్ల లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చారు. విద్యుత్, తాగునీటి సదుపాయం లేకపోవడం.. పని చేయని లిఫ్టులు, జనరేటర్లు, చోరీకి గురైన విద్యుత్ వైర్లు, నల్లాలతో ఇళ్లలో ఉండే పరిస్థితి లేదు. పంపిణీ సమయంలో నెల రోజుల్లో మరమ్మతులు చేసి ఇస్తామని అధికారులు చెప్పినా.. నాలుగు నెలలైనా ఆ పనులు పూర్తవలేదు. దీంతో ఇళ్లు వచ్చిందన్న ఆనందం నిరుపేదలకు లేకుండా పోయింది. విద్యుత్, నల్లా కనెక్షన్లు ఇచ్చేందుకూ టీఎస్ఎస్పీడీసీఎల్, వాటర్‌బోర్డు అధికారులు నిరాకస్తుండడంతో ఏం చేయాలో పాలుపోని స్థితి లబ్ధిదారులది. వాస్తవంగా ఇళ్లు ఎలా ఉన్నాయి..? లిఫ్టులు, జనరేటర్లు పని చేస్తున్నాయా..? అన్నది పంపిణీకి ముందు పరిశీలించాలి. కానీ అధికార యంత్రాంగం ఈ విషయాలను పట్టించుకోలేదు.



గేట్లకు తాళాలు

64 వేలకుపైగా పంపిణీ...

గ్రేటర్‌లో రూ.9714 కోట్ల అంచనాతో లక్ష రెండు పడకల ఇళ్లు నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. స్థల వివాదాలు, ఇతరత్రా కారణాలతో 2 వేల ఇళ్ల పనులు ప్రారంభం కాలేదు. 98వేల ఇళ్లలో పూర్తయిన 68804 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. దాదాపు 64వేల పైచిలుకు ఇళ్లను అసెంబ్లీ ఎన్నికల ముందు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పంపిణీ చేశారు. అంతకుముందు ఇన్‌సిటు లబ్ధిదారులకు 4వేలకు పైగా ఇళ్లు ఇచ్చారు. 64వేల ఇళ్లలో మెజార్టీ రెండు, మూడేళ్ల క్రితం పూర్తయినవే. స్టిల్ట్‌ప్లస్ ఐదు నుంచి 11 అంతస్తుల వరకు నిర్మించారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా లిఫ్టులు, జనరేటర్లు అమర్చారు. ఏర్పాటు చేసినప్పటి నుంచి వాటిని వినియోగించకపోవడంతో పని చేయని పరిస్థితి నెలకొంది. దీంతో వాటి మరమ్మతు పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లోని ఇళ్లలో విద్యుత్ వైర్లు, నల్లాలు, కిటికీల గ్రిల్స్ వంటివి చోరీకి గురయ్యాయి. వాటిని ఇప్పుడు తిరిగి అమర్చుతున్నారు. ఈ పనులన్నీ పూర్తి చేసేందుకు రూ.50 కోట్ల వరకు ఖర్చవుతుందని సూత్రప్రాయంగా అంచనా వేశారు. నెల రోజుల్లో మరమ్మతు

మిగతా 8వ పేజీలో..

ఇళ్లల్లో ఉండే పరిస్థితి లేదు



గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ కోసం తాము దరఖాస్తు చేసుకోగా దుండిగల్‌లోని 18వ బ్లాక్ 6వ అంతస్తు, రూమ్ నెం. 610లో తమకు ఇంటిని కేటాయించారు. తాళం కూడా ఇచ్చారు. కానీ విద్యుత్, నీటి సౌకర్యం ఇంత వరకు కల్పించలేదు. ఇంటి తాళం కూడా గత వారం రోజుల క్రితమే అప్పగించారు. అక్కడికి పోయి వస్తున్నాం కానీ అందులో ఉండే పరిస్థితి లేదు. త్వరగా సౌకర్యాలు కల్పించాలి.

- లత్‌శ్రీ, దుండిగల్

పెళ్లికి పెద్దల అడ్డంకి

ప్రేమ జంట ఆత్మహత్య

- నగరంలో యువతి.. భువనగిరిలో ప్రియుడు..

జీడిమెట్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆ ఇద్దరూ ప్రేమించుకున్నారు. విషయం పెద్దలకు తెలిసింది. నగరంలో పని చేస్తున్న ఆమెను ఉద్యోగం మాన్పించేశారు. విడివిడిగా ఉండలేక నగరంలో ఆమె.. భువనగిరిలో అతడు ఆత్మహత్య చేసుకున్నారు. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కె.దుర్గారావ్ బతుకుదెరువు కోసం పది నెలల క్రితం కుటుంబ సమేతంగా నగరానికి వచ్చి అయోధ్యనగర్‌లో ఉంటున్నారు. వీరి కుమార్తె కె.అఖిల (20) సుచిత్రా సమీపంలోని ఓ మార్ట్‌లో ఉద్యోగం చేసేది. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న మధుగౌడ్‌ను ప్రేమించింది. విషయం తెలిసిన అఖిల తల్లిదండ్రులు ఉద్యోగం మాన్పించి జీడిమెట్లలోని మరో కంపెనీలో చేర్పించారు. గురువారం సాయంత్రం మార్ట్ సిబ్బంది అఖిల తమ్ముడు సాయికుమార్‌కు ఫోన్ చేసి 'మీ అక్క ఇంట్లో ఉందో లేదో చూడు' అని చెప్పాడు. సాయికుమార్ ఇంటికి వచ్చి చూడగా అఖిల ఇంట్లో ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే మార్ట్ సిబ్బందికి ఫోన్ చేసి మాట్లాడగా భువనగిరిలో మధుగౌడ్ కూడా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖైదీల క్షమాభిక్ష జీఓ విడుదల నేడు

- 131 మందికి కలుగనున్న విముక్తి

కుషాయిగూడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు, వారి కుటుంబ సభ్యులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న క్షమాభిక్ష జీవో విడుదల నిరీక్షణ ఫలించనుంది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు సంబంధించిన జీవోను ప్రభుత్వం నేడు విడుదల చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర

మిగతా 8వ పేజీలో..

నిలిచిన గోదావరి జలాలు!

- పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం
- అత్యవసరంగా మరమ్మతులు.. పునరుద్ధరణ

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మహానగరానికి గోదావరి జలాలు నిలిచిపోయాయి. గోదావరి తాగునీటి సరఫరా పథకంలో కొండపాక దగ్గరున్న పంప్‌హౌస్ వద్ద గురువారం ఉదయం భారీగా లీకేజీ ఏర్పడడంతో నీటి సరఫరాను నిలిపేశారు. దీంతో కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి పరిధిలోని ప్రాంతాలకు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోగా, కుత్బుల్లాపూర్, బాచుపల్లి, అల్వాల్, మల్కాజిగిరి, నిజాంపేట్, బొల్లారం ప్రాంతాలకు పాక్షికంగా అంతరాయం తలెత్తింది. ఈ క్రమంలోనే అప్రమత్తమైన వాటర్ బోర్డు అధికారులు కొండపాకలోని పంప్‌హౌస్‌లో అత్యవసరంగా మరమ్మతులు చేపట్టారు. పంప్‌హౌస్‌లో వాల్వ్‌లకు మరమ్మతులు మధ్యాహ్నం నుంచి రాత్రి 7 గంటల వరకు సాగాయి. గోదావరి జలాల పంపింగ్ ప్రక్రియ సైతం రాత్రి నుంచే ప్రారంభించారు. నగరానికి గురువారం రాత్రి 9 గంటల తర్వాత గోదావరి జలాలు చేరతాయని, నీటి సరఫరాలో ఏ అంతరాయం ఉండదని వాటర్‌బోర్డు అధికారులు ప్రకటించారు.

తరచూ వాల్వ్ లీకేజీలు..

కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా నీటి సరఫరాలో తరచూ వాల్వ్ లీకేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దాంతో నగరానికి జలాల తరలింపులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నాణ్యతలేని వాల్వ్‌లను వాడుతుండడమే దీనికి కారణంగా తెలుస్తోంది. కాసుల కోసం కక్కుర్తి పడుతున్న కొందరు అధికారులు గుర్తింపు లేని సంస్థల వాల్వ్‌లకు నెలనెలా రూ.లక్షల వ్యయం చేస్తూ ఏటా భారీగా డబ్బులు దండుకుంటున్నారని సమాచారం. వాల్వ్‌ల బిగింపులో జరుగుతున్న అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని వాటర్‌బోర్డులోని కొందరు ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రద్దయిన నోట్లతో మోసం

- తక్కువ ధరకే టర్కీ కరెన్సీ అంటూ ఎర
- ఐదుగురి అరెస్ట్
- రూ. 10 లక్షల టర్కీ కరెన్సీ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న టర్కీ కరెన్సీ

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): టర్కీలో రద్దయిన నోట్లను తక్కువ ధరకే ఇస్తామని ప్రజలను మోసం చేస్తున్న ముఠాకు చెందిన ఐదుగురు సభ్యులను ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ, ఎల్‌బీనగర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఏలూరుకు చెందిన మంచినీళ్ల ఓం నాగప్రసాద్(66) అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి నుంచి 8 ఏళ్ల క్రితం టర్కీ నోట్లను కొనుగోలు చేశాడు. ఈ నోట్లు టర్కీలో రద్దయిపోయాయని తెలుసుకొని తక్కువ ధరకే టర్కీ కరెన్సీ విక్రయిస్తానంటూ మోసాలు చేయడం ప్రారంభించాడు. ఇతడికి ఏలూరు జిల్లా సామవరప్పాడుకు చెందిన గుడిమీద జ్యోతిరవితేజ(32), అన్నవడ్డెరపేటకు చెందిన తోట వెంకటనాగరాజు(55)లు పరిచయమయ్యారు. వీరికి కాకినాడకు చెందిన మారుతి తేజ(24), నిమ్మగంటి జీవన్‌సత్య(25), పులి బుజ్జిలు పరిచయమయ్యారు. వీరందరూ ముఠాగా ఏర్పడి తక్కువ ధరకే టర్కీ కరెన్సీ విక్రయిస్తామని చెప్పి, రద్దయిన నోట్లను అంటగట్టి మోసం చేస్తున్నారు. ఈ దందాపై పక్కా సమాచారమందుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ, పోలీసులు టర్కీ నోట్లను విక్రయించేందుకు వచ్చిన ముఠా సభ్యుల కోసం కాపు కాశారు. ఓం నాగప్రసాద్, జ్యోతిరవితేజ, నాగరాజు, జీవన్‌సత్య, తేజలను అరెస్ట్ చేశారు. వారి నుంచి 10 లక్షల విలువైన టర్కీ నోట్ల (ఇండియన్ కరెన్సీలో రూ.27 కోట్ల విలువ)ను, స్కార్పియో రెండు వాకీటాకీలు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా, బ్లాక్ కరెన్సీ పేరుతో మోసానికి పాల్పడిన ఇద్దరు విదేశీయులను రాచకొండ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

కమీషన్‌కు బ్యాంక్ ఖాతాలు

8

గ్రేటర్ కాంగ్రెస్‌లో నూతనోత్తేజం

బూత్ కన్వీనర్ల సదస్సుకు నగరం నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు



సదస్సులో నగర కార్యకర్తల ఉత్సాహం



పాటలు పాడుతున్న కళాకారులు

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీస్టేడియంలో నిర్వహించిన కాంగ్రెస్ బూత్ స్థాయి కన్వీనర్ల సదస్సు అట్టహాసంగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా బూత్ స్థాయి కాంగ్రెస్ కన్వీనర్ల సదస్సు కావడం, ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రావడంతో పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశాయి. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సీటింగ్ ఏర్పాటు చేయగా, సికింద్రాబాద్, హైదరాబాద్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పెద్దఎత్తున బూత్ స్థాయి కన్వీనర్లు హాజరయ్యారు. ఎన్నికల్లో వివిధ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులతో బూత్ స్థాయి కన్వీనర్లు తరలివచ్చారు. గ్రేటర్ పరిధిలోని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సమీర్ వాలీఉల్లాలు స్టేడియంలో సమావేశ నిర్వహణను పర్యవేక్షించారు. సభా వేదికకు ఎదురుగా ఏర్పాటు చేసిన ఖర్గే మూడు భారీ కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సదస్సు పార్టీ నగర నేతల్లో ఉత్సాహం నింపింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా, లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతామన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో..

ముగ్గురి దుర్మరణం



రవి(ఫైల్)

- రాయపోల్ వద్ద తల్లీకుమారులు
- మణికొండ సమీపంలో హెచ్‌సీయూ ఉద్యోగి

ఇబ్రహీంపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన రావుల భాను(20), తల్లి పార్వతమ్మ(39)లు బైక్‌పై స్వగ్రామం నుంచి ఇబ్రహీంపట్నం వస్తున్నారు. రాయపోల్ రోడ్డు వైట్‌గోల్డ్ ఇంటిగ్రేటెడ్ స్పిన్‌టెక్స్ పార్కు వద్దకు రాగానే

మిగతా 8వ పేజీలో..

టెస్ట్ మ్యాచ్.. విద్యార్థుల జోష్


క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు స్టేడియానికి వస్తున్న విద్యార్థులు

ఉప్పల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఉప్పల్ వేదిక భారత్, ఇంగ్లండ్ మధ్య టెస్ట్ మ్యాచ్ ప్రారంభం అయింది. మ్యాచ్ చూడడానికి మొదటి రోజు స్టేడియానికి వచ్చిన విద్యార్థుల్లో జోష్ నింపింది. తొలిసారిగా రోజూ 5వేల మంది స్కూల్ విద్యార్థులు మ్యాచ్ వీక్షించేలా స్టేడియంలో ఏర్పాట్లు చేశారు. ఉచితంగా టికెట్లు అందజేశారు. మ్యాచ్ చూసేందుకు ఉత్సాహంతో వస్తున్నారు. ఈ క్రమంలో ఉప్పల్-సికింద్రాబాద్ ప్రధానమార్గంలోని హబ్సిగూడ వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది.

కాంప్లిమెంటరీ పాసులు పక్కదారి

టెస్ట్ మ్యాచ్‌లు వీక్షించేందుకు కల్పించిన కాంప్లిమెంటరీ పాసులు పక్కదారి పట్టాయి. బ్లాక్‌లో టికెట్లు విక్రయిస్తూ స్టేడియం వద్ద ఏడుగురు వ్యక్తులు పోలీసులుకు పట్టుబడ్డారు.

మైదానంలోకి దూసుకెళ్లిన యువకుడు

ఆటపై అభిమానంతో మ్యాచ్ జరుగుతుండగా భద్రతా సిబ్బంది కళ్లు గప్పి ఓ యువకుడు గ్రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. ఆ సమయంలో బ్యాటింగ్ చేస్తున్న టీమిండియా కెప్టెన్ రోహిత్‌శర్మకు కాళ్లు మొక్కి అభిమాన చాటుకునే యత్నం చేశాడు. అప్రమత్తమైన భద్రతాసిబ్బంది యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటకు చెందిన హర్షిత్‌రెడ్డిగా గుర్తించారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

పోలీసుల తీరుతో పరేషాన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): భారత్-ఇంగ్లండ్ తొలి టెస్టు మొదటి రోజు మ్యాచ్ సందర్భంగా పోలీసుల తీరుతో అభిమానులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు వ్యవహారశైలి కారణంగా కార్పొరేట్ బాక్సుల టికెట్లు కొన్న ఫ్యాన్స్, స్టేడియంలోని బ్రాడ్‌కాస్టింగ్‌తోపాటు ఇతర విభాగాల్లోని సిబ్బందికి సకాలంలో భోజనం, తాగునీరు అందక ఇబ్బంది పడ్డారు. భోజనం ఇతర లాజిస్టిక్స్ తీసుకొచ్చే వాహనాలకు పాసులు లేవనే కారణంతో చాలాసేపు నిలిపివేయడంతో స్టేడియం వెలుపల, లోపల ఉన్న అభిమానులు ఇక్కట్లు పాలయ్యారు. పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టి టికెట్లు కొనుగోలు చేసినా, భోజనం సమయానికి అందలేదని ఫ్యాన్స్ వాపోయారు. పార్కింగ్ పాసులు ఉన్న హెచ్‌సీఏ సిబ్బందితో పాటు మీడియా వాహనాలను పోలీసులు లోపలికి అనుమతించకుండా ఇబ్బందులకు గురిచేశారు. పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని ఫ్యాన్స్ కోరుతున్నారు.

మాజీ మంత్రి కారు బీభత్సం

బంజారాహిల్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కారు బీభత్సం సృష్టించింది. నగరానికి చెందిన ఓ పారిశ్రామికవేత్త బీఎండబ్ల్యూ కారులో బంజారాహిల్స్ రోడ్ నెంబర్-12కు చేరుకున్నాడు. అక్కడ ఆస్పత్రి పని ఉండడంతో, కారును పార్కు చేయమని డ్రైవర్‌కు చెప్పి వెళ్లిపోయారు. డ్రైవర్ శ్రీనివాస్ కారును పార్కింగ్‌లో పెట్టి అందులోనే కూర్చున్నాడు. కొద్దిసేపటికి వెనకాల నుంచి వచ్చిన స్కార్పియో కారు.. శ్రీనివాస్ కూర్చున్న బీఎండబ్ల్యూ కారును వేగంగా ఢీ కొట్టి, ముందుకెళ్లి గ్రిల్‌ను ఢీ కొట్టింది. స్కార్పియో డ్రైవరు వాహనాన్ని వదిలి పారిపోయాడు. బీఎండబ్ల్యూలో ఉన్న డ్రైవర్ శ్రీనివాస్ భుజానికి గాయమైంది. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో ఆది మాజీ మంత్రికి చెందిన కారు అని తేలింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో డ్రైవర్ మాత్రమే ఉన్నట్టు నిర్ధారించారు.



హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ - చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి

జల్‌పల్లి కాంగ్రెస్ కో ఆర్డినేటర్ల నియామకం

పహాడిషరీఫ్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్లుగా షేక్ జహంగీర్, తయ్యబ్ దయానీలు నియమితులయ్యారు. గురువారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి వారికి నియామక పత్రాన్ని అందజేశారు. తమకి పదవి అప్పగించినందుకు వారు లక్ష్మారెడ్డికి ధన్యవాదములు తెలిపారు.



బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమితులైన డాక్టర్ కె.లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న బీజేపీ నేత చెన్నబోయిన కృష్ణయాదవ్, దినేష్ అంబారే

ప్రజలను మోసం చేయడం బీఆర్ఎస్ పార్టీ నైజం

గోషామహల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలను మోసం చేయడం బీఆర్ఎస్ పార్టీ నైజం అని, అందుకే ప్రజలు బీఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశాల్లో పారిశ్రామికవేత్తలతో ఒప్పందాలు కుదుర్చుకొని సుమారు 42 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చారని, వాటిపై మంత్రి కేటీఆర్ దుష్ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

హైదరాబాద్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం

యాకుత్‌పుర , జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా విజయం సాధిస్తుందని, అందుకు అనుగుణంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత, చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేష్ పిలుపునిచ్చారు. చార్మినార్ అలీజా కోట్లలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హైదరాబాద్ కాంగ్రెస్ సేవదళ్ అధ్యక్షుడు మహ్మద్ మూసా ఖాసీం ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. హైదరాబాద్ లోక్‌భ సరిధిలోని నియోజకవర్గాలకు సంబంధించిన సేవదళ్ ఇన్‌చార్జిల నియమకపత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఓటరు దినోత్సవం సందర్భంగా పారిశుధ్య కార్మికులతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్, డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ రాధారాణిలు. రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం నుంచి పీడీపీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ఓటు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. - రాజేంద్రనగర్, ఆంధ్రజ్యోతి

కబ్జా నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలి

పహాడిషరీఫ్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండల పరిధి మామిడిపల్లిలోని ప్రభుత్వ భూమిని రక్షించాలని టీటీడీ ఎల్ ఏసి మెంబర్ గుర్జని సుమన్ గౌడ్ అన్నారు. 99/1 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాలను కూల్చి వేయాలని రంగారెడ్డి జిల్లా రెవిన్యూ అధికారిణి టీఎల్ సంగీతకు వినతి పత్రం అందజేశారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

కార్వాన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఓ నిందితుడిని టప్పాచబుత్ర పోలీసులు అరెస్టు చేసి, అతని నుంచి మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, క్రైమ్ ఎస్ఐ నర్సింగ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... టప్పాచబుత్ర జిర్రా ప్రాంతానికి చెందిన సయ్యద్ ఇమ్రాన్ (29) కొంతకాలంగా ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

యువతి అదృశ్యం



నూర్ కయాస్

పహాడిషరీఫ్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ రాయల్ కాలనీలో సితార బేగం కుటుంబంతో కలిసి నివాసం ఉంటుంది. ఈమె చిన్న కూతురు నూర్ కయాస్(18) ఇంటి వద్దనే ఉంటుంది. ఈనెల 15న రాత్రి కుటుంబ సభ్యులతో నిద్రించిన నూర్ మరుసటి రోజు ఉదయం కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికినా లాభం లేకుండా పోయింది. దీంతో సితార బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో..



మహ్మద్ జాఫర్‌ఖాన్

చాంద్రాయణగుట్ట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పనికోసమని బయటికి వెళ్లిన ఓ యువకుడు తిరిగిరాలేదు. ఈ సంఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నవాబ్‌సాబ్‌కుంటకు చెందిన మహ్మద్ గులామ్‌ఖాన్ కుమారుడు మహ్మద్ జాఫర్‌ఖాన్(26) ఈనెల 20న 11 గంటలకు పని మీద బయటికి వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య ఫలక్‌నుమా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 040-27854792, 8712569183 నంబర్లకు సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.

నకిలీ వైద్యుడిపై కేసు

బంజారాహిల్స్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నకిలీ వైద్యుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటగిరిలో మహేష్ అనే వ్యక్తి ఫస్ట్ ఎయిడ్ సురక్షిత క్లినిక్ ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందిస్తున్నాడు. ఇందుకోసం కమ్యూనిటీ పారామెడిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి సర్టిఫికెట్ కూడా తీసుకున్నాడు. క్లినిక్‌కు వస్తున్న రోగులకు తనకు ఎటువంటి అర్హత లేకున్నా అల్లోపతి మందులు రాసి ఇస్తున్నాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ డ్రగ్ కంట్రోల్ బోర్డు రిజిస్ట్రార్ సీహెచ్ హనుమంతరావు విచారణ జరిపగా నిజమని తేలింది. ఆయన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు మహేష్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు.

వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించొద్దు

రాజేంద్రనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వర్సిటీ భూములను హైకోర్టు భవనాల ఏర్పాటుకు కేటాయించొద్దం టూ కొద్ది రోజులుగా విద్యార్థులు చేస్తున్న నిరసనలకు ఏబీవీపీ నగర కమిటీ మద్దతు ప్రకటించింది. గురువారం వందమంది ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ తదితరులు రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీకి వెళ్లి సంఘీభావం తెలిపారు. బుధవారం విద్యార్థులకు మద్దతు తెలపడానికి వచ్చిన ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వనం ఝాన్సీపై మహిళా కానిస్టేబుళ్ల దురుసు ప్రవర్తనను వారు ఖండించారు. వ్యవసాయ వర్సిటీ భూములను కొల్లగొట్టడానికే, వర్సిటీ భూముల్లో హైకోర్టు భవనాలు నిర్మించడానికి చూస్తున్నారన్నారు. 2010లో బుద్వేల్ మానస హిల్స్ వద్ద హైకోర్టుకు 100ఎకరాలను అప్పటి ప్రభుత్వం ఇవ్వాలనుకుని, తిరిగి ఆ భూములకు వేలం వేశారన్నారు. వర్సి టీ భూములను హైకోర్టుకు కేటాయిస్తూ జారీ చేసిన జీవో నెంబర్ 55ను వెనక్కు తీసుకోకపోతే ప్రగతి భవన్‌ను బద్దలు కొడతామని, సీఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్రంలో ఎక్కడా తిరగనీయమని వారు హెచ్చరించారు. వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట బైఠాయించిన విద్యార్థి సంఘం నాయకులతో రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వెంకటరమణ, డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ (డీఎస్ఏ) డాక్టర్ జెల్లా సత్యనారాయణ మాట్లాడారు. వారి డిమాండ్‌లను ప్రభుత్వానికి రాసి పంపించామన్నారు. కాగా, ఉద్యాన విశ్వవిద్యాలయానికి చెందిన భూములను హై కోర్టుకు కేటయించడం బాధాకరమని నేషనల్ హార్టికల్చర్ బోర్డు డైరెక్టర్ వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పరిశోధనలు జరిగే ప్రాంతంలో హైకోర్టు రావడం వల్ల ఈ ప్రాంతం అంతా కమర్షియల్ అవుతుందన్నారు. వర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వడంపై ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు.



విద్యార్థి నాయకులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటరమణ, డీఎస్ఏ డాక్టర్ సత్యనారాయణ

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వనం ఝాన్సీపై మహిళా పోలీసుల దురుసు ప్రవర్తన

వ్యవసాయ విశ్వవిద్యాలయం భూములను హైకోర్టుకు ఇవ్వొద్దని విద్యార్థులు చేస్తున్న నిరసనలో పాల్గొన్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వనం ఝాన్సీ పట్ల బుధవారం రాజేంద్రనగర్‌కు చెందిన మహిళా కానిస్టేబుళ్లు దురుసుగా ప్రవర్తించడం బాధాకరమని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, నేషనల్ హార్టికల్చరల్ బోర్డు డైరెక్టర్ వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వనం ఝాన్సీని గురువారం బీజేపీ నాయకులు పరామర్శించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా అవార్డు పొందిన పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి పట్ల మహిళా కానిస్టేబుళ్లు ప్రవర్తించిన తీరు బాధాకరంగా ఉందన్నారు. వనం ఝాన్సీని కలసిన వారిలో నేషనల్ హార్టికల్చరల్ బోర్డు డైరెక్టర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా నాయకులు వై.శ్రీధర్, ఎం.కొమురయ్య, పి.మల్లేశ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

నిరసనలో పాల్గొన్న విద్యార్థిని పట్ల మహిళా పోలీసులు జుట్టు పట్టి లాగి కింద పడవేయడాన్ని తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్ (టాసా) తీవ్రంగా ఖండిస్తున్నదని టాసా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ బి.విద్యాసాగర్, డాక్టర్ పి.రజనీకాంత్‌లు అన్నారు.

కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలి..

రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆందోళన చేస్తున్న విద్యార్థిని పట్ల మహిళా పోలీసులు ప్రవర్తించిన తీరు అత్యంత అమానుషంగా ఉందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బైక్‌పై కూర్చుని జుట్టు పట్టి లాక్కెళ్లి విద్యార్థిని పట్ల జులుం ప్రదర్శించిన కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలన్నారు.

నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి..

ముగ్గురి అరెస్ట్

4 ఎకరాల భూమి కాజేతకు యత్నం

నార్సింగ్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్లు, ఫేక్ ఐడీలు సృష్టించి ఇతరుల భూములు కాజేసేందుకు యత్నించిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నార్సింగ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోకాపేటలోని 166/5, 167, 168 సర్వేనెంబర్లలో పది ఎకరాల భూమి ఆశ్రయ్ రిసార్ట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరు మీద ఉంది. కంపెనీ ఎండీగా కొవ్వూరు శ్రీనివాస్ గుప్తా ఉన్నారు. 2000 సంవత్సరంలో ఆరు ఎకరాల స్థలం ఓషియన్ పార్కుకు మార్చారు. సర్వేనెంబర్ 168లోని నాలుగు ఎకరాల భూవి ఆశ్రయ్ రిసార్ట్ ఎండీ శ్రీనివాస్ గుప్తా పేరు మీదనే ఉంది. 2022లో శ్రీనివాస్ గుప్తా సంస్థ నుంచి బయటకు వచ్చాడు. అయినా ధరణి పోర్టల్‌లోనూ ఆశ్రయ్ రిసార్ట్ ఎండీగా శ్రీనివాస్ గుప్తా పేరుపై చూపిస్తోంది. ఇది తెలుసుకున్న ఏపీలోని కడప జిల్లాకు చెందిన చంద్రన్న... ఎండీ శ్రీనివాస్ గుప్తా అవతారం ఎత్తాడు. కడపకు చెందిన ప్రభాకర్, ఎల్లటూరు శివప్రకాశ్‌రెడ్డి, విజయవాడకు చెందిన మాటూరు శ్రీనివాస్ కుమార్, రమేష్, అనంతపూర్‌కు చెందిన శ్రీనాథ్‌రెడ్డి, కావేరి, భీమవరానికి చెందిన రాజుతో కలిసి ముఠాగా ఏర్పాడ్డారు. ప్లాన్‌లో భాగంగా నకిలీ ఐడీకార్డు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డుపై చంద్రన్న ఫొటో పెట్టి నకిలీ డాక్యుమెంట్లు సిద్ధం చేశారు. అయితే ఆశ్రయ్ రిసార్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గుంటూరుకు చెందిన సురేశ్‌బాబు పేరుమీద రిజిస్ట్రేషన్ అయినట్టు తెలుసుకున్న వారు, అతడిని సంప్రదించి కంపెనీని కొనుగోలు చేశారు. తరువాత కంపెనీలో డైరెక్టర్లుగా తమ పేరు నమోదు చేసుకున్నారు. అనంతరం మీసేవలో పాస్ బుక్‌లు తీసుకొని ఆ భూమి అమ్మడానికి పథకం వేశాడు. విషయం తెలుసుకున్న నార్సింగ్ పోలీసులు ఈనెల 25న నారెడ్డి ప్రభాకర్‌రెడ్డి(52), ఎల్లటూరు శివప్రకాశ్‌రెడ్డి (45), లింగాల చంద్ర అలియాస్ శ్రీనివాస్ గుప్తా (60)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని నార్సింగ్ ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు.



నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన వ్యక్తులు

గ్రేటర్ కమిషనర్‌ను కలిసిన తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, డివిజన్‌ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం బీజేపీ కార్పొరేటర్ల బృందం గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను కలిసింది. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ బీజేపీ విప్, మైలార్‌దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మైలార్ దేవుపల్లి డివిజన్‌కు అధిక నిధులు మంజూరు చేసి పెండింగ్‌లో ఉన్న పనులన్నింటిని పూర్తి చేసేలా చూడాలని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు.



గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రోస్‌తో సమావేశమైన జీహెచ్ఎంసీలో బీజేపీ విప్, మైలార్‌దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



హైల్యాండర్స్ గోల్ఫ్ జట్టు

రసవత్తరంగా హైదరాబాద్ గోల్ఫ్ లీగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ రసవత్తరంగా సాగుతోంది. గురువారం గోల్కొండలో జరిగిన ఈ పోటీల్లో రెండో రౌండ్ ముగిసేసరికి విల్లాజియో హైల్యాండర్స్ జట్టు టాప్‌కి చేరుకుంది. హైల్యాండర్స్ జట్టు అద్భుత ఆట తీరుతో 196 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, లహరి కింగ్స్ రెండో స్థానంలో ఉంది. ఆ జట్టు ప్లేయర్ సంజప్ప 38 పాయింట్లతో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించాడు.



భారత గణతంత్రదినోత్సవం సందర్భంగా చార్మినార్ వద్ద అతిపెద్ద త్రివర్ణ పతాకాన్ని గురువారం ప్రదర్శించారు. మదీనా వద్ద ఉన్న మహమ్మద్ క్యాప్ మార్టు షాపు నిర్వాహకులు ఈ త్రివర్ణ పతాకాన్ని తయారు చేయించారు. - చార్మినార్, ఆంధ్రజ్యోతి



మాట్లాడుతున్న బిల్డర్స్ అసోసియేషన్ ప్రనితినిధులు

రేపు ఆల్ ఇండియా బిల్డర్స్ కన్వెన్షన్

- హైదరాబాద్ వేదికగా అధునాతన టెక్నాలజీపై చర్చలు
- హైటెక్స్‌లో ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 31వ ఆల్ ఇండియా బిల్డర్స్ కన్వెన్షన్- 2024 ఈ నెల 27 నుంచి నిర్వహించనున్నట్లు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ప్రకటించింది. హైదరాబాద్ వేదికగా జరిగే కన్వెన్షన్ ఈ నెల 29 వరకు జరుగుతుందని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) జాతీయ అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి, బీఏఐ మాజీ జాతీయ అధ్యక్షుడు బొల్లినేని శీనయ్య, రాష్ట్ర అధ్యక్షుడు కె.దేవేందర్ రెడ్డిలు తెలిపారు. హైటెక్స్‌లోని న్యాక్ క్యాంపస్‌లో బీఏఐ, ఏఐబీసీ నిర్వాహకులు ఆల్ ఇండియా బిల్డర్స్ కన్వెన్షన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్ ఇండియా సదస్సును సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని, గౌరవ అతిథులుగా మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు హాజరవుతున్నారని తెలిపారు. మూడు రోజులపాటు 800 వందల మందికిపైగా ప్రతినిధులు హాజరవ్వనుండగా, ఈ సదస్సులో నిర్మాణ రంగంలో అధునాతన టెక్నాలజీ వంటి పలు అంశాలపై సెమినార్లు, టెక్నికల్ సెషన్స్ ఉంటాయని తెలిపారు. ఎగ్జిబిషన్, వర్క్‌షాప్స్, అధునాతన నిర్మాణ పరికరాలను, నిర్మాణ మెటీరియల్ వంటి విషయాలపై చర్చలుంటాయని వివరించారు. సమావేశంలో సదస్సు కార్యదర్శి సచ్చిదానంద రెడ్డి, బీఏఐ మెంబర్స్ కమిటీ చైర్మన్ డి.వి.ఎన్ రెడ్డి, హైదరాబాద్ సెంటర్ చైర్మన్ భూపేందర్ సింగ్, కన్వెన్షన్ వైస్ చైర్మన్ బల్మూరి సుగుణాకర్ రావు, కన్వెన్షన్ ఫైనాన్స్ కమిటీ చైర్మన్ సంకినేని కృష్ణారావు, కోశాధికారి నరేందర్ రెడ్డి, కన్వెన్షన్ జాయింట్ సెక్రటరీ వి.సుధాకర్‌లతోపాటు మెమెంటోస్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, ఫుడ్ కమిటీ వి.భాస్కర్ రెడ్డి, రిజిస్ట్రేషన్ కమిటీ జి.సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Aoq3rBC లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ఎలా ఉండేది..?

(5వ పేజీ తరువాయి)

పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నా.. అంతకంటే ఎక్కువ సమయం పట్టే అవకాశముంది.

ఐదు శాతంలోపే..

ఎంపికైన లబ్ధిదారులకు పొజీషన్ సర్టిఫికెట్లు, తాళాలు అందజేశారు. మరమ్మతు పనులు పూర్తయిన అనంతరం సమాచారమిస్తామని, ఇళ్లల్లోకి రావొచ్చని ఎన్నికల ముందు చెప్పారు. నాలుగు నెలలైనా అధికారుల నుంచి కబురు రాకపోవడం.. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇళ్లు పొందిన వారిలో ఆందోళన మొదలైంది. అటు ఇళ్ల వద్దకు, ఇటు అధికారుల వద్దకు క్యూ కడుతున్నారు. కొందరు మాత్రం ఇళ్లల్లో సొంత ఖర్చుతో మరమ్మతు చేసుకొని ఉంటున్నారు. కొల్లూరు సాయిరాంనగర్‌లో 754 ఇళ్లు కేటయించగా, కేవలం 30మంది మాత్రమే ఉంటున్నారు. హెచ్‌బీ కాలనీ చైతన్యనగర్‌లో 240 ఇళ్లు పంపిణీ చేసినా.. విద్యుత్, తాగునీటి సరఫరా లేక ఒక్కరూ ఉండడం లేదు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం, బాచుపల్లి, బహదూర్‌పల్లి, డి.పోచంపల్లి, దుండిగల్ ప్రాంతాల్లో 13 వేలకుపైగా ఇళ్లు పంపిణీ చేయగా.. వాటిలో ఉంటున్నది అత్యల్పం. మెజారిటీ ప్రాంతాల్లో మెరుగైన తాగునీటి సరఫరా వ్యవస్థ, అంతర్గత డ్రైనేజీ పైపులైన్‌లకు అవుట్ లెట్లు లేవు. విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ల ఏర్పాటులోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. 15 వేలకుపైగా ఇళ్లున్న కొల్లూరు వంటి ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ స్టేషన్, బస్ స్టేషన్, పాఠశాల, ప్రభుత్వ ఆస్పత్రి వంటివి నిర్మిస్తామని చెప్పినా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు.

కరెంటు ఇస్తే వచ్చి ఉంటాం..

చైతన్యనగర్‌లో కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇంటికి త్వరగా కరెంటు ఇస్తే వచ్చి ఇక్కడే ఉంటాం. విద్యుత్ మీటర్ మంజూరైనా ఇంకా ఏర్పాటు చేయలేదు. తరుచుగా ఇక్కడికి వచ్చి ఫ్లాట్‌ను చూసి వెళ్తున్నా. అద్దె ఇంట్లో ఉంటున్న మేము సొంత ఇంట్లోకి ఎప్పుడు వస్తామా అని ఆశగా ఎదురు చూస్తున్నాం. లబ్ధిదారులందరికీ ఇళ్లు అందుబాటులోకి వచ్చేలా అధికారులు చూడాలి.

\- కె. వెంకటమ్మ, డబుల్ బెడ్‌రూం లబ్ధిదారురాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో..

ముగ్గురి దుర్మరణం

(5వ పేజీ తరువాయి)

ఎదురుగా వస్తున్న డీసీఎం బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన పార్వతమ్మ, భానులు అక్కడికక్కడే మృతిచెందారు. కాగా, డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

ఔటర్ సర్వీస్ రోడ్డుపై..

నార్సింగ్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఔటర్ సర్వీస్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మణం చెందాడు. నార్సింగ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వెలమగ్రామానికి చెందిన బి.రవి(43) హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పనిచేస్తుంటాడు. భూ వివాదానికి సంబంధించి న్యాయవాదితో మాట్లాడేందుకు ద్విచక్ర వాహనంపై ఎల్బీనగర్ వెళ్లి వస్తుండగా బుధవారం సాయంత్రం మణికొండ వద్ద ఓ కారు ఢీకొట్టింది. అతడిని కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. కారు డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

డిజిటల్ పేరిట మోసం

- సేవల పేరిట డబ్బులు వసూలు
- జోనల్ ఐడీ తీసుకుంటే ఎక్కువ కమీషన్ అంటూ బురిడీ..
- కంపెనీ సీఈఓతోపాటు మరో ఇద్దరి అరెస్ట్



పంజాగుట్ట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ సేవలు అందిస్తామని, డిస్ట్రిబ్యూషన్, జోనల్ ఐడీ తీసుకుంటే ఎక్కువ కమీషన్ వస్తుందని మాయ మాటలు చెప్పి అమాయకులను మోసంచేసి అందిన కాడికి దండుకుంటున్న ఓ డిజిటల్ సర్వీసెస్ కంపెనీ సీఈఓతోపాటు మరో ఇద్దరిని పంజాగుట్ట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. డేటాను నిల్వ చేయడానికి ప్రత్యేకంగా జీఎస్ఎం గేట్‌వేని కూడా ఏర్పాటు చేసుకున్నారు. వారి నుంచి 31 సెల్‌ఫోన్లు, 50 కంప్యూటర్లు, 2 లాప్‌టాప్స్, సిమ్ కార్డులను, ఇతర పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్ జైపూర్‌కు చెందిన ప్రతీక్ చౌవే(36) ఐజీఎస్ డిజిటల్ సెంటర్ లిమిటెడ్ సీఈఓ. అదేప్రాంతానికి చెందిన శ్రావణ్‌లాల్ శర్మ(46) అందులో పనిచేస్తున్నాడు. డి. స్వర్ణలత(32) నగరంలోని సెంటర్ ఇన్‌చార్జీగా పనిచేస్తోంది. ప్రతీక్ చౌవే తమ సంస్థ ద్వారా 300కు పైగా డిజిటల్ సేవలను అందిస్తున్నామని సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు గుప్పించాడు. జగద్గిరిగుట్టకు చెందిన సీహెచ్. చంద్రశేఖర్ డిజిటల్ సర్వీస్ పేమెంట్ గేట్‌వే కోసం బ్రౌజ్ చేస్తుండగా అతనికి ఐజీఎస్ డిజిటల్ సెంటర్ లిమిటెడ్ టెలీకాలర్ నుంచి కాల్ వచ్చింది. తమ సంస్థలో సభ్యత్వం తీసుకుంటే 300 రకాల డిజిటల్ సేవలు అందిస్తామని, రిజిస్ట్రేషన్, ఐడీ కోసం రూ.1800 కట్టాలని టెలీకాలర్ చెప్పారు. వారు అందించే సేవలు తెలుసుకుని యూపీఐ ద్వారా డబ్బులు చెల్లించారు. ఐడీని ఇచ్చారు కానీ, కేవైసీ యాక్టివేట్ కాలేదు. దీంతో రూ.4,040 కట్టి డిస్ట్రిబ్యూషన్ ఐడీ తీసుకుంటే ఎక్కువ కమీషన్ వస్తుందని చెప్పి ఆ మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా కట్టించుకున్నారు. అయినా.. కేవైసీ ఎర్రర్ చూపడంతో మరో రూ. 30వేలు కట్టి జోనల్ ఐడీ తీసుకుంటే ఇక ఎలాంటి సమస్యలు ఉండవని, కమీషన్ కూడా ఎక్కువగా వస్తుందని నమ్మబలికారు. పెద్ద మొత్తం కావడంతో సంస్థపై అనుమానం వచ్చి డబ్బు కట్టలేదు. ఈనెల 6న చంద్రశేఖర్ బేగంపేట వైట్‌హౌస్ బిల్డింగ్‌లోని ఐజీఎస్ డిజిటల్ సెంటర్ లిమిటెడ్ కార్యాలయానికి వెళ్లి మాట్లాడాడు. తాము ఐదు రకాల సేవలను మాత్రమే అందిస్తున్నామని, అవసరమైతే తీసుకోండి, లేదంటే వదిలేయాలని, డబ్బు ఇచ్చేది లేదని నిర్వాహకులు తేల్చి చెప్పారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సంస్థ కార్యాలయంపై దాడి చేసి పలు ఆధారాలు సేకరించారు. పోలీసుల విచారణలో పలు అంశాలు వెల్లడయ్యాయి. దీంతో కంపెనీ సీఈఓ ప్రతీక్ చౌవేతోపాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు.

రాజ్‌భవన్, పబ్లిక్ గార్డెన్ పరిసరాల్లో

ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల ను పురస్కరించుకుని పబ్లిక్ గార్డెన్ తోపాటు రాజ్‌భవన్‌లో జరిగే ఎట్‌హోం కార్యక్రమానికి పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నాంపల్లి, పబ్లిక్ గార్డెన్ పరిసరాల్లో శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వేడుకల అనంతరం సీఎం రేవంత్ రెడ్డి పరేడ్ గ్రౌండ్స్‌లో ఉన్న యుద్ధ వీరుల స్థూపం వద్దకు వెళ్లి నివాళులర్పిస్తారు. ఈ సందర్భంగా బేగంపేట జంక్షన్, రసూల్‌పురా, సీటీఓ, ప్లాజా, టివోలి, ఎస్‌బీఐ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను కొంత సమయం పాటు నిలిపివేస్తారని అధికారులు తెలిపారు.

- ఎంజే మార్కెట్ నుంచి మెహిదీపట్నం వైపునకు వెళ్లే వాహనాలను తాజ్ ఐలాండ్ నుంచి ఏక్‌మినార్ వైపునకు మళ్లిస్తారు.
- నాంపల్లి రైల్వేస్టేషన్ నుంచి పబ్లిక్ గార్డెన్ వైపునకు వాహనాలను అనుమతించరు. వీటిని చాపెల్ రోడ్, గన్‌ఫౌండ్రీ వైపునకు పంపుతారు.
- ఖైరతాబాద్, నిరంకారీ భవన్ వైపునుంచి రవీంద్ర భారతి వైపునకు వెళ్లే వాహనాలను సైఫాబాద్ పాత పోలీస్‌స్టేషన్ వైపునుంచి టెలిఫోన్ భవన్‌వైపునకు మళ్లిస్తారు.
- హైదర్‌గూడ, కింగ్ కోఠి వైపునుంచి వచ్చే వాహనాలను బషీర్‌బాగ్ జంక్షన్ నుంచి లిబర్టీ, ఎన్టీఆర్ మార్గ్ వైపునకు పంపుతారు.
- ట్యాంక్‌బండ్ వైపునుంచి రవీంద్రభారతి వైపునకు వచ్చే వాహనాలను ఇక్బాల్ మినార్, టెలిఫోన్ భవన్ వైపునకు పంపుతారు.
- తెలుగుతల్లి ఫ్లైఓవర్ వైపునుంచి వచ్చే వాహనాలను ప్లేస్ కాలనీ రోడ్, తెలుగుతల్లి జంక్షన్ వైపునకు పంపుతారు.
- రాజ్‌భవన్‌లో నిర్వహించే ఎట్‌హోం కార్యక్రమం సందర్భంగా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఉంటాయి. ఎట్‌హోం కార్యక్రమానికి అనుమతి ఉన్న వారికి పాసులను బట్టి పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. బ్లూ, రెడ్ పాసులున్నవారు ఆరో గేట్ 3 ద్వారా లోనికి ప్రవేశించి, నిర్దేశించిన ప్రదేశంలో పార్కింగ్ చేసుకోవాలి.

కమీషన్‌కు బ్యాంక్ ఖాతాలు

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 'మీ దగ్గర బ్యాంక్ ఖాతా ఉందా..? ఉంటే వివరాలివ్వండి.. కాస్త డబ్బు తెప్పించుకుని.. వాటిని ట్రాన్స్‌ఫర్ చేసిన తర్వాత మీ ఖాతా వివరాలు మీకు ఇచ్చేస్తాం.. దానికి కొంత మొత్తం చెల్లించుకుంటాం..' అని అమాయకులను టార్గెట్ చేస్తారు. ఖాతాల్లేని వారికి ఖాతాలు తెరిపిస్తామని వారి అకౌంట్‌లు తెరిపించి.. ఓ ట్రాన్సాక్షన్ చేసి ఇస్తామని వివరాలు తమ వద్దే ఉంచుకుంటారు. ఆయా ఖాతాల వివరాలను సైబర్ క్రిమినల్స్‌కు విక్రయిస్తారు. ఆ క్రిమినల్స్.. అమాయకులను వాట్సాప్, ఇన్‌స్టా లాంటి సోషల్ మీడియా ద్వారా పార్ట్‌టైం సంపాదన అంటూ ఆకర్షిస్తారు. కొన్ని టాస్క్‌లు ఉంటాయని, దానికి డబ్బులు వస్తాయని నమ్మిస్తారు. నమ్మిన వారు తొలుత రూ.100, రూ.500 ఇలా పెట్టుబడి పెడతారు. నిమిషాల వ్యవధిలో రెట్టింపు డబ్బు ఖాతాల్లోకి వచ్చేస్తుంది. నమ్మకం పెరిగిన తర్వాత కాస్త ఎక్కువ రూ.10వేలు, రూ.50వేలు పెట్టుబడి పెడతారు. 'ఆ డబ్బు స్టక్ అయింది.. మళ్లీ పెట్టండి.. అంతా కలిపి వచ్చేస్తుంది..' అని మాయమాటలు చెప్పి లక్షల్లో డబ్బు పెట్టిస్తారు. ఆ తర్వాత ఆయా ఖాతాల్లో వచ్చిన డబ్బును ఎప్పటికప్పుడు విదేశాల్లో ఉండే ఖాతాలకు మళ్లించడం లేదా క్రిప్టో కరెన్సీగా మార్చేస్తుంటారు. నమ్మి లక్షల్లో డబ్బు పెట్టి మోసపోతున్న అమాయకులు చివరకు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇటువంటి కేసుల్లో అసలు నిందితులను పట్టుకోవడం పోలీసులకు ఓ ప్రహసనంగా మారింది. తాత్కాలికంగా ఖాతాలు సమకూర్చిన దళారీలకు ప్రతి ఖాతాకు రూ. 2వేల నుంచి రూ. 10వేల వరకు కమీషన్ ఇస్తుంటారు. అయితే, తెలియకుండానే ఖాతాలు ఇతరుల చేతికి ఇచ్చిన వారికి అసలు కమీషన్ ఏమీ రాకపోగా.. పోలీసుల విచారణ మాత్రం తప్పడం లేదు.

ఇద్దరి అరెస్ట్..

బ్యాంక్ ఖాతాలు సేకరించి.. సైబర్ క్రిమినల్స్‌కు అప్పగిస్తున్న ఇద్దరిని హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వీరి మోసాల బారినపడిన బోయినపల్లికి చెందిన ఓ మహిళ ఆన్‌లైన్‌లో రూ. 7.15 లక్షలు పోగొట్టుకుంది. వాట్సాప్, టెలిగ్రామ్ యాప్‌ల ద్వారా ఆమెను సంప్రదించి టాస్క్‌ల పేరిట ముంచారు. తొలుత లాభాలు చూపి క్రమంగా ఆమె ఖాతా నుంచి డబ్బులు కాజేశారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బేగంపేట్ ప్రాంతానికి చెందిన గుడ్డింగారి వెంకటేశ్ (23), ఓల్డ్ సఫిల్‌గూడ నివాసి మోలుగూరి విజయ్(36)లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా.. ఖాతాల వివరాలు సేకరించి సైబర్ నేరగాళ్లకు అందిస్తే తగిన కమీషన్ అందుతోందని చెప్పారు. ఖాతాల వివరాలు సైబర్ క్రిమినల్స్‌కు అప్పచెబితే బాధితుల ఖాతాల నుంచి వచ్చే డబ్బును ఆయా ఖాతాలకు మళ్లించి, ఆ తర్వాత విదేశాలకు బదిలీ చేస్తుంటారని, నిందితుల సొంత ఖాతాలు ఇస్తే.. పోలీసులకు చిక్కే ప్రమాదముందని గ్రహించి.. ఇలాంటి ట్రిక్కులు వాడుతుంటారని వారు తెలిపారు. పోలీసులు నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.





పలువురికి అవార్డులు

- జైలర్ రామయ్యకు రాష్ట్రపతి అవార్డు



రామయ్య

సైదాబాద్/కుషాయిగూడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలందించిన జైళ్లశాఖ అధికారులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం అవార్డులను ప్రకటించింది. తెలంగాణ జైళ్ల శాఖ డీజీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జైలర్ యడారి రామయ్య రాష్ట్రపతి విశిష్ట సేవా అవార్డుకు ఎంపికయ్యారు. ప్రస్తుతం జైళ్లశాఖ ప్రధాన కార్యాలయం జైలర్‌గా ట్రాన్స్‌పోర్టు విభాగం ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రామయ్య శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి నుంచి అవార్డును అందుకోనున్నారు. చర్లపల్లి ఓపెన్ ఎయిర్ జైలు హెడ్ వార్డర్ కె.అశోక్ కుమార్ ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు. మరో హెడ్ వార్డర్ కె.శ్రీనివాస్ రావు, కేంద్ర కారాగారానికి చెందిన డిప్యూటీ జైలర్ జె.నెహ్రూ, సీనియర్ అసిస్టెంట్‌లు ఎం.ఎస్.సుదర్శన్ రావు, ఎం.శ్రీనివాస్, హెడ్ వార్డర్ కె.సుధీర్‌రెడ్డి జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా చేతుల మీదుగా రూ.5వేల నగదు రివార్డును అందుకోనున్నారు.

ఎయిర్‌మార్షల్‌కు పరమ విశిష్ట సేవా పతకం



మాజీ కమాండెంట్ బావిశెట్టి చంద్రశేఖర్

అల్వాల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భారత వాయుసేనలో విశిష్టమైన సేవలను అందించిన దుండిగల్ ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ మాజీ కమాండెంట్, ఎయిర్ మార్షల్ బావిశెట్టి చంద్రశేఖర్‌కు గురువారం కేంద్ర ప్రభుత్వం పరమ విశిష్టసేవా పతకం ప్రకటించింది. 1984, డిసెంబర్ 21న హెలీకాప్టర్ పైలట్‌గా భారత వైమానిక దళంలో ఫ్లయింగ్ బ్రాంచ్‌లో నియమితులైన చంద్రశేఖర్ అందించిన సేవలకుగాను 2020లో రాష్ట్రపతి చేతుల మీదుగా అతివిశిష్ట సేవా పతకాన్ని కూడా అందుకున్నారు.

హైదరాబాద్‌ను టాప్10లో నిలపాలి

- పది, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో జిల్లా వెనకబడి ఉందనే అపవాదులున్నాయని, వాటిని అధిగమించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు కృషి చేయాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మరో రెండు నెలల్లో ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షలు జరగబోతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే విద్యార్థులపై దృష్టి పెట్టి వారిని సన్నద్ధం చేయాలని సూచించారు. నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ పరీక్షలకు మరో 60 రోజుల సమయం ఉన్నందున ఇప్పటినుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులను సిద్ధం చేయాలని అన్నారు. హైదరాబాద్ జిల్లాను 10లోపు ర్యాంకులో నిలపాలని అన్నారు. అలా వస్తే ఆగస్టు 15న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అధికారులను సన్మానిస్తామని చెప్పారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పరీక్షలపై విద్యార్థులకు భయం పోగొట్టాలని, స్లిప్ టెస్టులు, సిలబస్ రివిజన్‌లు చేయించడం ద్వారా సులువుగా రాసే అవకాశం లభిస్తుందన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమాధికారి యాదయ్య, బీసీ వెల్ఫేర్ అధికారి ఆశన్న, అధికారులు పాల్గొన్నారు.

గుడిసె వేసి కబ్జాకు స్కెచ్

- గతంలో కూల్చి కేసులు పెట్టినా మారని తీరు



ప్రభుత్వ స్థలంలో వేసిన గుడిసె

బంజారాహిల్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ధనవంతులు ఉండే జూబ్లీహిల్స్‌కు అనుకొని ఉన్న బస్తీ అది. రోజురోజుకు ఇక్కడి స్థలాల ధరలకు రెక్కలు రావడంతో అందరి కన్ను బస్తీలోని ప్రభుత్వ స్థలాలపై పడ్డాయి. ఖద్దరు వేసిన నేతలు వారి బంధువులు ఎప్పటికప్పుడు వాటిని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు కూల్చివేస్తున్నా ఆక్రమణలు మాత్రం ఆగడం లేదు. ఇప్పటికే కొన్ని స్థలాలు అన్యాక్రాంతం కాగా, ఓ నేతకు చెందిన బంధువు తాజా కబ్జాకు తెర తీశాడు. గతంలో రెవెన్యూ అధికారులు కేసులుపెట్టినా సదరు నేత బంధువు మాత్రం ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నాడు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 78కి అనుకొని ఉన్న పద్మాలయ అంబేద్కర్‌నగర్ చుట్టూ ప్రభుత్వ స్థలాలు అనేకం ఉన్నాయి. బస్తీకి అనుకొని ఉన్న చిన్నగుట్టపై స్థానిక రాజకీయ నాయకుడి బంధువు కన్ను పడింది. రెండేళ్ల క్రితం అధికారుల కళ్లు కప్పి ఓ గదిని నిర్మించాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు కూల్చివేసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. దీంతో ఈ స్థలం జోలికి రాలేదు. తాజాగా ప్రభుత్వ మారింది. అందరూ హడావుడిగా ఉంటాడని భావించిన నాయకులు తాజాగా 50 గజాల స్థలంలో గుడిసె వేశాడు. దీన్ని ఆసరాగా చేసుకొని చుట్టూ ఉన్న మరో రెండు వందల గజాల స్థలాన్ని కాజేయాలనేది అతని ఉద్దేశం. కోటికి పైగా విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని బస్తీ వాసులు కోరుతున్నారు.

బల్దియా జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించాలి

మల్కాజిగిరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై చర్చించేందుకు బల్దియా జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించాలని బీజేపీ కార్పొరేటర్లు కోరారు. ఈ మేరకు గురువారం బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ ఆరు నెలలుగా జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం జరగలేదని, త్వరలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ రానుందని, ఆలోగా జనరల్ బాడీ సమావేశం నిర్వహించి ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. స్పందించిన కమిషనర్ జోనల్ లెవెల్‌లో సమావేశాలు వెంటనే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు చెప్పారు. కార్పొరేటర్లు శ్రవణ్, సురేఖ, వంగ మధుసూదన్‌రెడ్డి, రవిచారి, చేతన, రాజ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి సాహిత్య సంబురాలు

- హైటెక్‌సిటీలో మూడురోజులపాటు..

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భిన్న దేశాలు విభిన్న రాష్ట్రాల సాహిత్య, సాంస్కృతిక విశేషాల సమ్మిళిత వేదిక 'హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్(హెచ్ఎల్ఎఫ్). ఈనెల 26 నుంచి మూడు రోజుల పాటు హైటెక్‌సిటీలోని సత్వా నాలెడ్జ్ సిటీలో 13వ ఎడిషన్ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కిన్నెరామూర్తి, విజయ్‌కుమార్ తెలిపారు. 'సైన్స్ అండ్ ది సిటీ', 'పర్యావరణ పరిరక్షణపై సంభాషణ', 'దేశంలో అంతరించిపోతున్న భాషలు'.. అంశాలపై సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు కొన్ని అరుదైన పుస్తకాలపై రచయితలతో చర్చాగోష్ఠి, స్టోరీ టెల్లింగ్, చిత్రలేఖనం, సంగీత, నాటక ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు, యువత, పిల్లల కోసం ప్రత్యేకంగా యంగిస్థాన్ నుక్కడ్ పేరుతో చిత్ర, కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నార్వే అతిథి దేశం

ఈ ఏడాది హెచ్ఎల్ఎఫ్ 'నార్వే'ను అతిథి దేశంగా ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో మూడు రోజుల సాహిత్యోత్సవంలో నార్వేకు చెందిన సాహితీవేత్తలు, సామాజికవేత్తలు, కళాకారులు రానున్నట్లు వివరించారు.

యువత చెంతకు హెచ్ఎల్ఎఫ్



ఇంతవరకూ హెచ్‌పీఎస్ లేదా విద్యారణ్య ప్రాంగణాలలో పచ్చని చెట్ల కింద మూడు రోజుల సాహితీ సంబురాలు జరిగేవి. కళలు, సాహిత్యం, సాంస్కృతిక విషయాలను యువతకు చేరువ చేసేందుకు ఐటీ కారిడార్‌లో మొట్టమొదటిసారి హైదరాబాద్ సాహిత్యోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. ఒడిశాకు చెందిన పలువురు సాహితీవేత్తలు, నార్వేకు చెందిన ప్రముఖులు, సైన్స్ రచయితలు మూడు రోజుల సదస్సులో పాల్గొంటున్నారు. కేవలం సాహిత్య, సాంస్కృతిక విషయాల మీద సహేతుకమైన చర్చను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో హెచ్ఎల్ఎఫ్ పనిచేస్తోంది. ఇది పూర్తిగా కొందరు సాహిత్యాభిమానుల ఆర్థిక సహకారంతో స్వచ్ఛందంగా నడుస్తోన్న పండుగ. ఇన్‌క్లూజివ్‌నెస్‌ను ఆచరించడం.. అనుసరించడం.. తద్వారా దాన్ని సమాజంలోనూ భాగం చేయడం లక్ష్యంగా సాహిత్యపండుగ నిర్వహిస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా హెచ్ఎల్ఎఫ్‌కు ఏయేటికాయేడు ఆదరణ పెరుగుతోంది.

\- కిన్నెరామూర్తి, హెచ్ఎల్ఎఫ్ డైరెక్టర్

ఖైదీల క్షమాభిక్ష జీఓ విడుదల నేడు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం జైళ్లశాఖ ఉన్నతాధికారులతో కలిసి మార్గదర్శకాలను విడుదల చేయడం, అధికారులు జాబితా రూపొందించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా నిబంధనలకు లోబడి, సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. జీవో జారీ అయితే, మార్గ దర్శకాలను అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా 131 మంది ఖైదీలకు విముక్తి కలుగనుంది. చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి దాదాపు 60మంది, ఓపెన్ ఎయిర్ జైలునుంచి 31మంది ఖైదీలు విడుదలయ్యే అవకాశం ఉంది.

సైబర్ బాధితులకు ఊరట

- పోలీసులు రికవరీ చేసిన డబ్బు ఖాతాల్లోకి..

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల బారిన పడి డబ్బులు పోగొట్టుకున్న కేసుల్లో రికవరీ అయిన సొమ్ము బాధితుల ఖాతాల్లోకి చేరనుంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి 25 వరకు సైబరాబాద్ సైబర్ క్రైంపోలీసులు 39 కేసుల్లో రూ.1.49కోట్లు బాధితుల ఖాతాల్లో జమ చేయాలని రంగారెడ్డి జిల్లా 9వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో బాధితుల ఖాతాల్లోకి రెండు, మూడు రోజుల్లో ఆ డబ్బులు చేరే అవకాశముంది.

బీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కౌన్సెలింగ్ 29, 30న

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) అడ్మిషన్ల కౌన్సెలింగ్ ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ ఎల్‌వీకే రెడ్డి తెలిపారు. విశ్వవిద్యాలయం నిర్వహించిన బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) ప్రవేశపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు రెండు తెలుగు రాష్ట్రాల్లోని అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ కోసం హైదరాబాద్‌లోని వర్సిటీ ప్రాంగణంలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన నేడొక ప్రకటనలో సూచించారు. 29న వీఐ, హెచ్ఐ, 30న ఐఆర్ అభ్యర్థులకు కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

వృద్ధ దంపతులను మోసం చేసి రూ.35 లక్షలు కాజేత

యూసుఫ్‌గూడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వృద్ధ దంపతులను మోసం చేసి చేసి దాదాపు రూ. 35 లక్షలు కాజేశాడు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పదవీ విరమణ పొందిన కె. రాజేశ్వరి, భర్త జస్వంత్ సింగ్‌తో కలసి రహ్మత్ నగర్ ప్రాంతంలో నివాసముంటున్నారు. వారి ఇంటికి సమీపంలో ఉంటున్న కోనేరు విక్రమాదిత్య అలియాస్ కె.సందీప్, ఆ దంపతులకు చేదోడుగా ఉంటూ అవసరమైన పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో 2020లో సందీప్ తన భర్త వద్ద రూ.10 లక్షలు అప్పు తీసుకున్నాడు. తరువాత జస్వంత్ సింగ్ మృతి చెందాడు. కరోనా సమయంలో ఆన్‌లైన్ అకౌంట్ ద్వారా రాజేశ్వరీ ఫించన్ రూ.50 వేలు, మరోసారి లక్షా.. సందీప్ తన అకౌంట్‌కు బదిలీ చేసుకున్నాడు. ఇలా పలుమార్లు రాజేశ్వరికి తెలియకుండా మొత్తం రూ.35,52,059 బదిలీ చేసుకున్నాడు. విషయం తెలుసుకుని సందీప్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు. మోసోయానని గ్రహించిన రాజేశ్వరీ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బైకులతో నేరస్థుడు సిద్దయ్య

డెకాయ్ ఆపరేషన్‌తో బైకుల దొంగ అరెస్ట్

కొత్తపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మెట్రో స్టేషన్స్ వద్ద బైకులు దొంగిలిస్తూ తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్థుడిని ఎల్‌బీనగర్ పోలీసులు డెకాయ్ ఆపరేషన్‌తో పట్టుకున్నారు. 20 బైక్‌లు, 4 బైకు తాళం చెవులు, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎల్‌బీనగర్ పీఎస్‌లో గురువారం డీసీపీ ప్రవీణ్‌కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. వ్యసనాలకు బానిసై నేరాల బాటపట్టిన ఆంధ్రప్రదేశ్ ఒంగోల్‌కు చెందిన పాలెపోగు సిద్దయ్య(44)తాపీ మేస్త్రీ, కూలీ. పేకాట ఆడేందుకు, మద్యం తాగడానికి నేరాల బాటపట్టాడు. 2020లోనే మరిపూడి పీఎస్ పరిధిలో అరెస్టయిన అతడిపై ఒంగోలు జిల్లా పోలీస్ స్టేషన్లలో 15 బైకు దొంగతనాల కేసులున్నాయి. జైలునుంచి విడుదలై యేడాదికాలంగా నగరంలోని జీడిమెట్ల, షాపూర్‌నగర్, సుభాష్‌నగర్‌లో ఉంటూ మేస్త్రీ, కూలీ పనులు చేస్తూ కుటుంబంతో ఉంటున్నాడు.

మెట్రో స్టేషన్ల వద్ద మాటు వేసి

మెట్రో స్టేషన్ల వద్ద మాటు వేసి, అతడు డూప్లికేట్ తాళపుచెవులతో పాత బైకులను దొంగిలించేవాడు. వాటిని ఒంగోల్‌లో తక్కువ ధరకు అమ్మేసి మూడు ముక్కలాట ఆడుతూ, మద్యం తాగుతూ డబ్బు ఖర్చు చేసేవాడు. బైకులు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదులతో అప్రమత్తమైన ఎల్‌బీనగర్ ఏసీపీ జానకిరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ అంజిరెడ్డి, డీఐ వీరాస్వామి, సిబ్బంది డెకాయ్ ఆపరేషన్‌తో(పాత బైక్‌లను స్టేషన్ వద్ద ఉంచి మాటు వేసి) నిఘా ఉంచారు. వాటిని దొంగలించేందుకు వచ్చిన నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా పాత నేరస్థుడిగా గుర్తించారు. నేరాలు అంగీకరించడంతో అతడు దాచిన 20 బైకులను స్వాధీనం చేసుకుని, రిమాండుకు తరలించారు. ఎల్‌బీనగర్, ఉప్పల్ పరిధిలో ఐదు చొప్పున, కూకట్‌పల్లిలో మూడు, మియాపూర్‌లో 2 కేసులు, కేపీహెచ్‌బీ, ఆంధ్రప్రదేశ్ గుంటూరుల్లో ఒక్కో కేసును ఛేదించారు, మరో 3 కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సహజయోగ

జయహో భారత మాతా జయహో



ప్రతియేటా ఆగస్టు 15వ తేదీన... వలస పాలన నుంచి భారతదేశం విముక్తి పొందిన సందర్భాన్ని... స్వాతంత్య్ర దినంగా వేడుక చేసుకుంటాం. భారత రాజ్యాంగాన్ని అధికారికంగా ఆమోదించిన రోజుగా జనవరి 26వ తేదీ నాడు గణతంత్ర దినోత్సవం నిర్వహించుకుంటాం. ఈ ఏడాది యావద్భారతావని 75వ గణతంత్ర వేడుకలు జరుపుకొంటోంది.

పూజ్యశ్రీమాతాజీ నిర్మలాదేవి నాటి స్వాతంత్య్ర సమరంలో తన అనుభవాల గురించి వివిధ సందర్భాల్లో పలు విషయాలు వెల్లడించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో, 1941లో... భారతమాతను కీర్తిస్తూ ఒక గీతాన్ని ఆమె రచించి గానం చేశారు. 'మా తేరీ జయహో, తేరాహి విజయ్ హో, తేరే గీత్ సే ఆజ్ జగయే జీవిత్ హో మా తేరీ జయ్‌హో' అనే గీతాన్ని స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా సహజయోగులు ఇప్పటికీ గానం చేస్తూ ఉంటారు. ఆ గీతానికి తెలుగు అనువాదం:

జయహో! భారత మాతా! జయహో!
నీ జయ జయ ధ్వానాలతో జగమంతా మారు మోగుతోంది
జయహో భారత మాతా జయహో !
నీ పల్లెల్లోని పచ్చటి పొలాలు కూడా నీ కీర్తి గానాన్ని ఆలపిస్తున్నాయి.
నీ జయ జయ ధ్వానాలతో పట్టణాలు మారుమోగుతున్నాయి.
జయహో భారత మాతా జయహో
ప్రజలు దాస్య శృంఖలాలతో బతుకీడుస్తున్నా.. ఈ దేశం గర్వంగా నీ జయ జయ గానాలు చేస్తోంది.
నా కళ్ళు అశ్రుతప్తమైనప్పుడు, దుఃఖంతో నా గొంతు మూగబోయినప్పుడు
నా హృదయం మాత్రం నీ విజయం కోసం పరితపిస్తోంది
జయహో భారత మాతా జయహో!
అమర వీరుల చితి మంటలు ఆకాశానికి ఎగిరి పడుతున్నప్పుడు కూడా వారి ఆత్మలు నీ విజయం కోసమే నీ కీర్తిని శ్లాఘిస్తున్నాయి.
జయహో భారత మాతా జయహో!

భారతదేశం అనేక భిన్నమతాలు, సంస్కృతులు, సంప్రదాయాలు, అత్యున్నతమైన ఆధ్యాత్మిక వారసత్వం కలిగిన పుణ్యభూమి. ఎందరో ఆధ్యాత్మిక గురువులు, అవతార పురుషులు, మహర్షులు జన్మించిన యోగ భూమి. అయితే ఈ దేశం ఎన్నో విదేశీ శక్తుల దాడులకు లోనయింది. సుమారు 300 ఏళ్ళ బ్రిటిష్ పాలనలో అనేక చేదు అనుభవాలను చవిచూసింది. ఎంతోమంది దేశభక్తుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా... దాస్య శృంఖలాల నుంచి భారతజాతి విముక్తి పొంది.. స్వాతంత్ర్యం సంపాదించుకుంది. మహాత్మా గాంధీ లాంటి ఎందరెందరో మహనీయులు, దేశభక్తులు ఈ ఉద్యమంలో తమవంతు పాత్ర పోషించారు. అలాగే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, త్యాగాలు చేసినా... చరిత్ర పుటలలోకి ఎక్కనివారూ ఉన్నారు. వారిలో శ్రీమాతాజీ నిర్మలాదేవి తండ్రి ప్రసాదరావు సాల్వే కుటుంబం ఒకటి. బాల్యం నుంచే జాతీయ భావాలు నిర్మలాదేవి మనసులో గట్టిగా నాటుకున్నాయి.

"నా దేశభక్తి ఎంత లోతైనదో నాకు తెలుసు. మన జాతీయ పతాకాన్ని చూసినప్పుడు, వందేమాతరం లాంటి దేశభక్తి గీతాలను విన్నప్పుడు. కన్నీటి పర్యంతమవుతాను. స్వాతంత్ర్యం కోసం ప్రజలు పడిన కష్టాలు కళ్ళారా చూశాను. అవి గుర్తు రావడం వల్ల కావచ్చు లేదా మన దేశంలో నెలకొన్న క్లిష్టమైన పరిస్థితుల వల్ల కావచ్చు, నా హృదయంలో దేశం పట్ల ఉన్న ప్రేమ వల్ల కావచ్చు... ఆ ఉద్వేగాన్ని నేను తట్టుకోలేను. అలాంటి ఒక సంఘటన ఇంకా నా మనసులో మెదులుతోంది. ఒక రోజు మా తండ్రిగారు జాతీయ జెండాను భుజాన వేసుకొని... హైకోర్టు ప్రాంగణంలో నడుస్తూ ఉంటే.. బ్రిటిష్ పోలీసులు ఆయనను తుపాకీతో కాల్చారు. కాలికి గాయమై, రక్తం కారుతున్నా లెక్క చేయకుండా ఆయన 'వందేమాతరం' అని నినదిస్తూ సాగిపోయారు. ఇలాంటి సంఘటనలు ఆ రోజుల్లో ఎన్నో చూశాను. అలాంటి దేశభక్తులను కన్న ధన్యభూమి మన భారతదేశం" అని ఆమె చెప్పారు.

శ్రీమాతాజీ నిర్మలాదేవి తండ్రి ప్రసాదరావు సాల్వే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏర్పడిన మొట్టమొదటి రాజ్యాంగ సభలో సభ్యుడిగా ఉన్నారు. అంతే కాదు, రాజ్యాంగ రచనలో పాలుపంచుకున్నారు. దేశ విముక్తి కోసం తమ సర్వస్వాన్ని నిస్వార్థంగా త్యాగం చేసి, గాంధీ మహాత్ముని అడుగుజాడల్లో పయనించిన శ్రీమాతాజీ నిర్మలాదేవినీ, ఆమె కుటుంబాన్నీ ఈ సందర్భంగా స్మరించుకోవడం సముచితం.

> స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, త్యాగాలు చేసినా... చరిత్ర పుటలలోకి ఎక్కని వారూ ఉన్నారు. వారిలో శ్రీమాతాజీ నిర్మలాదేవి తండ్రి ప్రసాదరావు సాల్వే కుటుంబం ఒకటి. బాల్యం నుంచే జాతీయ భావాలు నిర్మలాదేవి మనసులో గట్టిగా నాటుకున్నాయి.






డాక్టర్ పి. రాకేష్,
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

మెహెర్‌వాణి

అంతా నా సంకల్పమే



31న అవతార్ మెహెర్‌బాబా అమరతిథి

అవతార్ మెహెర్‌బాబాను మానవరూపంలో వచ్చిన జన్మించిన భగవంతుడిగా భక్తులు ఆరాధిస్తారు. గత అవతారాలలో రాముడిగా, కృష్ణునిగా, బుద్ధుడిగా, ఏసు క్రీస్తుగా వచ్చాననీ, ఇప్పుడు మెహెర్‌బాబాగా అవతరించాననీ ఆయన ప్రకటించారు. ఆయన కొన్నాళ్ళు ఒక కొండమీద ఏకాంతంగా గడిపారు. ఆహారం తీసుకోకుండా... కేవలం కాఫీ మాత్రమే తాగేవారు. లాహూ అనే పల్లెటూరి కుర్రవాడు ఆయనకు కొండ కింద నుంచి ఫ్లాస్క్‌లో కాఫీ తీసుకువచ్చేవాడు. దారిలో అతను కొంత కాఫీ తాగుతూ ఉండేవాడు. అదే ఫ్లాస్కులో కాఫీని బాబాకు ఇచ్చేవాడు. ఈ ఉదంతం గురించి తెలిసిన ఒక భక్తుడు కొంతకాలం తరువాత బాబాకు దాన్ని గుర్తు చేస్తూ "మీరు కొండమీద ఏకాంతంలో ఉన్నప్పుడు... ఒక పల్లెటూరి పిల్లవాడు కాఫీ తెచ్చేవాడు. ఫ్లాస్క్‌లో కాఫీ మధ్యలో అతను తాగేవాడు. మీకేమీ అనిపించలేదా? మీరు అవతార పురుషులు. మీరు రాముని అవతారంలో ఉన్నప్పుడు... శబరి కొరికిన ఎంగిలి పండ్లను తిన్నారు కదా! అప్పుడు మీరది పట్టించుకోలేదు. అందుకే ఆ కుర్రాడు మీ కాఫీని ఎంగిలి చేసినా పట్టించుకోలేదా?" అని అడిగాడు. అప్పుడు బాబా "నువ్వు చెప్పింది నిజం. నేను పట్టించుకోలేదు. కానీ మెహెరాకి (బాబా సన్నిహిత భక్తురాలు) అది నచ్చదు. నా భక్తులు అలాంటి విషయాల్లో శ్రద్ధ తీసుకుంటారు. నేను తీసుకోను. రాముడు అడవుల్లో ఉన్నాడు. అప్పట్లో ప్రజలకు శుచి గురించి తెలీదు" అన్నారు.

"వాటిలో క్రిములు ఉంటే మీ మీద ప్రభావం చూపిస్తాయి కదా?" అన్నాడు ఆ భక్తుడు.

"అవును. చూపిస్తాయి. కానీ నేను దేవుణ్ణి. ప్రపంచంలో అంతా నా సంకల్పం ప్రకారమే జరుగుతుంది. నాకు అనారోగ్యం రాకూడదనేది నా సంకల్పమే" అన్నారు బాబా.

"మిమ్మల్ని ఈ ప్రశ్నలు అడగడం కూడా మీ సంకల్పమేనా?" అని అడిగాడా భక్తుడు.

"అవును నా సంకల్పమే" అన్నారాయన.

ఒక ఏడాది శ్రీరామనవమి వేడుకలను బాబా సమక్షంలో ఘనంగా జరిపారు. ఆ సందర్భంలో భక్తుడి కుమార్తె అయిన షీలా అనే పన్నెండేళ్ళ అమ్మాయితో మెహెర్‌బాబా మాట్లాడుతూ రాముడు అనేక ఇక్కట్లు ఎదుర్కొన్నాడని చెప్పారు. "నీవు రామాయణం చదివావా? చదువు" అని ఆమెకు సూచించారు. "చదవలేదు బాబా! మీరు మా పక్కన ఉండగా రామాయణం, భగవద్గీత మాకెందుకు" అని ఆమె జవాబు ఇచ్చింది. "ప్రతి ఒక్కరూ రామాయణం తప్పక చదవాలని అన్నారు. ఆ గ్రంథం ద్వారా రఘురాముడి ఔన్నత్యం గురించి, మానవాళి కోసం రాముడు అనుభవించిన బాధల గురించి అవగాహన కలుగుతుంది" అని బాబా తెలిపారు. "భగవంతుడు మానవ రూపధారిగా వచ్చినప్పుడు, సామాన్య మానవునిలా అన్ని రకాల బాధలు అనుభవించవల్సిందే" అని ఆ చిన్నారి అడిగిన మరో ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.

• మల్లాది కృష్ణానంద్

సినీ వనంలో విరిసిన పద్మాలు

ప్రతిభామూర్తులపై పురస్కార వర్షం కురిసింది. అభినందనల వెల్లువతో అద్వితీయ కళామూర్తులు తడిసి తరించిపోయారు. భారతీయ వెండితెరపై వెన్నెల సంతకాన్ని అద్దిన అందాల చందమామ వైజయంతి మాల.. తెలుగు ప్రజల హృదయాల్లో చెదరని స్థానాన్ని సొంతం చేసుకున్న మెగాస్టార్ చిరంజీవి.. ఇటీవలే దిగంతాలకు చేరిన నటనాయకుడు విజయ్‌కాంత్.. డిస్కోడాన్సర్‌గా యువతరంతో స్టెప్పులేయించిన మిథున్ చక్రవర్తి.. తన గానంతో శ్రోతల్ని ఉర్రూతలూగించిన ఉషా ఊతప్... 'పద్మ' విజేతలయ్యారు. వారికి అక్షరాభినందనలు అందిస్తూ..













చిరంజీవి కీర్తికిరీటంలో మరో కలికితురాయి వచ్చి చేరింది. ఇప్పటికే పద్మభూషణుడిగా అలరారుతున్న మెగాస్టార్ చిరంజీవి, ఇప్పుడు పద్మవిభూషణుడయ్యారు. 2024వ సంవత్సరానికి గాను, కళారంగ విభాగం నుంచి దేశంలోనే రెండవ అత్యున్నత పురస్కారమైన 'పద్మవిభూషణ్'పురస్కారానికి చిరంజీవి ఎంపికయ్యారు. ఆయన్ని ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం వరించడంతో తెలుగుచిత్ర పరిశ్రమతోపాటు కోట్లాదిమంది అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు చిత్రపరిశ్రమ తరఫున ఈ పురస్కారం అందుకున్న వారిలో చిరంజీవి రెండవవారు కాగా, తెలుగు సినీ కళాకారుడిగా ఆయన మూడోవారు. 2011వ సంవత్సరంలో నటసమ్రాట్, డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు ఈ పురస్కారం అందుకున్నారు. అలాగే తెలుగువారైన గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కూడా ఈ అవార్డు అందుకున్నారు. అయితే.. ఆయనకు తమిళనాడు ప్రభుత్వ ప్రతిపాదనపై ఈ అవార్డు లభించింది. తెలుగువాడిగా, తెలుగు చిత్రపరిశ్రమ తరఫున అక్కినేని తర్వాత ఇన్నాళ్లకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని చిరంజీవి అందుకోనున్నారు.

1978లో 'ప్రాణంఖరీదు' సినిమాతో నటుడిగా చిరంజీవి ప్రయాణం మొదలైంది. తొలినాళ్లలో ప్రతినాయకపాత్రలు కూడా పోషించారాయన. 'మనవూరి పాండవులు' సినిమాకి గాను తొలి వందరోజుల జ్ఞాపిక అందుకున్నారు. కె.బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన ఇదికథకాదు, 47రోజులు చిత్రాలు నటుడిగా చిరంజీవిని నిలబెట్టాయని చెప్పాలి. ఆయన కెరీర్‌కు తొలి బ్రేక్ 'పున్నమినాగు'. ఇందులో చిరంజీవి నటనకు తెలుగుప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. 'పున్నమినాగు' తర్వాత చిరంజీవి విషయంలో ప్రేక్షకుల దృక్కోణం మారింది. 'ఇంట్లోరామయ్య-వీధిలోకృష్ణయ్య'తో కుటుంబ ప్రేక్షకులకు చేరువైన చిరంజీవి, 'ఖైదీ'తో స్టార్‌గా మారారు. ఓవైపు అభిమానుల్ని దృష్టిలో పెట్టుకొని సినిమాలు చేస్తూనే.. నటుడిగా ఆకలి తీర్చుకునేందుకు అభిలాష, ఛాలెంజ్, శుభలేఖ, విజేత, రుద్రవీణ, ఆరాధన, స్వయంకృషి, ఆపద్బాంధవుడు తదితర చిత్రాలు చేస్తూ భళా అనిపించుకున్నారు చిరంజీవి.

తెలుగు సినిమా అంటే చిరంజీవికి ముందు, చిరంజీవి తర్వాత అనేంతగా చరిత్ర సృష్టించారు. ఆయన ఆగమనంతో తెలుగు సినిమాలో గణనీయమైన మార్పులొచ్చాయి. వేగం పెరిగింది. ఆంగికాభినయం, ఆహార్యం, డాన్సులు, పోరాటాలు ఇలా చాలా విషయాల్లో మార్పుకు కారణమయ్యారు చిరంజీవి. తర్వాత వస్తున్న తరానికి రోల్‌మోడల్‌గా నిలిచారు.

'పసివాడి ప్రాణం'(1987) చిత్రం చిరంజీవి ఇమేజ్‌ని సమూలంగా మార్చేసింది. ఆ సినిమాతో టాలీవుడ్ నంబర్‌వన్ హీరోగా అవతరించారాయన. ఆ సినిమా నుంచి 'శంకర్‌దాదా జిందాబాద్'(2007) వరకూ చిరంజీవికి ఎదురు లేకుండా పోయింది. ఎన్టీయార్ తర్వాత తెలుగుచలనచిత్ర చరిత్రలో ఎక్కువ సంవత్సరాలు నంబర్‌వన్ స్థానాన్ని అధిష్ఠించిన హీరోగా రికార్డ్ సృష్టించారు చిరంజీవి.

2007లో 'ప్రజారాజ్యం' పేరుతో రాజకీయ పార్టీని స్థాపించి ఎన్నికల్లో గణనీయమైన ఓట్లు, సీట్లు సాధించారు. శాసనసభ్యుడిగా, కేంద్రసహాయమంత్రిగా బాధ్యతలను నిర్వర్తించిన చిరంజీవి.. ఆ తర్వాత రాజకీయాలకు దూరం జరిగారు. దాదాపు పదేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉన్న ఆయన.. 'ఖైదీనంబర్ 150'తో మళ్లీ హీరోగా రీఎంట్రీ ఇచ్చారు. పదేళ్ల విరామం తర్వాత వచ్చిన ఆ సినిమా వందకోట్ల పైచిలుకు వసూళ్లను సాధించి, చిరంజీవి స్టామినా ఏ మాత్రం తగ్గలేదని నిరూపించింది. ప్రస్తుతం హీరోగా యువహీరోలకు సైతం పోటీ ఇస్తూ దూసుకుపోతున్నారు మెగాస్టార్.

ఇక సేవాకార్యక్రమాల విషయం చిరంజీవి ఎప్పుడూ ముందే వుంటారు. చిరంజీవి బ్లడ్‌బ్యాంక్, చిరంజీవి ఐబ్యాంక్‌ల ద్వారా ప్రజలకు సేవలందిస్తూ ఆపద్బాంధవుడనిపించుకున్నారు. అంతేకాదు, కరోనా టైమ్‌లో ఆక్సిజన్ ప్లాంట్‌లను స్థాపించి, ఆక్సిజన్ సిలండర్లను అందించి వేలాదిమంది బాధితులను ఆదుకున్నారు. ఇక ఆయన చేసే గుప్తదానాలకైతే లెక్కేలేదు.

తెలుగు సినిమా స్థాయినీ, గౌరవాన్ని పెంచి ఎందరో నటులకు ఆదర్శప్రాయుడిగా నిలిచిన ఈ మహానటుడిని రెండవ అత్యున్నత జాతీయపురస్కారమైన 'పద్మవిభూషణ్' వరించడం హర్షణీయం.

> నటుడిగా 46ఏళ్ల కెరీర్.. ఎన్నో అద్భుతమైన పాత్రలు.. ఉత్తమనటుడిగా రాష్ట్రప్రభుత్వం నుంచి మూడు సార్లు నంది అవార్డులు, నటుడిగా తొమ్మిది ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, 2006లో పద్మభూషణ్, 2016లో రాష్ట్రప్రభుత్వ ప్రతిష్ఠాత్మక రఘుపతివెంకయ్య పురస్కారం, ఐఎఫ్‌ఎఫ్‌ఐ ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్‌గా 2022లో జాతీయ గౌరవ పురస్కారం.. ఇక ప్రైవేటు సంస్థల పురస్కారాలకైతే లెక్కేలేదు.





అందాలరాశికి అపురూప పురస్కారం





నాటి అందాలతార, అద్భుత నర్తకి, గొప్పనటి వైజయంతిమాలను పద్మవిభూషణ్ అవార్డు వరించింది. 1968లో పద్మశ్రీ అవార్డును అందుకున్న వైజయంతిమాల, 2011లో పద్మభూషణ్ పురస్కారాన్ని కూడా సొంతం చేసుకున్నారు. ఈ ఏడాది గణతంత్రదినోత్సవ సందర్భంగా దేశంలోని రెండో అత్యుత్తమ పురస్కారమైన పద్మవిభూషణ్ పురస్కారానికి భారత ప్రభుత్వం వైజయంతిమాలను ఎంపిక చేసింది.

తమిళనాడు మద్రాస్ ప్రెసిడెన్సీలోని ట్రిప్లికెన్‌లో 1933లో జన్మించారు వైజయంతిమాల. ఆమె తల్లి వసుంధరదేవి శాస్త్రీయనృత్య కళాకారిణి. కొన్ని సినిమాల్లో కూడా ఆమె నటించారు. తల్లి వారసత్వంగా వైజయంతిమాల కూడా చిన్నతనంలోనే శాస్త్రీయనృత్యం అభ్యసించి, ప్రావీణం సాధించారు. అలాగే కర్ణాటక సంగీతం కూడా నేర్చుకున్నారు. ఆమెలోని కళాతృష్ణను గమనించిన తల్లి ఆమెను నటిగా ప్రోత్సహించారు.

తమిళంలో ఏవీఎం ప్రొడక్షన్స్ నిర్మించిన 'వళ్కై'(1949) వైజయంతిమాల తొలి చిత్రం. అదే సినిమా 'జీవితం'(1950) పేరుతో తెలుగులో రీమేక్ చేశారు. ఆ సినిమా ద్వారా తెలుగు తెరకు పరిచయం అయ్యారు వైజయంతిమాల. 1954లో విడుదలైన 'సంగం' సినిమాలో ఎన్టీయార్‌తో కలిసి నటించారు. తెలుగు, తమిళ భాషల్లో పలు చిత్రాల్లో నటించారు వైజయంతిమాల. 1951లో ఏవీఎం సంస్థ నిర్మించిన 'బహార్' చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన వైజయంతిమాల 'లడ్కీ', 'నాగిన్' చిత్రాలతో అక్కడ తిరుగులేని సూపర్‌స్టార్‌గా ఎదిగారు. దిలీప్‌కుమార్ హీరోగా రూపొందిన 'దేవదాస్'(1955) చిత్రంలో చంద్రముఖి పాత్ర నటిగా వైజయంతిమాలకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ పాత్రకు తొలి ఫిల్మ్‌ఫేర్ అందుకున్నారామె. ఆ వరుసలోనే కెరీర్ మొత్తంమీద 5 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు వైజయంతిమాల.

అందం, అభినయం, అబ్బురపరిచే నాట్యకౌశలంతో బాలీవుడ్ ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేశారు వైజయంతిమాల. అప్పట్లో హీరోతో ప్రమేయం లేకుండా కేవలం ఆమె కోసమే టికెట్లు తెగేవి. ఓ విధంగా ఆమెది కూడా హీరో ఇమేజే. ఎంతటి నటులనైనా డామినేట్ చేయగల అద్భుతమైన సౌందర్యం వైజయంతిమాల సొంతం. హిందీ పరిశ్రమను ఉర్రూతలూగించిన కాంబినేషన్ దిలిప్‌కుమార్, వైజయంతిమాల. వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన మధుమతి, గంగజమున, నయాదౌర్ చిత్రాలు ఇండియన్ క్లాసిక్స్‌గా నిలిచాయి. అలాగే వైజయంతిమాల, రాజ్‌కపూర్ నటించిన 'సంగం' చిత్రం ప్రాంతాలకు అతీతమైన విజయాన్ని సాధించింది. కిశోర్‌కుమార్‌కు జోడీగా 'న్యూఢిల్లీ', దేవానంద్ 'జ్యూయల్‌థీఫ్', హిస్టారికల్ మూవీ 'ఆమ్రపాలీ'.. ఇలా చెప్పుకుంటూపోతే అద్భుతాలు ఎన్నో!

వైజయంతిమాల గొప్ప నటి, నృత్యకళాకారిణి మాత్రమే కాదు. గొప్ప గురువు కూడా. ఎంతోమందికి నృత్యాన్ని నేర్పారామె. అంతేకాదు, శిష్యగణంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడమేకాక, సొంతంగా నృత్యరీతుల్ని కూడా సమకూర్చారామె.

కేవలం సినిమాకు సంబంధించిన పురస్కారాలేకాక, నాట్యకళాకారిణిగా ఎన్నో ప్రైవేటు సంస్థల నుంచి అవార్డులను అందుకున్నారు వైజయంతిమాల.

ఆమె తమిళనాడు ప్రభుత్వం కలైమామణి బిరుదుతో సత్కరించింది. 2008వ సంవత్సరానికి గాను అక్కినేని నాగేశ్వరరావు నేషనల్ అవార్డును కూడా అందుకున్నారామె..

90 ఏళ్ల వయసు.. 75 ఏళ్ల కళాజీవితం.. లెక్కకు మించిన పురస్కారాలు.. దేశం గర్వించదగ్గ కళారూపాలు.. వెరసి వైజయంతిమాల. ఆ మహాకళాకారిణికి దేశంలోని రెండో అత్యుత్తమ పురస్కారమైన పద్మవిభూషణ్ వరించడం నిజంగా ఆనందించదగ్గ విషయం.

కెప్టెన్‌కు పద్మభూషణ్



తమిళ సినీ, రాజకీయరంగాల్లో నాలుగు దశాబ్దాలకు పైగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న సీనియర్ నటుడు విజయకాంత్. తమిళ సినీ, రాజకీయరంగాల్లో కీలకంగా వ్యవహరించిన ఆయన ఇటీవల కన్ను మూశారు. 'కెప్టెన్'గా అభిమానుల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన విజయకాంత్‌కు పద్మభూషణ్ పురస్కారం ప్రకటించింది కేంద్రప్రభుత్వం.

క్వీన్ ఆఫ్ పాప్

అల్లు అర్జున్ నటించిన 'రేసుగుర్రం' చిత్రంలో టైటిల్ సాంగ్ గుర్తుంది కదూ హస్కీ వాయిస్‌తో ఆ పాట పాడిన గాయని ఉషా ఊతప్. 'క్వీన్ ఆఫ్ పాప్'గా పేరు తెచ్చుకున్న ఉషకు తెలుగులో ఇది రెండో సినిమా. అంతకు ముందు అంటే 1991లో వచ్చిన 'కీచురాళ్లు' సినిమాలో టైటిల్ సాంగ్ పాడారు. తెలుగులో ఆమె ఈ రెండు పాటలే పాడినా, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఎన్నో పాటలు పాడారు. తెర వెనుకే కాదు మలయాళ, తమిళ, కన్నడ, హిందీ చిత్రాల్లో కూడా తెరపై మెరిశారు. పద్మభూషణ్ పురస్కారాన్ని ఆమె అందుకోనున్నారు.



బాలీవుడ్‌పై బలమైన ముద్ర



ఒకప్పుడు తన డాన్సులతో, అభినయంతో యువతరానికి అలరించిన బెంగాలీ బాబు మిథున్ చక్రవర్తి. 'డిస్కో డాన్సర్', 'డాన్స్ డాన్స్' వంటి చిత్రాల్లో మిథున్ డాన్స్ చూసి ఆనాటి అమ్మాయిలు వెర్రెత్తి పోయేవారు. 'ఐయామే డిస్కో డాన్సర్' అంటూ ఆయన తెరపై పాడుతుంటే థియేటర్లలో ప్రేక్షకులు ఆనందంతో గంతులు వేసేవారు. మిథున్ అసలు పేరు గౌరంగ చక్రవర్తి. 1976లో వచ్చిన 'మృగయా' ఆయన తొలి చిత్రం. మొదటి సినిమాతోనే ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డ్ పొందారు. ప్రారంభంలో కొన్ని బెంగాలీ చిత్రాల్లో నటించిన మిథున్ ఆ తర్వాత బాలీవుడ్‌కు వెళ్లి హీరోగా అక్కడ ఎంతో రాణించారు.. ముఖ్యంగా 80ల దశకంలో హిందీ సినిమాపై ఎంతో ప్రభావం చూపిన నటుడాయన. రెండు సార్లు ఉత్తమ నటుడిగా, ఒకసారి సహాయ నటుడిగా మిథున్ జాతీయ అవార్డులు అందుకొన్నారు. హీరోగానే కాదు కేరెక్టర్ ఆర్టిస్టుగా కూడా ఆయన రాణిస్తున్నారు. పవన్‌కల్యాణ్ నటించిన 'గోపాల గోపాల'లో విలన్‌గా ఆకట్టుకొన్నారు. ఆమధ్య వచ్చిన 'కశ్మీరీ ఫైల్స్' చిత్రంలో మిథున్ నటనని ప్రేక్షకులు మరువలేరు. మంచి పాత్రల కోసం ఇప్పటికీ పరితపించే ఆ విశిష్ట నటుడిని పద్మభూషణ్ పురస్కారంతో కేంద్ర ప్రభుత్వం సత్కరించనుంది.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/jq1vCpPలో చదవండి.



ఇళయరాజా కుమార్తె భవతారిణి మృతి



ప్రముఖ సంగీత దర్శకుడు, 'ఇసైజ్ఞాని' ఇళయరాజా కుమార్తె, సంగీత దర్శకురాలు, నేపథ్యగాయని భవతారిణి (47) కేన్సర్ కారణంగా గురువారం సాయంత్రం 5.20 గంటల సమయంలో శ్రీలంకలో మృతి చెందారు. ఐదు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను ఆయుర్వేద చికిత్స కోసం సోదరుడు, సంగీత దర్శకుడు యువన్ శంకర్ రాజా శ్రీలంకకు తీసుకెళ్ళారు. అక్కడి వైద్యులు కేన్సర్ నాలుగో దశగా గుర్తించి చికిత్స అందిస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఆమె గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. తన తండ్రి ఇళయరాజా సంగీతం అందించిన 'భారతి' అనే చిత్రం కోసం ఆమె పాడిన పాటకు ఉత్తమ నేపథ్యగాయనిగా 2000 సంవత్సరంలో జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో సినిమా పాటలను ఆలపించారు. అంతేకాకుండా, ఆమె సంగీత దర్శకురాలిగా కూడా కొనసాగుతున్నారు. చెన్నై నగరంలోని రోసరీ మెట్రిక్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేసిన ఆమె... నటి రేవతి దర్శకత్వం వహించిన 'మిత్ర మై ఫ్రెండ్' అనే చిత్రం ద్వారా సంగీత దర్శకురాలిగా, 'రాసయ్య' అనే చిత్రం ద్వారా గాయనిగా వెండితెరకు పరిచయమయ్యారు. తన తండ్రి ఇళయరాజా, సోదరులు కార్తీక్ రాజా, యువన్ శంకర్ రాజా సంగీతం సమకూర్చిన చిత్రాల్లోనే నేపథ్యగానం చేశారు. ఆమె దాదాపు 20కి పైగా చిత్రాలకు పాటలు పాడారు. అలాగే, 2002లో సంగీత దర్శకురాలిగా పరిచయమైన ఆమె.. దాదాపు పది చిత్రాలకు సంగీతం అందించారు. వీటిలో రెండు హిందీ చిత్రాలు కూడా ఉన్నాయి. 2019లో ఆమె చివరగా 'మాయాండి' అనే చిత్రానికి సంగీతం అందించగా, ఇపుడు మూడు చిత్రాలకు సంగీతం అందించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కాగా, ఇళయరాజా కూడా శ్రీలంకలోనే ఉన్నారు. శనివారం శ్రీలంకలో ఇళయరాజా మ్యూజిక్ ఫెస్ట్ కార్యక్రమం జరగాల్సి ఉండగా, ఇందుకోసం ఆయన అక్కడకు వెళ్ళారు. భవతారిణి మృతదేహాన్ని శుక్రవారం నగరానికి తీసుకునిరానున్నారు. భవతారిణి భర్త శబరి రాజ్ వ్యాపారవేత్త.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

కాన్ఫిడెంట్‌గా ఉన్నా

రవి కస్తూరి



'ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. యాక్షన్, ఎమోషన్ అంశాలతో పాటు ఫ్యామిలీ డ్రామా కూడా ఉంది. జీవితం చాలించాలనుకొనే ఓ వ్యక్తి దాన్ని ఎలా అధిగవించాడనే అంశాన్ని చిత్రంలో చూపించాం. సినిమా ప్రారంభం నుంచి దీనిపై కాన్ఫిడెంట్‌గా ఉన్నా' అన్నారు నిర్మాత రవి కస్తూరి. గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన 'గేమ్ ఆన్' చిత్రాన్ని ఆయన దయానంద్ దర్శకత్వంలో నిర్మించారు. ఫిబ్రవరి 2న ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా గురువారం రవి మీడియాతో మాట్లాడారు. 'ఆస్ట్రేలియాలో వ్యాపారాలు చేస్తూ ఈ చిత్ర నిర్మాణం చూసుకోవడం చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది. కంటెంట్ మీద మాకు పూర్తి నమ్మకం ఉంది. ఫస్ట్ కాపీ చూసి హ్యాపీగా ఫీలయ్యా. ఇకపై నిర్మాతగా కొనసాగాలనుకుంటున్నా. ఇప్పటికే రెండు కథలు విన్నా. ఈ సినిమా రిలీజ్ అయ్యాక వాటిని అనౌన్స్ చేస్తాం' అని చెప్పారు.














బిజినెస్

కార్వీ స్టాక్ బ్రోకింగ్ కేసులో 'సుప్రీం' స్టే

న్యూఢిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్ కేసులో సెబీ, ఎన్ఎస్‌డీఎల్‌కు పెద్ద ఊరట లభించింది. ఈ కేసులో గత ఏడాది డిసెంబరు 20న సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (శాట్) జారీ చేసిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. కార్వీ స్టాక్ బ్రోకింగ్ సంస్థ తన ఖాతాదారుల షేర్లను బ్యాంకుల వద్ద కుదువ పెట్టి పెద్ద మొత్తంలో రుణాలు తీసుకుంది. ఈ కుంభకోణం బయటపడడంతో సెబీ, ఎన్ఎస్‌డీఎల్ రంగంలోకి దిగి ఆ షేర్లను మళ్లీ ఖాతాదారులకు బదిలీ చేయించాయి. యాక్సిస్ బ్యాంక్ నేతృత్వంలోని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఈ విషయాన్ని శాట్‌లో సవాల్ చేశాయి. దాంతో కార్వీ కుదువ పెట్టిన షేర్ల విలువకు సమాన మొత్తాన్ని బ్యాంకులకు చెల్లించాలని శాట్ గత ఏడాది డిసెంబరులో సెబీ, ఎన్ఎస్‌డీఎల్‌ను ఆదేశించింది. ఈ సంస్థలు ఈ విషయాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేశాయి. కేసును విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం శాట్ తీర్పుపై స్టే ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేసు తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

తగ్గిన సైయెంట్ లాభం

హైదరాబాద్: సైయెంట్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.147.2 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే లాభం 5.6 శాతం క్షీణించింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం మాత్రం 12.6 శాతం వృద్ధి చెంది రూ.1,821.4 కోట్లుగా నమోదైంది.

పారిశ్రామిక పద్మాలు

ఇద్దరికి పద్మ భూషణ్.. మరో ఇద్దరికి పద్మశ్రీ


సీతారాం జిందాల్


యంగ్ లియు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాదికి గాను పద్మ పురస్కారాలను ప్రకటించింది. వాణిజ్యం, పారిశ్రామిక విభాగం నుంచి ఇద్దరికి పద్మ భూషణ్, మరో ఇద్దరికి పద్మశ్రీ చొప్పున మొత్తం నలుగురిని ఈ అవార్డులు వరించాయి. కర్ణాటకకు చెందిన జిందాల్ అల్యూమినియం లిమిటెడ్, సీతారాం జిందాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సీతారాం జిందాల్‌కు పద్మ భూషణ్ లభించింది. అలాగే, తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ సీఈఓ, ఛైర్మన్ యంగ్ లియుకు సైతం పద్మ భూషణ్ దక్కింది. ఫాక్స్‌కాన్ ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ. మన దేశంలోనూ మొబైల్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల ప్లాంట్లను నిర్వహిస్తోంది. జేపీమోర్గాన్ ఇండియా సీఈఓ కల్పన మోర్పారియాతో పాటు కర్ణాటకకు చెందిన శశి సోనీకి పద్మశ్రీ లభించింది.


శశి సోనీ


కల్పన మోర్పారియా

పద్మ భూషణ్	పద్మశ్రీ
సీతారాం జిందాల్ (కర్ణాటక)	కల్పన మోర్పారియా (మహారాష్ట్ర)
యంగ్ లియు (తైవాన్)	శశి సోనీ (కర్ణాటక)

బెయిన్ క్యాపిటల్ చేతికి సాయి లైఫ్ సైన్సెస్!



హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న సాయి లైఫ్ సైన్సెస్ కంపెనీ యాజమాన్యం చేతులు మారే సూచనలు కనిపిస్తున్నాయి. కాంట్రాక్టు పద్ధతిలో ఫార్మా కంపెనీలకు పరిశోధన, అభివృద్ధి, తయారీ సేవలు (సీఆర్‌డీఎంఓ) అందించే ఈ కంపెనీ ఈక్విటీలో మెజారిటీ వాటా కోసం ప్రముఖ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ (పీఈ) బెయిన్ క్యాపిటల్ అత్యధిక ధర కోట్ చేసినట్టు సమాచారం. ఇందుకోసం మరో పీఈ సంస్థ టీపీజీ క్యాపిటల్ చేతిలో ఉన్న 43.4 శాతం వాటాతో పాటు కంపెనీ ప్రధాన ప్రమోటర్ ఛైర్మన్ కే రంగ రాజు, ఎండీ, సీఈఓ కృష్ణ కనుమూరి వాటాల కొనుగోలుపైనా బెయిన్ క్యాపిటల్ ఆసక్తి చూపిస్తోంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే వచ్చే కొద్ది వారాల్లోనే దీనికి సంబంధించిన ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉంది. ప్రతిపాదిత డీల్‌లో భాగంగా కంపెనీ విలువను సుమారు 80 కోట్ల డాలర్లు (సుమారు రూ.6,600 కోట్లు)గా లెక్కగట్టినట్టు తెలుస్తోంది. దాదాపు 3,000 మంది పని చేస్తున్న సాయి లైఫ్ సైన్సెస్ కంపెనీకి భారత్‌తో పాటు అమెరికా, బ్రిటన్, జపాన్ దేశాల్లోనూ యూనిట్లు ఉన్నాయి. టీపీజీ క్యాపిటల్ 2018లో సాయి లైఫ్‌సైన్సెస్‌లో టీపీజీ క్యాపిటల్ 13.5 కోట్ల డాలర్లు పెట్టుబడులు పెట్టింది. ప్రస్తుతం సంస్థలో టీపీజీకి 43.4 శాతం వాటా ఉండగా మరో పీఈ సంస్థ హెచ్‌బీఎం ప్రైవేట్ ఈక్విటీ ఇండియాకు 6 శాతం వాటా ఉంది. మిగిలిన వాటా పూర్తిగా ఫౌండర్ కుటుంబం/ప్రమోటర్ గ్రూప్ చేతిలో ఉంది.

ఐటీ రంగ షేర్లలో అమ్మకాలు

సెన్సెక్స్ 359 పాయింట్లు డౌన్

ముంబై: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగ షేర్లలో అమ్మకాలతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోవడంతో గురువారం ఈక్విటీ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఒక దశలో 741 పాయింట్లకు పైగా క్షీణించిన సెన్సెక్స్ చివరికి 359.64 పాయింట్ల నష్టంతో 70,700.67 వద్ద ముగిసింది. నిఫ్టీ 101.35 పాయింట్లు కోల్పోయి 21,352.60 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 నష్టపోగా.. టెక్ మహీంద్రా షేరు 6.12 శాతం పతనమై సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఎయిర్‌టెల్ 2.57 శాతం నష్టపోగా.. ఐటీసీ, విప్రో, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నెస్లే, కోటక్ బ్యాంక్ షేర్లు ఒక శాతానికి పైగా విలువను చేజార్చుకున్నాయి.ఎన్‌టీపీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు 1%పైగా లాభపడ్డాయి.

4 కంపెనీల ఐపీఓలకు సెబీ ఓకే: ఎంటెరో హెల్త్‌కేర్ సొల్యూషన్స్, జేఎన్‌కే ఇండియా, ఎక్సికామ్ టెలీ-సిస్టమ్స్, అక్మే ఫిన్‌ట్రేడ్ (ఇండియా) ఐపీఓ ప్రతిపాదనలకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది.

నోవా అగ్రిటెక్ ఐపీఓకు 109 రెట్ల బిడ్లు: హైదరాబాద్‌కు చెందిన నోవా అగ్రిటెక్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు ఇన్వెస్టర్లు బ్రహ్మరథం పట్టారు. గురువారంతో ముగిసిన కంపెనీ ఆఫరింగ్‌కు ఇష్యూ సైజుతో పోలిస్తే 109.36 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

మైక్రోసాఫ్ట్ @ 3 లక్షల కోట్ల డాలర్లు

తెలుగు తేజం సత్య నాదెళ్ల సారథ్యంలో మైక్రోసాఫ్ట్ మరో రికార్డును నమోదు చేసుకుంది. అమెరికా స్టాక్ మార్కెట్లో మైక్రోసాఫ్ట్ షేరు బుధవారం 1.3 శాతం ఎగబాకి 404 డాలర్లకు చేరుకుంది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ తొలిసారిగా 3 లక్షల కోట్ల డాలర్ల మైలురాయికి చేరింది. ప్రపంచంలో యాపిల్ తర్వాత ఈ స్థాయి మార్కెట్ విలువను సాధించిన రెండో కంపెనీగా మైక్రోసాఫ్ట్ చరిత్రలో నిలిచింది.

పుత్రులకు ప్రేమతో..!

ఇద్దరు కుమారులకు రూ.480 కోట్ల విలువైన విప్రో షేర్లను బహుమతిగా ఇచ్చిన ప్రేమ్‌జీ

ఐటీ కంపెనీ విప్రో వ్యవస్థాపకులు అజీమ్ ప్రేమ్‌జీ తన ఇద్దరు కుమారులైన రిషద్ ప్రేమ్‌జీ, తారిఖ్ ప్రేమ్‌జీకి సుమారు రూ.480 కోట్ల విలువైన 1.02 కోట్ల కంపెనీ షేర్లను బహుమతిగా ఇచ్చారు. అందులో రిషద్, తారిఖ్‌కు 51,15,090 చొప్పున షేర్లు లభించాయి. అయితే, ఈ లావాదేవీతో కంపెనీలో ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్ షేర్ హోల్డింగ్‌లో ఎలాంటి మార్పు ఉండబోదని విప్రో స్పష్టం చేసింది.

స్లోవేనియా కంపెనీతో లారస్ ల్యాబ్స్ జేవీ

హైదరాబాద్‌లో కొత్త కంపెనీ ఏర్పాటు

హైదరాబాద్‌లో జాయింట్ వెంచర్‌లో ఒక కంపెనీ ఏర్పాటు చేయడం కోసం స్లోవేనియాకు చెందిన ఔషధ కంపెనీ కేఆర్‌కేఏతో లారస్ ల్యాబ్స్ ఒప్పందం కుదుర్చుకుంది. కొత్తగా ఏర్పాటు చేయబోయే ఆ కంపెనీలో కేఆర్‌కేఏ 51 శాతం వాటాలు కలిగి ఉంటే లారస్ 49 శాతం వాటా కలిగి ఉంటుంది. ఈ కొత్త కంపెనీ ప్రారంభ మూలధనం 5 కోట్ల యూరోల (రూ.450 కోట్లు) మేరకు ఉంటుంది. భారత మార్కెట్‌తో పాటుగా కొత్త మార్కెట్లకు ఫినిష్డ్ ఉత్పత్తులను ప్రతిపాదిత కంపెనీ ఉత్పత్తి చేస్తుందని లారస్ ల్యాబ్స్ రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సందేశంలో తెలిపింది. నిర్దేశిత కాలపరిమితిలో ఈ కొత్త కంపెనీ భారత మార్కెట్‌కు నాణ్యమైన ఉత్పత్తులను అందుబాటులోకి తెస్తుందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు. అత్యున్నత నాణ్యత గల ఉత్పత్తులను అందించేందుకు భాగస్వాములిద్దరూ కట్టుబడి ఉంటారని కేఆర్‌కేఏ ప్రెసిడెంట్ జోజ్ కొలారిక్ చెప్పారు. అంచెలవారీగా జాయింట్ కంపెనీని అభివృద్ధి చేసేందుకు భాగస్వాములిద్దరూ అంగీకారానికి వచ్చినట్టు ఆయన తెలిపారు. భారత మార్కెట్‌తో పాటు ఇద్దరు భాగస్వాములు ఇప్పటివరకు ప్రవేశించని, యూరోపియన్ యూనియన్ పరిధిలోకి రాని ఇతర మార్కెట్లలో ప్రవేశానికి ఈ కొత్త కంపెనీ ఒక ప్రణాళిక రూపొందించనుంది. రెండు కంపెనీలు పలు సంవత్సరాలుగా కలిసికట్టుగా కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్నాయి. తమ వ్యాపారాల విషయంలో పరస్పరం సహకరించుకుంటున్నాయి.

మూడింతలు పెరిగిన పీఎన్‌బీ లాభం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో రూ.2,223 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది 15 నెలల గరిష్ఠ స్థాయి. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో లాభం మూడు రెట్లు పెరిగిందని వడ్డీల రూపంలో ఆదాయం పెరగడంతో పాటు ఆస్తుల నాణ్యత మెరుగుపడడం ఇందుకు కారణమని పేర్కొంది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ ఆర్జించిన లాభం రూ629 కోట్లుంది. బ్యాంక్ మొత్తం ఆదాయం ఇదే కాలంలో రూ.25,722 కోట్ల నుంచి రూ.29,962 కోట్లకు పెరిగింది.

హెచ్‌పీసీఎల్ లాభంలో భారీ వృద్ధి

న్యూఢిల్లీ: ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ హెచ్‌పీసీఎల్ డిసెంబరు త్రైమాసికంలో స్టాండ్ అలోన్ ప్రాతిపదికన రూ.529.02 కోట్ల నికరలాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.172.43 కోట్లతో పోల్చితే లాభం మూడింతలు పెరిగింది. శక్తివంతమైన మార్కెటింగ్ మార్జిన్లు ఇన్వెంటరీ నష్టాల ప్రభావాన్ని తగ్గించాయి కంపెనీ తెలిపింది. అంతర్జాతీయ విపణిలో క్రూడాయిల్ ధరలు తగ్గినా 21 నెలలుగా రిటైల్ ధరలను స్తంభింప చేయడం మార్కెట్ మార్జిన్లు పెరగడానికి దోహదపడింది. కంపెనీ ఆదాయం మాత్రం గత ఏడాది తరహాలోనే రూ.1.18 లక్షల కోట్ల వద్ద స్థిరంగా ఉంది.

రామ్‌రాజ్ కాటన్ ప్రచారకర్తగా రిషబ్ శెట్టి



హైదరాబాద్: రామ్‌రాజ్ కాటన్ ప్రచారకర్తగా కాంతారా ఫేమ్ రిషబ్ శెట్టి నియమితులయ్యారు. రామ్‌రాజ్ ధోతీలు, షర్ట్స్, కుర్తాలకు రిషబ్ ప్రచారం చేపట్టనున్నారని రామ్‌రాజ్ కాటన్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ ఈశ్వర్ తెలిపారు. రామ్‌రాజ్ బ్రాండ్‌కు ప్రచారం చేపట్టం ఎంతగానో సంతోషాన్నిస్తోందని ఈ సందర్భంగా రిషబ్ శెట్టి అన్నారు. ఉత్తమ నటుడు, దర్శకుడు అయిన రిషబ్ శెట్టి ప్రచారంతో రామ్‌రాజ్ బ్రాండ్ వినియోగదారులకు మరింత చేరువ అవుతుందని సంస్థ ఎండీ అరుణ్ తెలిపారు.

● వేదాంత కన్సాలిడేటెడ్ నికర లాభం డిసెంబరు త్రైమాసికంలో 18.3 శాతం తగ్గింది. గత ఏడాదితో పోల్చితే లాభం రూ.2464 కోట్ల నుంచి రూ.2013 కోట్లకు దిగివచ్చింది. అయితే కన్సాలిడేటెడ్ ఆదాయం మాత్రం రూ.36,320 కోట్లకు పెరిగింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.34,818 కోట్లుంది.

'హిండెన్‌బర్గ్'తో మరింత బలోపేతమయ్యాం.. ఆస్తులూ పెంచుకున్నాం : గౌతమ్ అదానీ

న్యూఢిల్లీ: అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్‌పై అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ మరోసారి విరుచుకుపడ్డారు. అబద్ధాలు, అరకొర సమాచారంతో ఈ సంస్థ తమ ఆర్థిక సామ్రాజ్యాన్ని కూలదోయాలని చూసిందని ఆరోపించారు. అయినా ఈ కట్టుకథలను తట్టుకుని అదానీ గ్రూప్ మరింత ఎదిగిందన్నారు. హిండెన్‌బర్గ్ నివేదిక వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఒక పత్రికలో రాసిన వ్యాసంలో గౌతమ్ అదానీ ఈ విషయం తెలిపారు. ఈ నివేదిక వచ్చిన తర్వాత కూడా తమ గ్రూప్ కంపెనీల్లో వాటాలు విక్రయించడం ద్వారా రూ.40,000 కోట్లు సమీకరించడమే గాక, రూ.17,500 కోట్ల అప్పులనూ తీర్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తమ గ్రూప్ కంపెనీల నిర్వహణలోని ఆస్తుల విలువ ఇదే సమయంలో రూ.4.5 లక్షల కోట్లకు చేరిందన్నారు. వాటాదారుల సంఖ్యా 43 శాతం పెరిగి 70 లక్షలకు చేరిందన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,950 ▼	57,700 ▼	77,500 ▲
ముంబై	62,312 ▼	57,078 ▼	71,299 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	540
26 జనవరి		విశాఖపట్నం	565
చిత్తూరు	573	వరంగల్	542
గోదావరి	540	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	గోదావరి	111
వరంగల్	107	విజయవాడ	111
కరీంనగర్	107	గుంటూరు	112
మహబూబ్‌నగర్	107	ఒంగోలు	112
కర్నూలు	107	చిత్తూరు	110
విశాఖపట్నం	108		

స్పోర్ట్స్

బోపన్న.. అడుగు దూరంలో!

ఫైనల్లో తొలిసారి రోహన్ జంట



టైటిల్ ఫైట్‌కు సబలెంక, జెంగ్ ● ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్‌ను ముద్దాడేందుకు రోహన్ బోపన్న మ్యాచ్ దూరంలో నిలిచాడు. 43 ఏళ్ల లేటు వయసులో డబుల్స్‌లో నెం:1 ర్యాంక్‌ను దక్కించుకొన్న బోపన్న.. మొదటిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోకి అడుగుపెట్టాడు. గురువారం హోరాహోరీగా జరిగిన పురుషుల డబుల్స్ సెమీస్‌లో రెండో సీడ్ బోపన్న-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 6-3, 3-6, 7-6 (10-7)తో చైనా-చెక్ ద్వయం జిజెన్‌జాంగ్-థామస్ మచాక్‌పై గెలిచింది. రెండు గంటలకు పైగా సాగిన పోరులో ప్రత్యర్థి జోడీ నుంచి బోపన్న-ఎబ్డెన్‌కు తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. కానీ, కీలక సమయంలో పవర్‌ఫుల్ సర్వీస్‌లతోపాటు అనుభవం కూడా రోహన్‌కు కలసి వచ్చింది. శనివారం జరిగే టైటిల్ ఫైట్‌లో ఇటలీ జంట సైమన్ బొలెల్లీ-ఆండ్రియా వవస్సోరితో రోహన్ ద్వయం తలపడనుంది. 2010లో లియాండర్ పేస్‌తో, గతేడాది ఎబ్డెన్‌తో కలసి రోహన్ యూఎస్ ఓపెన్ ఫైనల్‌కు చేరినా తుది మెట్టుపై నిరాశే ఎదురైంది.

సబలెంక మరోసారి..



మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక (బెలారస్) మరోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. యూఎస్ ఓపెన్ ఫైనల్లో కొకో గాఫ్ చేతిలో ఎదురైన పరాజయానికి బదులు తీర్చుకుంది. సెమీస్‌లో రెండో సీడ్ సబలెంక 7-6(2), 6-4తో నాలుగో సీడ్ కొకొ గాఫ్ (అమెరికా)పై వరుస సెట్లలో నెగ్గింది. మరో సెమీస్‌లో 12వ సీడ్ క్వింగ్‌వెన్ జెంగ్ (చైనా) 6-4, 6-4తో దయానా ఎస్ట్రీమ్‌స్కా (ఉక్రెయిన్)పై అలవోకగా నెగ్గింది. తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ చేరిన జెంగ్. శనివారం జరిగే తుది పోరులో సబలెంకతో అమీతుమీ తేల్చుకోనుంది.

రోహన్ బోపన్న, జోష్నకు పద్మశ్రీ



న్యూఢిల్లీ: టెన్నిస్ డబుల్స్ తాజా ర్యాంకింగ్స్‌లో వరల్డ్ నెంబర్ వన్‌గా నిలిచిన రోహన్ బోపన్నను పద్మశ్రీ అవార్డు వరించింది. గురువారం ప్రకటించిన పద్మశ్రీ అవార్డుల్లో క్రీడారంగం నుంచి ఏడుగురు ఎంపికయ్యారు. బోపన్నతోపాటు స్క్వాష్ క్రీడాకారిణి జోష్న చినప్ప, గౌరవ్ ఖన్నా (పారా బ్యాడ్మింటన్ కోచ్), ఉదయ్ విశ్వనాథ్ (మల్లఖంబ్ కోచ్), సతేంద్ర సింగ్ (పారాస్విమ్మర్), పూర్ణిమా మహతో (ఆర్చరీ కోచ్), హర్బిందర్ సింగ్ (హాకీ మాజీ ఆటగాడు) ఉన్నారు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్న బోపన్న 2023లో జరిగిన ఆసియా క్రీడల మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణం అందుకున్నాడు. అలాగే గతేడాది మూడు గ్రాండ్‌స్లామ్ ఈవెంట్లలో ఫైనల్స్‌వరకూ చేరుకున్నాడు.

ఇటు అన్న.. అటు తమ్ముడు



న్యూఢిల్లీ: ఒకే రోజు శతకాలతో అదరగొట్టిన క్రికెట్ సోదరులు సర్ఫరాజ్, ముషీర్‌ల పేర్లు భారత క్రికెట్ వర్గాల్లో మార్మోగిపోతున్నాయి. ఇంగ్లండ్ లయన్స్‌తో మ్యాచ్‌లో భారత్-ఎ తరఫున సర్ఫరాజ్ (161) భారీ సెంచరీతో హైలైట్‌గా నిలిచాడు. మరోవైపు అండర్-19 వరల్డ్‌కప్‌లో అతడి సోదరుడైన ముషీర్ ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో శతకం చేయడంతో యువ భారత్ ఘన విజయం సాధించింది. ఎంతో ప్రతిభగలిగిన ఈ ఇద్దరు ముంబై బ్రదర్స్. ఆయా జట్ల బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలవడం ఇప్పుడు యావత్ దేశ దృష్టిని ఆకర్షించింది.

మెరిసిన ముషీర్

● ఐర్లాండ్‌పై భారత్ విక్టరీ
● అండర్-19 వరల్డ్‌కప్

బ్లూంఫోంటీన్ (సౌతాఫ్రికా): ముషీర్ ఖాన్ (118) శతకంతోపాటు బౌలర్లు నమన్ తివారి (4/53), సౌమీ పాండే (3/21) విజృంభించడంతో.. గురువారం జరిగిన వన్డే అండర్-19 వరల్డ్‌కప్ పోరులో భారత్ 201 రన్స్ తేడాతో ఐర్లాండ్‌ను చిత్తుచేసింది. టాస్ ఓడిన భారత్ 7 వికెట్లకు 301 పరుగులు చేసింది. ఛేదనలో ఐర్లాండ్ 29.4 ఓవర్లలో 100 రన్స్‌కే కుప్పకూలింది.

తిప్పేసి.. దంచేసి

రాణించిన స్పిన్ త్రయం ● ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 246 ఆలౌట్

● అదరగొట్టిన జైస్వాల్
● భారత్ తొలి ఇన్నింగ్స్ 119/1



అశ్విన్ (3/68)
జడేజా (3/88)
జైస్వాల్ (76 బ్యాటింగ్)

హైదరాబాద్: ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్ రివర్స్ అయ్యింది. భారత గడ్డపై స్పిన్‌ను ఎదుర్కొంటూ ఎదురుదాడికి దిగడం అంత సులువు కాదనే విషయం స్టోక్స్ సేనకు తొలిరోజే తెలిసొచ్చింది. అటు ఇదీ భారత బజ్‌బాల్ గేమ్ అంటూ ఉప్పల్ మైదానంలో యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (70 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 76 బ్యాటింగ్) ధనాధన్ ఆటతో చెలరేగాడు. ఫలితంగా మొదటి రోజు టీమిండియా ఆధిపత్యమే కనిపించింది. స్పిన్ త్రయం అశ్విన్ (3/68), జడేజా (3/88), అక్షర్ (2/33) సుడులు తిరిగే బంతులకు పేసర్ బుమ్రా (2/28) తోడు కావడంతో గురువారం ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 64.3 ఓవర్లలో 246 పరుగులకు కుప్పకూలింది. స్టోక్స్ (70), బెయిర్‌స్టో (37), డకెట్ (35) రాణించారు. ఆ తర్వాత చివరి సెషన్‌లో బరిలోకి దిగిన భారత్ ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 23 ఓవర్లలో 119/1 స్కోరుతో నిలిచింది. క్రీజులో జైస్వాల్‌తో పాటు గిల్ (14 బ్యాటింగ్) ఉన్నాడు.

తొలి సెషన్ ఇద్దరిదీ: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఆరంభంలో ఎదురుదాడి వ్యూహాన్నే నమ్ముకుంది. ఓపెనర్లు క్రాలే, డకెట్‌లో పోటాపోటీ బౌండరీలతో చెలరేగడంతో జట్టు 11 ఓవర్లలోనే 53 పరుగులు సాధించింది. బజ్‌బాల్ గేమ్ రుచి చూపిస్తున్నట్టు అనిపించినా.. 12వ ఓవర్‌లో అశ్విన్ తొలి దెబ్బ వేశాడు. జోరు మీదున్న డకెట్‌ను ఎల్బీ చేయడంతో తొలి వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత పోప్ (1)ను జడేజా, క్రాలేను అశ్విన్ అవుట్ చేయడంతో 60/3 స్కోరుతో తడబడింది. అయితే అనుభవజ్ఞులు రూట్, బెయిర్‌స్టో పరిస్థితిని చక్కదిద్దారు. ఆరంభంలో జానీ వేగం కనబరిచినా తర్వాత ఆచితూచి ఆడాడు. దీంతో 108/3 దగ్గర తొలి సెషన్ ముగిసింది.

ఐదు వికెట్లతో ఆధిపత్యం: రెండో సెషన్‌లో భారత బౌలర్ల హవా సాగింది. దీంతో ప్రత్యర్థి ఏకంగా మరో ఐదు వికెట్లను కోల్పోయింది. క్రీజులో చక్కగా కుదురుకున్న బెయిర్‌స్టో, రూట్ ఆరంభంలోనే పెవిలియన్‌కు చేరారు. అక్షర్ రిప్పర్ బంతికి బెయిర్‌స్టో క్లీన్‌బౌల్డ్ అవడంతో నాలుగో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్య ముగిసింది. ఇక స్వీప్ షాట్‌కు వెళ్లిన రూట్ షార్ట్ ఫైన్ లెగ్‌లో బుమ్రాకు క్యాచ్ ఇచ్చాడు. అనంతరం పూర్తి రక్షణాత్మక ధోరణిలోకి వెళ్లిన ఇంగ్లండ్ నుంచి 20 ఓవర్లపాటు కనీసం ఓ ఫోర్ కూడా రాలేదు. కెప్టెన్ స్టోక్స్ పట్టుదలగా నిలువగా అతడికి టెయిలెండర్లు కాస్త సహకరించారు. ఉన్నకాసేపు టామ్ హార్ట్‌లీ (23) వేగంగా ఆడి జడేజా ఓవర్‌లో బౌల్డయ్యాడు. 57వ ఓవర్‌లో స్టోక్స్ మూడు ఫోర్లు బాదడంతో ఈ సెషన్‌లో జట్టు 107 పరుగులు సాధించగలిగింది. ఆఖరి సెషన్‌లో బ్యాట్‌కు పనిచెప్పిన స్టోక్స్. జడ్డూ ఓవర్‌లో రెండు సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అటు మార్క్ ఉడ్ (11)ను అశ్విన్, స్టోక్స్‌ను బుమ్రా అవుట్ చేయడంతో ఈ సెషన్ తొలి 39 బంతుల్లోనే ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ ముగిసింది.

జైస్వాల్ బాదుడు : ప్రత్యర్థి బజ్‌బాల్ గేమ్‌కు సవాల్ విసిరేలా ఓపెనర్ జైస్వాల్ ఇన్నింగ్స్ సాగింది. స్పిన్నర్ జాక్ లీచ్ మాత్రమే పొదుపుగా బౌలింగ్ చేశాడు. తొలి బంతినే ఫోర్‌గా మలిచిన జైస్వాల్ రెండో ఓవర్‌లో రెండు సిక్సర్లతో స్వాగతం పలికాడు. టీ20 తరహాలో సాగిన అతడి ఆటతో 39 బంతుల్లోనే జట్టు 50 పరుగులకు చేరింది. ఇక 47 బంతుల్లో జైస్వాల్ అర్ధసెంచరీ కూడా పూర్తి చేసుకున్నాడు. అయితే జట్టు 80 పరుగుల వద్ద కెప్టెన్ రోహిత్ (24)ను లీచ్ అవుట్ చేశాడు. ఈ దశలో వరుసగా నాలుగు ఓవర్లు గిల్ నెమ్మదిగా ఆడడంతో ఐదు పరుగులే వచ్చాయి. కానీ 19వ ఓవర్‌లో జైస్వాల్ ఫోర్‌తో జట్టు స్కోరు వందకి చేరింది. మరో వికెట్ పడకుండా నాలుగు ఓవర్ల అనంతరం ఈ ఇద్దరూ తొలి రోజు ఆటను ముగించారు.

1

భారత్‌లో జరిగిన టెస్టుల్లో తొలి రోజు కనీసం పది వికెట్లు కోల్పోయి ఎక్కువ పరుగులు (365) నమోదు కావడం ఇదే మొదటిసారి.

భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగిన టెస్టుల్లో ఎక్కువ పరుగులు (2,555) సాధించిన బ్యాటర్‌గా జో రూట్. సచిన్ (2,535)ను దాటేశాడు. అలాగే భారత్‌పై టెస్టు ఫార్మాట్‌లో ఎక్కువ రన్స్ సాధించిన పాంటింగ్‌తో సమంగా నిలిచాడు.

టెస్టుల్లో అధిక వికెట్లు (50 టెస్టుల్లో 504) తీసిన భారత జోడీగా అశ్విన్-జడేజా. గతంలో కుంబ్లే-హర్భజన్ (54 టెస్టుల్లో 501) ఈ ఫీట్ సాధించారు.

విరాట్ అభిమాని.. రోహిత్ కాళ్లమొక్కి



ఉప్పల్ మైదానంలో తొలి రోజు భారత్ ఇన్నింగ్స్ సమయంలో అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. విరాట్ కోహ్లీ వీరాభిమాని ఒకరు అతడి పేరుతో ఉన్న జెర్సీని ధరించి సెక్యూరిటీ సిబ్బంది కళ్లుగప్పి గ్రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. క్రీజులో ఉన్న రోహిత్ కాళ్లు మొక్కి కౌగిలించుకునేందుకు యత్నించగా సిబ్బంది అతడిని బయటికి తీసుకెళ్లారు. దీం తో స్టేడియంలోని భద్రతాలోపాలు బయటపడినట్టయ్యింది.

కోహ్లీ.. కోహ్లీ

తొలి రోజు ఆటను చూసేందుకు వచ్చిన ప్రేక్షకులు కోహ్లీ నామస్మరణతో ఊగిపోయారు. వ్యక్తిగత కారణాలతో కోహ్లీ రెండు టెస్టులకు దూరమైన విషయం తెలిసిందే. దీంతో కోహ్లీ ఫొటోలతో కూడిన 'వి యో మిస్ యూ విరాట్' అనే ప్లకార్డులు అధికంగా కనిపించాయి. అలాగే యువత కోహ్లీ.. కోహ్లీ అంటూ నినాదాలతో ఉప్పల్ స్టేడియాన్ని హోరెత్తించారు. విరాట్‌ను ప్రత్యక్షంగా వీక్షిద్దామని ఎంతగానో ఎదురుచూసిన వారికి అతను లేకపోవడం తీవ్రంగా నిరుత్సాహాన్ని కలిగించింది.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) సిరాజ్ (బి) అశ్విన్ 20; డకెట్ (ఎల్బీ) అశ్విన్ 35; పోప్ (సి) రోహిత్ (బి) జడేజా 1; రూట్ (సి) బుమ్రా (బి) జడేజా 29; బెయిర్‌స్టో (బి) అక్షర్ 37; స్టోక్స్ (బి) బుమ్రా 70; ఫోక్స్ (సి) భరత్ (బి) అక్షర్ 4; రెహాన్ (సి) భరత్ (బి) బుమ్రా 13; హార్ట్‌లీ (బి) జడేజా 23; ఉడ్ (బి) అశ్విన్ 11; లీచ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 64.3 ఓవర్లలో 246 ఆలౌట్; వికెట్ల పతనం: 1-55, 2-58, 3-60, 4-121, 5-125, 6-137, 7-155, 8-193, 9-234, 10-246; బౌలింగ్: బుమ్రా 8.3-1-28-2, సిరాజ్4-0-28-0, జడేజా 18-4-88-3,అశ్విన్21-1-68-3, అక్షర్ 13-1- 33-2.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బ్యాటింగ్) 76; రోహిత్ (సి) స్టోక్స్ (బి) లీచ్ 24; గిల్ (బ్యాటింగ్) 14; ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 23 ఓవర్లలో 119/1. వికెట్ పతనం: 1-80. బౌలింగ్: ఉడ్ 2-0-9-0; హార్ట్‌లీ 9-0-63-0; లీచ్ 9 -2-24-1; రెహాన్ 3-0-22-0.

ఉత్తమ వన్డే క్రికెటర్ కోహ్లీ


కమిన్స్

క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా కమిన్స్ ● ఐసీసీ అవార్డులు

దుబాయ్: విరాట్ కోహ్లీ రికార్డు స్థాయిలో నాలుగోసారి ఐసీసీ వన్డే ఉత్తమ క్రికెటర్‌గా నిలిచాడు. గతేడాది వివిధ ఫార్మాట్లలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన క్రికెటర్లకు ఐసీసీ అవార్డులను ప్రకటించింది. విరాట్ 2012, 2017, 2018లోనూ ఈ పురస్కారం దక్కించుకోగా, ప్రపంచ క్రికెట్‌లో నాలుగుసార్లు బెస్ట్ వన్డే ప్లేయర్‌గా నిలిచిన ఏకైక ఆటగాడయ్యాడు. 2023లో విరాట్ 24 వన్డేల్లో 72.47 సగటుతో ఆరు శతకాలు, ఎనిమిది హాఫ్ సెంచరీలతో 1377 పరుగులు పూర్తి చేశాడు. ఇక గతేడాది వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌తో పాటు వన్డే వరల్డ్‌కప్‌ను కూడా అందించిన ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌ను ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు వరించింది. ఉత్తమ టెస్టు ఆటగాడిగా ఉస్మాన్ ఖవాజా (ఆసీస్) నిలిచాడు. మహిళల్లో ఉత్తమ క్రికెటర్‌గా నాట్ సివర్ బ్రంట్ (ఇంగ్లండ్), వన్డే బెస్ట్ ప్లేయర్‌గా చమరి ఆటపట్టు (శ్రీలంక) అవార్డులను అందుకోనున్నారు.

ఎంసెట్ ఇక ఈఏపీ సెట్

» మే 9 నుంచి 13 వరకు నిర్వహణ

హైదరాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రతిఏటా నిర్వహించే ఎంసెట్ పరీక్ష పేరు మారింది. ఇక నుంచి దీనిని ఈఏపీ (ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ) సెట్‌గా పిలవనున్నారు. దీంతోపాటు మరో ఏడు సెట్ల పరీక్ష తేదీలను ఉన్నత విద్యామండలి విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం, మండలి అధ్యక్షుడు లింబాద్రి గురువారం ప్రకటించారు. ఈఏపీ సెట్ పరీక్షను మే 9, 10, 11, 12, 13 తేదీల్లో నిర్వహించనున్నారు. డిప్లొమా పూర్తి చేసిన వారు నేరుగా బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన ఈసెట్ మే-6న, బీఈడీ కోర్సుకు సంబంధించిన ఎడ్‌సెట్ మే-23న ఉంటుంది. మూడు, ఐదు సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సుకు సంబంధించిన లాసెట్‌తోపాటు రెండేళ్ల వ్యవధి కలిగిన పీజీ లాసెట్ జూన్-3న ఉండగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఐసెట్ జూన్ 4, 5న నిర్వహిస్తారు. ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పీజీ ఈసెట్ జూన్ 6, 7, 8 తేదీల్లో ఉంటుంది. బీపీఈడీ, యూజీడీపీఈడీ కోర్సులకు సంబంధించిన పీఈసెట్ పరీక్ష జూన్ 10, 11, 12, 13 తేదీల్లో నిర్వహిస్తారు.

కాంగ్రెస్ రాజ్యమా.. ఖాకీల రాజ్యమా?

» బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే సహించం

» కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తోంది: ఎమ్మెల్సీ కవిత



జగిత్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ రాజ్యమా లేక ఖాకీల రాజ్యమా అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తే సహించేది లేదని, చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ నేతలపై అక్రమంగా కేసులు పెడుతూ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, ఈ కేసులను ఎదుర్కొంటూ ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని సబ్ జైలులో ఓ కేసులో అరెస్టు అయి ఉన్న బీఆర్ఎస్ నాయకుడు, హబ్సీపూర్ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డిని గురువారం పరామర్శించారు. అనంతరం జగిత్యాలలో మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. రాజేశ్వర్‌రెడ్డిని సంబంధంలేని కేసులో ఇరికించి జైలుకు పంపడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కక్షపూరిత వైఖరిని అవలంబిస్తున్నారని విమర్శించారు.

ఏబీవీపీ నాయకురాలిపై పోలీసుల తీరు దారుణం

» ఘటనపై విచారణ చేపట్టాలి.. డీజీపీని కోరిన సంజయ్

తిమ్మాపూర్/హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): "విద్యారంగ సమస్యలపై నిజాయతీగా పోరాడుతున్న ఏబీవీపీ నేతలపై పోలీసులు దాడి చేయడం శోచనీయం. హైదరాబాద్‌లో ఆందోళనలో పాల్గొన్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని వెంట్రుకలు పట్టి లాగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి" బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కుమార్ డీజీపీని కోరారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వమైనా తన వైఖరిని మార్చుకుంటుదేమోనని భావించామని, ఇప్పుడు కూడా గత ప్రభుత్వ పద్ధతులే కొనసాగడం బాధాకరమన్నారు. కాగా, నూతన హైకోర్టు నిర్మాణం కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన 100 ఎకరాల భూమిని కేటాయించడాన్ని అడ్డుకోవాలంటూ విద్యార్థులు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు విజ్ఞప్తి చేశారు.

నాపై కేసెందుకు పెట్టారో కొండానే చెప్పాలి

» చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇన్నేళ్ల ప్రజా జీవితంలో తనపై ఒక్క ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదని, అలాంటి తనపై కేసు ఎందుకు పెట్టారో బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డినే అడగాలని చేవెళ్ల ఎంపీ జి.రంజిత్‌రెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా.. తనపై కొండా కేసు పెట్టిన విషయంపై కేటీఆర్‌తో ఆయన చర్చించినట్లు తెలుస్తోంది. తనకు సంస్కారం ఉంది కాబట్టే ఇప్పటి వరకు తనపై ఒక్క కేసు కూడా లేదని రంజిత్‌రెడ్డి మీడియాతో చెప్పారు. ఈ విషయంపై కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడిన తర్వాతే తాను స్పందిస్తానని అన్నారు.

'పౌరసత్వం' కేసులో పోస్టల్ ఉద్యోగి అరెస్టు

» ప్రధాన నిందితుల కస్టడీకి సిద్ధమవుతున్న సీఐడీ

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విదేశీయులకు నకిలీ పత్రాలు సృష్టించి, భారత పౌరసత్వంతో పాస్‌పోర్టులు ఇప్పించిన కేసులో పోస్టల్ ఉద్యోగిని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. పోస్టల్ శాఖలో విధులు నిర్వహిస్తున్న టిక్కులపల్లి ప్రణబ్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి విదేశీయులకు పాస్‌పోర్టులు వచ్చేలా చేయడంలో ముఠాకు సహకారం అందించినట్లు ఆధారాలు లభించడంతో అతణ్ని అరెస్టు చేశారు. ప్రణబ్ అరెస్టుతో ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టు అయిన వారి సంఖ్య 14కు చేరింది. కాగా ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న చెన్నైకి చెందిన పాస్‌పోర్టు ఏజెంట్, హైదరాబాద్ కేంద్రంగా నకిలీ గుర్తింపు పత్రాల తయారు చేసిన సత్తార్‌ను కస్టడీకి తీసుకుని విచారించేందుకు సీఐడీ అధికారులు సిద్ధమవుతున్నారు. కాగా, నకిలీ పాస్‌పోర్టులకు ఆస్కారం లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 14 పోస్టల్ పాస్‌పోర్టు సేవా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్(పోస్టల్ సర్వీసెస్) ఎస్ఎస్ఎస్ రామకృష్ణ తెలిపారు.

రామభక్తులపై దాడులు హేయం: వీహెచ్‌పీ

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అకారణంగా రామభక్తులపై దాడులకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వారు గురువారం డీజీపీని కలిసి వినతి పత్రం సమర్పించారు. జనవరి 22న అయోధ్యలో శ్రీరామ జన్మభూమి మందిర ప్రారంభోత్సవం సందర్భంగా సిద్దిపేటలో రాముడి విగ్రహాన్ని అలంకరిస్తున్న రామభక్తులపై అకారణంగా ఏసీపీ సురేందర్‌రెడ్డి వీరంగం సృష్టించారని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్‌లో రాముడి విగ్రహంపై కాలి బూటు విసిరిన దుండగులను వదిలేసి, హిందూవులపై పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. నారాయణపేట జిల్లా పరిధిలోని కోస్గి పట్టణంలో రామభక్తులపై పోలీసులు దాడి చేసి అక్రమ కేసులు నమోదు చేశారని వివరించారు. ఆయా పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ వికలాంగుల విభాగాధ్యక్షుడిగా నాగేశ్వరరావు

హైదరాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బీజేపీ వికలాంగుల విభాగం అధ్యక్షుడిగా నాగేశ్వర్‌రావు నియమితులయ్యారు. బీజేపీకి అనుబంధంగా కొనసాగుతున్న అఖిల భారత వికలాంగుల వేదిక జాతీయ అధ్యక్షుడిగా ఆయన కొనసాగుతున్నారు. వికలాంగుల సంక్షేమం కోసం ప్రధాని మోదీ చేపడుతున్న పథకాలను వారందరికీ చేరవేసేలా వారధిగా నిలవాలని నాగేశ్వరరావుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సూచించారు.

బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడి అరెస్టు

» తప్పుడు పత్రాలతో స్థలం క్రమబద్ధీకరణ కేసులో..

ఖమ్మం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం నడిబొడ్డున కోట్ల విలువ చేసే స్థలాన్ని అక్రమంగా క్రమబద్ధీకరించుకున్న కేసులో మహిళా కార్పొరేటర్ భర్త, బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజును గురువారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని బుర్హాన్‌పురంలో 415 గజాల ప్రభుత్వ భూమిని మహిళా కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య పేరుపై రెవెన్యూ అధికారులు గతంలో క్రమబద్ధీకరణ చేశారు. అయితే సదరు స్థలాన్ని తప్పుడు పత్రాలతో క్రమబద్ధీకరించుకున్న విషయం ఆ తర్వాత వెలుగులోకి వచ్చింది. దీంతో మున్సిపల్, రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి.. అది నిజమేనని తేల్చారు. ఆ స్థలం క్రమబద్ధీకరణ డాక్యుమెంట్‌ను రద్దు చేయడంతో పాటు ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కార్పొరేటర్ శ్రీవిద్యతో పాటు ఆమె భర్త నాగరాజుపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసులో శ్రీవిద్యకు ఈ నెల 17న ముందస్తు బెయిల్ మంజూరైనట్లు తెలిసింది. ఇటు నాగరాజును గురువారం అర్ధరాత్రి సమయంలో కోర్టులో హాజరుపరిచారు.

ఓటర్లను బెదిరిస్తారా?



» ఓటేయకుంటే ఆత్మహత్య చేసుకుంటామంటారా?

» అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలి

» ఓటు మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది

» అందరూ వినియోగించుకోవాలి: తమిళిసై

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తనకు ఓటు వేసి గెలిపించకుంటే ఆత్మహత్య చేసుకుంటానంటూ ఓటర్లను బెదిరించే అభ్యర్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని గవర్నర్ తమిళిసై ఎన్నికల సంఘానికి (ఈసీకి) సూచించారు. ఇటీవలి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. తనకు ఓటు వేసి గెలిపించాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటానంటూ ఒక అభ్యర్థి ఓటర్లను కోరటం సరికాదంటూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పాడి కౌశిక్‌రెడ్డి అప్పట్లో చేసిన వ్యాఖ్యలను గవర్నర్ పరోక్షంగా ప్రస్తావించారు. ప్రజలకు అభ్యర్థులు తాము ఎలా సేవ చేస్తామో చెప్పుకోవాలి కానీ, వారిని భయపెట్టడం ఏమిటని ప్రశ్నించారు. మీడియా కెమెరాల ముందు ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారు సమాజంలో సమస్యలపై ఎలా పోరాడగలరని పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ ప్రసంగించారు. ఓటు హక్కు ప్రజల చేతుల్లో ఉన్న శక్తివంతమైన ఆయుధమని, దానిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు వేయడం ద్వారా భవిష్యత్తును నిర్ణయించడం మన చేతుల్లోనే ఉంటుందన్నారు.

పోలింగ్ డేను హాలీడేగా భావించొద్దు

పోలింగ్ రోజును సెలవు రోజుగా కాకుండా, తమ భవిష్యత్తును నిర్ణయించే రోజుగా భావించాలని ప్రజలను ముఖ్యంగా యువతను గవర్నర్ కోరారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ రోజున హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలు సెలవు ఇచ్చేలా రాష్ట్ర ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుందన్నారు. ఓటు అంటే బుల్లెట్ అని భావించాలని యువతకు పిలుపునిచ్చారు. ఓటు హక్కు వినియోగం ఒక బాధ్యత అని, ఆ దిశగా యువతను, విద్యార్థులను చైతన్యపరచాలని యూనివర్సిటీ ప్రొఫెసర్లను, ఉపాధ్యాయులను కోరారు. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే విధంగా ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యానికి భారతదేశం తల్లి వంటిదని... దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గవర్నర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారధి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన వారిలో 9.99 లక్షలమంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారని, రానున్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. గత ఎన్నికల సమయంలో ఉత్తమ పని తీరు కనబర్చిన అధికారులకు, వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులు, సిబ్బందికి గవర్నర్ ప్రశంసాపత్రాలను అందించారు.

తెలంగాణ పాలన ఢిల్లీ నుంచి!

రైతు భరోసాపై దావో‌స్‌లో సీఎం రేవంత్ అబద్ధాలు.. రైతులకు క్షమాపణ చెప్పాలి

» నేనెళ్తే విమర్శించారు.. మీరేం చేశారు?

» అదానీతో ఒప్పందాలు ఎవరి కోసం?

» సీఎం మారినప్పుడల్లా కొత్త భవనాలు కడితే ఎలా?: కేటీఆర్



హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ 45 రోజుల పాలనలో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలు తప్ప సాధించిందేమీలేదని, గతంలో తాము చెప్పినట్లే తెలంగాణ పరిపాలన ఢిల్లీ నుంచి జరుగుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ఆరోపించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. కేటీఆర్ మాట్లాడుతూ రైతుభరోసా ప్రారంభించామని దావోస్ వెళ్లి ప్రపంచ వేదికపై అబద్ధాలు చెప్పినందుకు తెలంగాణ రైతాంగానికి సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రెండెకరాలకు మించి రైతుబంధు డబ్బులు పడటం లేదని, అంతర్జాతీయ వేదికలపై రైతుభరోసా ఇస్తున్నామని రేవంత్ ప్రజలను మోసం చేస్తుంటే.. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతామని మంత్రులు అంటున్నారని ఆయన ఆరోపించారు. ఒకప్పుడు ప్రభుత్వ సలహాదారులు వద్దంటూ గతంలో కోర్టులో కేసు వేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు చేస్తున్నదేవిటో చెప్పాలన్నారు. రాజకీయ నిరుద్యోగులను సలహాదారులుగా నియమించుకుంటున్నారని, కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వాన్ని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారన్నారు. గతంలో తాను దావోస్ వెళ్తే స్విస్ బ్యాంకులో డబ్బులు దాచుకునేందుకే వెళ్లానని విమర్శించారని, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలాంటోళ్లు దావోస్ బోగస్ అన్నారన్న కేటీఆర్ ఇప్పుడు మీరేం చేశారో చెప్పాలని కాంగ్రెస్ నేతలను నిలదీశారు. కేఆర్ఎంబీ అంశంపై తెలంగాణ నీటి వాటాను చేజార్చేలా రాష్ట్ర సర్కారు వ్యవహరించిందని, కృష్ణా బేసిన్‌లో మనకు దక్కాల్సిన నీటి ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టారన్నారు. దీనిపై శాసనసభలో చర్చ జరిపేందుకు అఖిలపక్షాన్ని వేయాల్సి ఉండేదన్నారు. కాళేశ్వరంతో ఒక్క ఎకరానికి నీళ్లు రాలేదంటూనే మంత్రి కొండా సురేఖ బుధవారం లక్ష ఎకరాలకు నీళ్లు ఇచ్చామని చెబుతున్నారని, అదెలా జరిగిందో ఆమెనే సమాధానం చెప్పాలన్నారు.

ఎవరి లాభం కోసం?

రాష్ట్రానికి వస్తామన్నా తాము అదానీని పదేళ్లపాటు రానివ్వలేదని, అదానీ పెట్టుబడులు మోదీకే లాభమన్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు అదానీతో చేసుకున్న ఒప్పందం ఎవరి లాభం కోసమో చెప్పాలన్నారు. రెండు జాతీయ పార్టీలు కేసీఆర్‌పై కుట్ర పన్నుతున్నాయని, లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తాయన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలు, రేవంత్‌రెడ్డి అదానీతో జతకట్టడం అందులో భాగమేనని విమర్శించారు. అంతర్జాతీయ కంపెనీల వల్ల సామాజిక న్యాయం, ఉద్యోగ, ఉపాధి కల్పన కనిపించవని ఓవైపు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మాట్లాడుతుంటే.. మరోవైపు సీఎం అదే అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారన్నారు. కాంగ్రెస్‌లో ఒకే ముఖ్యమంత్రిని ఐదేళ్లు కొనసాగించిన చరిత్ర లేదని, ఆ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఇకపై తెలుస్తుందన్నారు.

అడ్డగోలు నిర్ణయాలు ఎందుకు?

కొత్తగా వచ్చామంటున్న ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలు ఎందుకు తీసుకుంటోంది? ఫార్మాసిటీ రద్దు, ఎయిర్‌పోర్టు మెట్రో ప్రతిపాదన ఎందుకు రద్దు చేశారో ప్రజలకు చెప్పాలని, దీనిపై క్యాబినెట్‌లో కూడా చర్చించినట్టు లేదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రం దివాలా తీసిందని చెబుతూనే ముఖ్యమంత్రికి కొత్త క్యాంపు కార్యాలయం ఎందుకు కడుతున్నారని, దానికి డబ్బులు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. 'ముఖ్యమంత్రి మారినప్పుడల్లా కొత్త భవనాలు కట్టుకుంటా పోతే ఎలా? భేషజానికి పోయి రేవంత్ ప్రగతి భవన్‌ను వాడటం లేదు. ఉన్న దాన్ని పక్కనపెట్టి కొత్త క్యాంపు కార్యాలయం ఎందుకో ప్రజలకు చెప్పాల'ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తునకలాగా కాంగ్రెస్‌కు అప్పగించామని, ప్రభుత్వానికి కొంత సమయం ఇద్దామని కేసీఆర్ చెప్పారని, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టేలా నిర్ణయాలు తీసుకుంటున్న కారణంగానే మాట్లాడాల్సి వస్తోందన్నారు. 6 గ్యారంటీల్లో ఉన్న 13 హామీల అమలుపై వెంటనే జీవోలు ఇవ్వాలని, రాష్ట్రంలో 1.57 కోట్ల మంది ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కాంగ్రెస్ సర్కారు నిర్వాకంతో లక్షల మంది ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారని, వారి సమస్యలపై ప్రధాన ప్రతిపక్షంగా తమ గళం వినిపిస్తామన్నారు. ఆత్మహత్య చేసుకున్న 9 మంది ఆటోడ్రైవర్ల కుటుంబాలను బీఆర్ఎస్ తరఫున ఆదుకుంటామన్నారు. తక్కువ సమయంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పలు వర్గాలను దూరం చేసుకుంటోందన్నారు. రాష్ట్రంలో బెల్టుషాపులు ఎత్తేస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు ఎలైట్ బార్లు పెడతామంటోందన్నారు. ఏదేమైనా వారిచ్చిన హామీలు అమలుచేసే వరకు తాము వెంటాడతామని కేటీఆర్ చెప్పారు.

రేపటి నుంచి నియోజకవర్గ స్థాయి భేటీలు

బీఆర్ఎస్ అసెంబ్లీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాలను ఈనెల 27 నుంచి నిర్వహించనున్నట్లు కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలను ఫిబ్రవరి 10 లోపు పూర్తి చేయన్నుట్లు తెలిపారు. రోజుకు 10 చొప్పున సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనే ఈ సమావేశాలు ఉంటాయని, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళి, ఫలితాలు, క్షేత్రస్థాయి అంశాలపై విస్తృతంగా సమీక్షిస్తామన్నారు. ఈనెల 27న తొలిరోజు సిద్దిపేట, బోథ్, జూబ్లీహిల్స్, వనపర్తి, నల్లగొండ, 28న వర్ధన్నపేట, మెదక్, సిరిసిల్ల, ముషీరాబాద్, పాలకుర్తి, 29న ఆలేరు, నర్సంపేట, ఖైరతాబాద్, జుక్కల్, ఆందోల్, వికారాబాద్, జగిత్యాల అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయని కేటీఆర్ వెల్లడించారు.

దేశ ప్రజలను ఎలా మెప్పిస్తుంది?

మోసం చేయడమే కాంగ్రెస్ నైజమని, ఆ పార్టీ నయవంచనకు నిలువెత్తు రూపం కాబట్టే.. ఆదిలోనే ఇండియా కూటమికి బీటలు వారాయని కేటీఆర్ పేర్కొన్నారు. గురువారం ఎక్స్ వేదికగా జాతీయ రాజకీయాలపై స్పందించారు. మిత్రపక్షాలను ఒప్పించలేని కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలను ఏం మెప్పిస్తుందని ప్రశ్నించిన ఆయన మోదీని, బీజేపీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదని, ఇండియా కూటమికి అంతకన్నా లేదని, మిత్రపక్షాలు దూరం కావడమే ఇందుకు నిదర్శనమన్నారు. కూటమిని వీడి టీఎంసీ, ఆమ్ ఆద్మీ ఒంటరి పోరుకు సిద్ధపడుతున్నాయని తెలిపారు.

నేడు బీఆర్ఎస్ పీపీ భేటీ

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో.. బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన శుక్రవారం ఆ పార్టీ పార్లమెంటరీ సమావేశం జరగనుంది. గత నెల 7న తన వ్యవసాయ క్షేత్రంలో బాత్రూమ్‌లో జారిపడటంతో ఆయన తుంటి ఎముక విరిగిన సంగతి తెలిసిందే. దానికి సర్జరీ చేయించుకున్న తర్వాత పార్టీ ఎంపీలతో ఆయన నిర్వహిస్తున్న తొలి భేటీ ఇదే. ఒకరిద్దరు ముఖ్యనేతలతో పార్టీకి సంబంధించిన అంశాలపై చర్చ జరపడం తప్ప సమావేశాలకు దూరంగా ఉంటున్న ఆయన.. శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు తన ఫామ్‌హౌజ్‌లో ఈ సమావేశం జరపనున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు జరుగుతున్న చివరి సమావేశాలు కావడంతో ఈ సెషన్‌లో అనుసరించాల్సిన వ్యూహాల పైన, పార్టీ వైఖరిపైన చర్చించనున్నారు. పార్లమెంటులో కీలక బిల్లులు సహా ఇతర అంశాల్లో లేవనెత్తాల్సిన విషయాలపై ఎంపీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

వారం రోజుల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థుల ఖరారు

» 28న రాష్ట్రానికి అమిత్ షా

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి వారం రోజుల్లో తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి వెల్లడించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈనెల 28న రాష్ట్రంలో పర్యటించనున్నారని ఆయన తెలిపారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ సన్నాహక సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు దోపిడీ దొంగల పార్టీలని దుయ్యబట్టారు. ఆ రెండు పార్టీలు మజ్లిస్‌ను బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ అగ్గిలాంటి పార్టీ అని పేర్కొంటూ ఒళ్లు దగ్గరపెట్టుకుని ఆరోపణలు చేయాలని కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అంటే చెప్పుతో కొట్టే రోజు వస్తుందని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్న విశ్వాసం రాష్ట్ర ప్రజలకు లేదని, విచారణ ఎలా చేయాలో కూడా ఈ ప్రభుత్వానికి అవగాహన లేదని కిషన్‌రెడ్డి అన్నారు. "హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అసదుద్దీన్‌ను ఓడించడమే లక్ష్యంగా పనిచేయాలి. ఆయనేం మొనగాడు కాదు. ప్రతిరోజూ అయోధ్యను విమర్శించిన మూర్ఖుడాయన.. ముస్లింలంతా కూడా మజ్లిస్‌ను ఓడించేందుకు సిద్ధంగా ఉన్నరు. యూపీలో ముస్లిం ఆధిపత్యం ఉన్న ప్రాంతాల్లో బీజేపీ గెలిచినప్పుడు హైదరాబాద్ పార్లమెంటును కైవసం చేసుకోవడం ఎందుకు సాధ్యం కాదు?" అని ఆయన పేర్కొన్నారు.

రూ.395 కోట్ల బిల్లులు

అప్‌లోడ్ చేశాం!

ఒక ఏజెన్సీకి అంత మొత్తం చెల్లించలేదు

'ఆంధ్రజ్యోతి' కథనంపై టీఎస్ఎంఎస్ఐడీసీ వివరణ

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): టీఎస్ఎంఎస్ఐడీసీకి మెడిసిన్స్, సర్జికల్స్, ఎక్విప్‌మెంట్స్ సరఫరాచేసిన ఏజెన్సీలకు గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు రూ.378.65 కోట్ల బిల్లులు చెల్లించినట్లు సంస్థ ఎండీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 'డబ్బులిస్తేనే మందులిస్తాం!' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో గురువారం ప్రచురితమైన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. అదే క్రమంలో మరో రూ.395.16 కోట్ల బిల్లులకు సంబంధించిన చెక్కులను అప్‌లోడ్ చేశామని, ఆర్థికశాఖ నుంచి క్లియరెన్స్ రాగానే చెల్లింపులు చేస్తామని తెలిపారు. కేసీఆర్ న్యూట్రీషియన్ కిట్లు సరఫరాచేసిన ఏజెన్సీకి రూ.350 కోట్లు చెల్లించినట్లు వచ్చిన వార్త అవాస్తవమన్నారు. న్యూట్రీషియన్ కిట్లకు సంబంధించి రూ.54.08కోట్లే చెల్లించినట్లు తెలిపారు.

ఆర్ఆర్ఆర్ పురోగతికి కృషి చేయండి

» పెండింగ్ రోడ్లపై చొరవ చూపండి

» మరిన్ని జాతీయ హైవేలు తెప్పించండి

» గత సర్కారు నిర్లక్ష్య ధోరణిపై మళ్లీ చెప్పాల్సి రావడం బాధాకరం

» కిషన్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి లేఖ



హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. గురువారం ఈ మేరకు కిషన్‌రెడ్డికి ఓ లేఖను రాశారు. "ఆర్ఆర్ఆర్, జాతీయ రహదారులపై గత సర్కారు వ్యవహరించిన నిర్లక్ష్య ధోరణి గురించి మళ్లీ చెప్పాల్సి రావడం బాధాకరం. ఈ నెల 20న ఆర్ఆర్ఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖపై చర్చించాం. 350 కిలోమీటర్ల పొడవున రూ.26 వేల కోట్ల అంచనా వ్యయంతో ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా 50% నిధులను చెల్లించాలంటూ గత ఏడాది ఫిబ్రవరి 3న కేంద్రం అప్పటి సీఎంకు లేఖ రాసింది. దాని ప్రకారం రూ.2,585 కోట్లు చెల్లించాలని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్ హెచ్ ఏ ఐ) కోరింది. ఎన్‌హెచ్ఏఐ, రాష్ట్ర ప్రభుత్వ చర్చల్లో భాగంగా అప్పట్లో రూ.100 కోట్ల రివాల్వింగ్ ఫండ్, భూసేకరణ అవార్డుల వారీగా సగం ఖర్చును 15 రోజుల్లో చెల్లించేలా ఒప్పందం కుదిరింది. గత ఏడాది ఏప్రిల్ 17న రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌ను జమ చేసింది. భూసేకరణ అవార్డులు జరగాల్సి ఉంది. గతంలో జరిగిన ఒప్పందం మేరకు రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2,285 కోట్లను ముందుగానే చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రాజెక్టు యుటిలిటీ షిఫ్టింగ్ చార్జీలను చెల్లిస్తే చాలు. అయితే.. ఆ స్తోమత ప్రస్తుతం రాష్ట్రానికి లేదంటూ గత సర్కారు 2023 ఆగస్టు 28న ఎన్‌హెచ్ఏఐ చైర్మన్‌కు లేఖ రాసింది. యుటిలిటీ షిఫ్టింగ్ చార్జీలు చెల్లించకుంటే.. ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లలేమంటూ 2023 సెప్టెంబరు 12న ఎన్‌హెచ్ఏఐ లేఖ రాసింది. దీంతో ఆ ప్రాజెక్టు సందిగ్ధంలో పడింది" అని కోమటిరెడ్డి ఆ లేఖలో కిషన్‌రెడ్డికి వివరించారు. తాము అధికారంలోకి వచ్చాక.. యుటిలిటీ షిఫ్టింగ్ చార్జీలను పూర్తిగా భరిస్తామంటూ ఈ నెల 11న లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యేలా చొరవ చూపించాలని కోరారు. ఇక భారత్‌మాల కింద నిర్మిస్తున్న 11 జాతీయ రహదారులకు 4,332 హెక్టార్ల భూమిని కేటాయించాలని కేంద్రం కోరిందని గుర్తుచేస్తూ.. ఇప్పటి వరకు 284 హెక్టార్ల భూమిని మాత్రమే సేకరించినట్లు తెలిపారు. మిగతా భూసేకరణ పెండింగ్‌లో ఉందని, అందుక్కారణం పర్యావరణ అనుమతుల్లేవంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించడమేనని వివరించారు. మంచిర్యాల-విజయవాడ జాతీయ రహదారికి కూడా గత ఏడాది నవంబరులోనే భూసేకరణ నిలిచిపోయిందని చెప్పారు. "ఇప్పుడు కోర్టు స్టే తొలగిపోవడం వల్ల.. ఆర్ఆర్ఆర్‌కు సంబంధించి 1,935 హెక్టార్లు మినహా.. 65%(1,531 హెక్టార్లు) భూసేకరణ పూర్తయింది. జాతీయ రహదారుల పనులను వేగవంతం చేసేలా సంబంధిత అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేయించండి. రాష్ట్రానికి మరిన్ని జాతీయ రహదారులను తీసుకొచ్చేలా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులతో మాట్లాడి నిధులను తీసుకురండి" అని ఆ లేఖలో కిషన్‌రెడ్డిని కోరారు.

కుటుంబం చీలింది జగనన్న వల్లే

» సీఎం అయినప్పటి నుంచి పూర్తిగా మారిపోయాడు

» ఏపీకి ద్రోహం చేసిన బీజేపీకి బానిసైపోయాడు: షర్మిల



కాకినాడ/ఏలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 'వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబం చీలిపోవడం చేతులారా జగన్ చేసుకున్నదే. ఆయన వల్లే చీలిపోయింది.. దీనికి సాక్ష్యం ఆ దేవుడు. దీనికి సాక్ష్యం నా తల్లి విజయమ్మ. నా యావత్ కుటుంబమే' అని ఏపీసీసీ అధ్యక్షురాలు, సీఎం జగన్ చెల్లెలు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి అయ్యాక ఆయన పూర్తిగా మారిపోయాడని చెప్పారు. గురువారం కాకినాడ, ఏలూరుల్లో ఉభయ గోదావరి జిల్లాల కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలతో ఆమె సమావేశాలు నిర్వహించారు. 'నాకు వ్యక్తిగతంగా అన్యాయం చేసినా రాష్ట్రానికి మేలు చేస్తే చాలనుకున్నాను. మంచి ముఖ్యమంత్రి అనిపించుకుని వైఎస్‌కు పేరు తెస్తే చాలనుకున్నాను. కానీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని జగన్ ముంచేశాడు. బీజేపీకి వైసీపీని, ఎంపీలను, ఎమ్మెల్యేలను, రాష్ట్రాన్ని, ప్రజలను కూడా బానిసలుగా చేసేశాడు. పూర్తిగా నియంతలా మారిపోయాడు. పెద్దపెద్ద కోటలు కట్టుకుని అందులోనే ఉండిపోయాడు. ప్రజలను కలవడమే మానేశాడు. పార్టీ ఎమ్మెల్యేలకు సీఎంను కలిసే స్వేచ్ఛే లేకుండా చేసేశాడు. వైఎస్ ప్రజల మనిషి అయితే జగన్ ప్రజలకు దూరంగా మెలిగే వ్యక్తి' అని నిప్పులు చెరిగారు. ఎందరో కష్టాలు, త్యాగాల ఫలితంగా జగన్ సీఎం అయ్యాడని, తీరా గద్దెనెక్కాక నా అనుకున్నవారందరినీ దూరం పెట్టేశాడని ధ్వజమెత్తారు. వైఎస్ వారసులమని చెప్పుకొంటే సరిపోదని, పాలనలోనూ ఆయన కనిపించాలని.. వీరిద్దరి పాలనలో భూమికి, ఆకాశానికి, నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్‌ను చీల్చడమే కాకుండా తన కుటుంబాన్ని కూడా చీల్చిందని జగన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పెద్దపెద్ద మాటలు మాట్లాడాడని.. నిజానికి రాష్ట్రం అభివృద్ధి లేకుండా దయనీయ స్థితిలో ఉండడానికి ఆయనే కారణమని ధ్వజమెత్తారు.

పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ

» పర్యాటక రంగంలో 3,500 కోట్లతో మౌలిక సదుపాయాలు

» 'స్పెయిన్ అంతర్జాతీయ టూరిజం ట్రేడ్ ఫెయిర్' లో మంత్రి జూపల్లి



స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులను ఆకర్షిస్తూ ఉపాధి అవకాశాల కల్పనకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం పర్యాటక విధానాన్ని రూపొందిస్తోందని పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో ఎఫ్ఐటీయుఆర్-2024 పేరుతో జరుగుతున్న అంతర్జాతీయ టూరిజం ట్రేడ్ ఫెయిర్‌లో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం అంతర్జాతీయ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పర్యాటక అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో పర్యాటక రంగంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం 3,500 కోట్ల రూపాయలతో భారీ ప్రణాళికలు చేపట్టామన్నారు. అలాగే కేంద్ర పర్యాటక శాఖ మంజూరు చేసిన 300 కోట్ల రూపాయలతో వివిధ పర్యాటక మౌలిక సదుపాయ ప్రాజెక్టుల పనులు తుది దశలో ఉన్నాయని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తెలంగాణ గుర్తింపు సాధించిదన్నారు. తెలంగాణ పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌లో ప్రాచుర్యం పొందిన పలురకాల కళాఖండాలు, హస్తకళలను ప్రదర్శించారు. ఎఫ్ఐటీయూఆర్‌లో 131 దేశాలకు చెందిన సుమారు 8,500 మంది ప్రతినిధులతో పాటు మిస్ వరల్డ్ స్పెయిన్(2022) పౌల ప్రెజ్ సంచేజ్ పాల్గొన్నారు. మొదట తెలంగాణ టూరిజం ప్రమోషన్ కోసం ప్రముఖ ట్రావెల్ అండ్ టూరిజం వాటాదారులతో మంత్రి జూపల్లి చర్చించారు. "తెలంగాణ - ద హార్ట్ ఆఫ్ ద డెక్కన్"గా విదేశీ పర్యాటకుల సంఖ్యను పెంచే ప్రధాన లక్ష్యంతో చేపట్టిన ప్రణాళికలను వివరించారు.

కేసీఆర్.. కాస్కో.. ఆట మొదలైంది

ఇప్పటిదాకా నడిచింది ఇంటర్వెలే.. అసలు సినిమా ముందుంది.. వచ్చే ఎన్నికల్లో తరిమికొడతాం: రేవంత్

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): "త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికలు అత్యంత కీలకమైనవి. రాష్ట్రంలో 17 పార్లమెంటు స్థానాలున్నాయి. ఢిల్లీలో కాంగ్రెస్ జెండా ఎగరాలన్నా.. రాహుల్‌గాంధీ ప్రధాని కావాలన్నా.. ఇక్కడ కనీసం 14 స్థానాల్లోనైనా గెలవాలి. అప్పుడే ఢిల్లీలోని ఎర్రకోటపై మువ్వన్నెల జెండాను ఎగురవేయగలుగుతాం. అది సాకారం కావాలంటే అందరం కష్టపడాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని ఎల్.బి స్టేడియంలో నిర్వహించిన 'తెలంగాణ కాంగ్రెస్ బూత్ లీడర్స్ కన్వెన్షన్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పైన, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌పైన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ఓడిపోయాక చార్లెస్‌శోభరాజ్ ఇంట్లో పడుకుంటే, బిల్లా, రంగాలు ఊరూరా తిరుగుతున్నారు" అంటూ వారిని ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీని మొన్నటి ఎన్నికల్లో ఓడించామని, ఈ ఎన్నికల్లో సరిహద్దుల నుంచి తరుముదామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. "కేసీఆర్ ఆట మొదలైంది కాస్కో.. కొన ఊపిరితో ఉన్నావు.. ఆ యుద్ధంలో కూడా నీ పార్టీని బొందపెట్టే బాధ్యతను మా వాళ్లంతా తీసుకున్నారు" అంటూ శ్రేణుల్లో జోష్ నింపారు. "ఈ మధ్య కొంతమంది మాట్లాడుతూ రేవంత్ రెడ్డి మేస్త్రీ అంటున్నారు. అవును నేను మేస్త్రీనే. వాళ్లు ధ్వంసం చేసిన తెలంగాణను పునర్నిర్మించే మేస్త్రీని. వాళ్లని వంద మీటర్ల గోతిలో పాతిపెట్టి.. వారికి గోరి కట్టే మేస్త్రీని. వాళ్లు రాష్ట్రంలోని 30 లక్షల మంది నిరుద్యోగ యువకుల జీవితాలతో చెలగాటమాడారు. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్, సభ్యులను నియమించేందుకు గవర్నర్ అనుమతించిన నేపథ్యంలో.. ఈ రోజు నుంచి ఆ యువకుల జీవితాలను పునర్నిర్మించే మేస్త్రీని" అని అన్నారు. తనను మేస్త్రీ అంటూ విమర్శిస్తున్న వారికి గోరీ కట్టేందుకు ఈ నెల చివర్లో ఆదిలాబాద్ జిల్లా, ఇంద్రవెల్లి నుంచి బయలుదేరుతున్నానని, కాస్కోవాలని సవాల్ విసిరారు. తాము చేసిన పోరాటంలో ఇప్పటివరకు అయింది ఇంటర్వెలేనని అసలు సినిమా ముందుందని హెచ్చరించారు. మోదీ, కేసీఆర్ నాణేనికి బొమ్మ, బొరుసులాంటి వారని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒకటో, రెండో సీట్లు గెలిచినా.. కేసీఆర్ వాటిని మోదీకి అప్పగిస్తాడని వ్యాఖ్యానించారు. కేసీఆర్ మారుబేరగాడని, ఇక్కడ ఒక రూపంలో జమ చేసి, ఢిల్లీ వెళ్లి మరొక రూపంలో అమ్ముకుంటాడని విమర్శించారు. కేసీఆర్‌కు పడే ప్రతి ఓటూ పరోక్షంగా మోదీకి వేసినట్టేనని, బీఆర్ఎస్‌కు వేసే ఓటు మూసీలో వేసినట్టేనని హెచ్చరించారు.





ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

మీ రేవంతన్నగా..

కార్యకర్తల్లో ఉత్సాహం పెంచేందుకు ఒకరోజు సీఎంగా, మరో రోజు పీసీసీ అధ్యక్షుడిగా గ్రామాల్లో పర్యటించాలని అధిష్ఠానం తనను ఆదేశించినట్టు రేవంత్ తెలిపారు. ఆ ఆదేశాల మేరకు ప్రతి వారం రోజు విడిచి రోజు జిల్లాల పర్యటనలు చేస్తానని, 17 పార్లమెంటు స్థానాల్లో సమావేశాలు నిర్వహిస్తానని చెప్పారు. "వారంలో మూడు రోజులు మీ రేవంతన్నగా మీ మధ్యకు వచ్చి, మీతో కలిసి నిలబడి, కొట్లాడుతా. బిల్లా, రంగాలను తెలంగాణ సరిహద్దుల నుంచి తరిమి కొట్టడానికి వస్తా" అని శ్రేణులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎన్నికల హామీగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలనూ అమలు చేయడానికి.. గ్రామగ్రామానా ఐదుగురితో ఇందిరమ్మ కమిటీలు వేస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. పార్టీకి అండగా నిలబడుతున్నవారందరికీ.. సంక్షేమ పథకాలు చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలు, శ్రేణులదేనని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులను మార్చితే వాళ్ల ప్రభుత్వం వచ్చేదని బిల్లా, రంగా అంటున్నారని.. తాము కూడా అదే విషయాన్ని చెప్పామని, వాళ్ల కుటుంబాన్ని మార్చితే తప్ప తెలంగాణకు మేలు జరగదని చెప్పామని వ్యంగ్యంగా అన్నారు. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌లో వాళ్లని మార్చాలన్నారు. అలాగే.. పార్టీ శ్రేణులు, నేతల కష్టం, శ్రమ, వీరోచిత పోరాటం వల్లనే తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగిరిందని.. తాను సీఎం అయ్యానని రేవంత్ పేర్కొన్నారు. తాను నల్లమల అడవుల్లో మారుమూల గ్రామంలో పుట్టిన రైతు బిడ్డనని.. తన ఇంట్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు లేకున్నా సోనియా, ఖర్గే దయవల్ల సీఎం అయ్యానని అన్నారు. కాంగ్రెస్‌లో ఎవరైనా.. ఏదైనా అయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే దళిత బిడ్డ అయిన మల్లికార్జున ఖర్గే.. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ప్రస్థానం మొదలుపెట్టి అంచెలంచెలుగా ఎదిగి కాంగ్రెస్ పార్టీకి జాతీయ అధ్యక్షుడయ్యారని గుర్తుచేశారు. అదే కేసీఆర్ మాత్రం.. కరోనాలో వేల కోట్లు దోచుకున్న పార్థసారథిని, రవిచంద్ర అనే గ్రానైట్ వ్యాపారిని, రాష్ట్రాన్ని దోచుకున్న దామోదర్‌ను రాజ్యసభ సభ్యులుగా చేశారని మండిపడ్డారు. పేద, దళిత, గిరిజన, ఆదివాసీ బిడ్డలను ఒక్కరినైనా కేసీఆర్ ఎమ్మెల్యేగా చేశారా అని నిలదీశారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో నియంత పోకడలను పాతిపెట్టి.. రాజ్యాంగబద్ధమైన విలువలు, విధానాలు, పద్ధతులను పునరుద్ధరించేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

సిగ్గు లేకుండా..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 50 రోజులైనా కాకుండానే.. తాము ఇచ్చిన హామీలను అమలు చేయట్లేదంటూ బిల్లారంగాలు వ్యాఖ్యానిస్తున్నారని.. మొన్న జరిగిన ఎన్నికల్లో బొక్కలు విరగ్గొట్టినా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని రేవంత్ అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లో హామీలను అమలు చేస్తామని తాను చెప్పిన విషయాన్ని.. ప్రభుత్వం ఏర్పాటైన కొద్దిరోజులకే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అమలును, రాజీవ్ ఆరోగ్య శ్రీనిధిని పది లక్షలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటిదాకా పదిన్నర కోట్ల మంది ఆడబిడ్డలు ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. 3,650 రోజులు రాష్ట్రాన్ని ఏలిన బీఆర్ఎస్ మాత్రం.. దళితులకు మూడెకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్ రూం ఇల్లు, ఇంటికో ఉద్యోగం, మైనారిటీలు, గిరిజనులకు 12శాతం రిజర్వేషన్లు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ఏమీ ఇవ్వని సన్నాసులు ఇపుడు తమను అడుగుతారా అని ప్రశ్నించారు. రూ.ఏడు లక్షల కోట్ల అప్పు చేసి, రాష్ట్రాన్ని దివాలా తీయించారని, దాని వల్ల ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వలేని పరిస్థితి ఉందని సీఎం మండిపడ్డారు. "గల్లా పెట్టె చూస్తే గుల్లయి ఉంది. రోజూ రూపాయి రూపాయి జమచేసి జీతాలిచ్చే పరిస్థితి. అయినా పింఛన్, జీతాలు, రైతుబంధు, సంక్షేమ పథకాలను నిలిపివేయలేదు. అయినా కొంతమంది ఇంకా రైతుబంధు ఇవ్వట్లేదంటున్నారు. కానీ నిరుడు మార్చి 31వరకూ కూడా వాళ్లు రైతుబంధు డబ్బులు వేయలేదు" అంటూ గతపాలకులపై నిప్పులు చెరిగారు. ఫిబ్రవరిలో ఇంకో రెండు పథకాలను అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఫిబ్రవరి నెలాఖరుకు రాష్ట్రంలోని 63 లక్షల రైతు కుటుంబాలకూ రైతు బంధు అందుతుందన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లోనూ నెగ్గాలి

» పార్టీ నేతలతో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే



హైదరాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు, పార్టీ కార్యకర్తల సహకారంతో 2023 ఎన్నికల్లో గెలిచామని.. ఇప్పుడు 2024లో జరగబోయే యుద్ధంలోనూ మెజారిటీ స్థానాల్లో నెగ్గాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి ఎన్ని కుట్రలు చేసినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు వారికి బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. గురువారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన పార్టీ బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశంలో ఖర్గే మాట్లాడారు. "రాష్ట్రాల్లో బలహీన ప్రభుత్వాలు ఉన్న చోట కూల్చాలని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా ప్రయత్నిస్తుంటారు. మహారాష్ట్రలో అదే జరిగింది. కానీ తెలంగాణలో అలాంటి అవకాశం ఉండదు. ఇది సోనియాగాంధీ ఇచ్చిన తెలంగాణ. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతల తెలంగాణ. ఇక్కడ బీజేపీ కుట్రలు, కుతంత్రాలను ప్రజలు సాగనివ్వరు" అని ఖర్గే అన్నారు. "ప్రజల సహకారంతో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. 6 గ్యారంటీల్లో రెండు ఇప్పటికే అమల్లో ఉన్నాయి. మరో రెండు గ్యారెంటీలను త్వరలో అమలుచేయబోతున్నాం. మరో రెండు గ్యారంటీలు రెండు మూడు నెలల్లో అమలు చేస్తాం. మేము చేసిన ప్రతీ వాగ్దానాన్నీ నెరవేరుస్తాం. తెలంగాణ ప్రభుత్వం పాలనలో దేశానికే ఆదర్శంగా ఉండాలి. మోదీలా అబద్ధపు హామీలు ఇచ్చి మరచిపోం. కష్టాలు వచ్చినప్పుడు ఆయన ఏదో ఒక కారణం చూపుతారు. గతంలో పాకిస్తాన్, చైనా పేర్లు చెప్పేవారు. ఇప్పుడు దేవుడి పేరు వాడుకుంటున్నారు. వీరి విష వలయంలో చిక్కితే దేశంలో ప్రజాస్వామ్యం నాశనం అవుతుంది. ప్రతి ఒక్కరి ఇంట్లో దేవుడు ఉంటాడు. దానికి ప్రచారం ఎందుకు..? దేవుడి పేరుతో ప్రచారానికి ఖర్చు చేస్తున్న డబ్బంతా ప్రజలది. ప్రజాధనాన్ని ప్రధాని దుర్వినియోగం చేస్తున్నారు. నెహ్రూ, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మనమంతా పోరాడాలి' అని సూచించారు.

తెలంగాణ కళలకు అరుదైన గౌరవం

» పద్మశ్రీ కి ఎంపికైన రాష్ట్ర కళాకారులకు సీఎం అభినందన

హైదరాబాద్, జనవరి 25 : తెలంగాణ నుంచి పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. రాష్ట్రం నుంచి ఐదుగురు పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరిలో బుర్ర వీణ వాయిద్యకారుడైన కొండప్ప, యక్షగాన కళాకారుడైన సమ్మయ్య తమ కళా నైపుణ్యంతో తెలంగాణ సంస్కృతి, కళలను దేశానికి చాటి చెప్పారని ప్రశంసించారు. వీరి ఇరువురు పురస్కారాలకు ఎంపిక కావడంతో తెలంగాణ పురాతన కళలకు అరుదైన గౌరవం లభించిందని పేర్కొన్నారు. అలాగే, పద్మశ్రీకి ఎంపికైన వేలు ఆనందచారి(కళలు), విద్య, సాహిత్య రంగాల్లో కేతావత్ సోంలాల్, కూరేళ్ల విఠలాచార్యలకు అభినందనలు తెలియజేశారు. కాగా, దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారం పద్మ విభూషణ్‌కు ఎంపికైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సినీనటుడు చిరంజీవికి కేసీఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

భాగవతారిణి ఉమామహేశ్వరికి పద్మశ్రీ

కపిలేశ్వరపురం, జనవరి 25: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం శ్రీసర్వారాయ హరికథా పాఠశాలకు చెందిన డీ ఉమా మహేశ్వరిని 'పద్మశ్రీ' అవార్డుకు ఎంపిక చేశారు. కేంద్ర ప్రభుత్వం గురువారం రాత్రి ప్రకటించిన పద్మ అవార్డుల్లో ఆమెను ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రకటించారు. ఉమామహేశ్వరి 14వ ఏట నుంచే హరికథ కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. సంస్కృతంలో హరికథ చెప్పగలిగే ఏకైక మహిళా భాగవతారిణి ఆమె. తెలుగులో ఆమె చెప్పే హరికథలకు విశేషాభిమానులు ఉన్నారు. గత ఏడాది ఆమె ప్రతిష్ఠాత్మక సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అందుకున్నారు.

కాంగ్రెస్ శ్రేణులు కన్నెర్ర చేస్తే బీఆర్ఎస్సే ఉండదు!

» మా సహనాన్ని చేతగానితనం అనుకోవద్దు

» డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క హెచ్చరిక

» రాష్ట్రంలో 17 సీట్లూ గెలుచుకోవాలి: మున్షీ



హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ శ్రేణులు కన్నెర్ర చేస్తే రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మిగలదని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క హెచ్చరించారు. వారు బట్టలూడదీసి కొడతామంటే కాంగ్రెస్ నాయకులేమీ చేతులు ముడుచుకొని లేరని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీని గౌరవించాలన్న తమ సంస్కృతిని చేతగానితనంలా భావించవద్దని హితవు పలికారు. బట్టలిప్పి కొడతామంటే తమ తడాఖా ఏంటో చూపిస్తామన్నారు. ఎల్బీ స్టేడియంలో గురువారం జరిగిన కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్ (బీఎల్ఏ)ల సమావేశంలో భట్టివిక్రమార్క మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్తలు తలెత్తుకు తిరిగేలా ప్రజాపాలనను అందిస్తామన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి 15 సీట్లు గెలిపించి రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లాలో ఇద్దరు బీసీలు, ఇద్దరు ఎస్సీలు కాంగ్రెస్ తరఫున గెలిస్తే కేటీఆర్ ఓర్వలేకపోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. బీఆర్ఎస్ పాలనకు సంబంధించి స్వేద పత్రాలు విడుదల చేస్తున్నారని.. వాస్తవానికి వారు పెంచుకున్న అక్రమాస్తులు, కట్టుకున్న భవనాల పత్రాలను విడుదల చేయాలని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని సేద తీరొద్దని, లోక్‌సభ ఎన్నికల రూపంలో మన ముందు మరో పోరాటం ఉందని చెప్పారు. బూత్‌స్థాయి, క్షేత్రస్థాయి నాయకులు కష్టపడడం వల్లనే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని తెలిపారు. అలాగే లోక్‌సభ ఎన్నికల్లోనూ కష్టపడి కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో 17 స్థానాలూ గెలిపించుకుందామని శపథం తీసుకోవాలని సూచించారు. టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ.. ఒక్క అధికారిని ఏసీబీ పట్టుకుంటేనే రూ.వందల కోట్లు బయటికి వచ్చాయని, ఆయన బాస్ ఇళ్లలో సోదాలు చేస్తే ఎన్ని వేల కోట్లు బయటపడతాయోనని అన్నారు. ఇప్పుడు బీసీ రాగం ఎత్తుకున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. పదేళ్లలో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఏపీ సీఎం జగన్ మరోమారు కాంగ్రెస్ పార్టీని తిడితే ఆయన అంతు చూస్తామని పార్టీ సీనియర్ నేత వీహెచ్ హెచ్చరించారు. ఒరిజినల్ కాంగ్రెస్ నేతలకే కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇవ్వాలని సూచించారు. అత్యధికంగా పార్టీ సభ్యత్వాలు నమోదు చేసిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ) అచ్యుతరావు (ఖానాపూర్), వంగూరు రమేశ్ (మధిర), మురళీధర్ (నాంపల్లి), అనిఫ్ (రామగుండం)లను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి సన్మానించి అవార్డులను అందించారు. సమావేశం ప్రారంభానికి ముందు కాంగ్రెస్ సేవాదళ్ సభ్యుల గౌరవ వందనాన్ని ఖర్గే, రేవంత్‌లు స్వీకరించారు. వేదికపై సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి పరస్పరం చర్చించుకుంటూ ఉల్లాసంగా కనిపించారు. దేశవ్యాప్తంగా బీఎల్ఏ సమావేశాలను ఖర్గే తలపెట్టగా.. తొలి సమావేశం హైదరాబాద్‌లోనే జరిగింది.

చిన్న గ్రామం నుంచి అత్యున్నత స్థాయికి

» చేపట్టిన ప్రతి పదవికీ వన్నె తెచ్చిన వెంకయ్య



నెల్లూరు, జనవరి 25: పార్టీలో గానీ, ప్రభుత్వంలో గానీ.. ఉపరాష్ట్రపతిగా గానీ చేపట్టిన ప్రతి పదవినీ సమర్థంగా నిర్వహించిన ముప్పవరపు వెంకయ్యనాయుడు.. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం వద్ద చవటపాళెం అనే చిన్నగ్రామంలో 1949 జూలై 1న జన్మించారు. స్వాతంత్ర్యానంతరం జన్మించి.. ఉపరాష్ట్రపతి పదవి చేపట్టిన మొదటి నేతగా చరిత్రకెక్కారు. వాగ్ధాటి, రాజకీయ క్రియాశీలత ఆయనకు ఎన్నో పదవులను తెచ్చిపెట్టాయి. ప్రతి పదవికీ ఆయన తనదైన శైలిలో వన్నె తెచ్చారు. తన పట్టుదల, కృషి, దృఢసంకల్పంతో అంచెలంచెలుగా ఎదిగారు. బుచ్చిరెడ్డిపాళెంలో స్కూలు విద్యాభ్యాసం, నెల్లూరు వీఆర్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల నుంచి లా పట్టభద్రుడయ్యారు. ఆర్ఎస్ఎస్‌లో చేరిన ఆయన.. కాలేజీ రోజుల్లో ఏబీవీపీలో పనిచేశారు. కాలేజీ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1972లో జై ఆంధ్ర ఉద్యమంతో పేరుసంపాదించారు. 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' అని నినదించారు. 1974లో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయన్ ప్రారంభించిన ఛాత్ర సంఘర్ష సమితికి రాష్ట్ర కన్వీనర్ అయ్యారు. ఎమర్జెన్సీని వ్యతిరేకించి జైలు పాలయ్యారు. తర్వాత ఏపీ బీజేపీలో ప్రధాన నేతల్లో ఒకరిగా ఎదిగారు. ఉదయగిరి నుంచి 1978, 83ల్లో అసెంబ్లీకి ఎన్నికయ్యారు. రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో పలు పార్టీ పదవులు చేపట్టారు. ఏకవాక్య పంచ్‌లతో పార్టీ అగ్ర నాయకత్వానికి, వివిధ పార్టీల నేతల్లో మంచి పేరు సంపాదించారు. హిందీలో అనర్గళంగా ప్రసంగిస్తారు. మరే దక్షిణాది బీజేపీ నేతా ఆ భాషపై అంత పట్టు ప్రదర్శించలేదు. 1998, 2004, 2010ల్లో కర్ణాటక నుంచి, 2016లో రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1999లో కేంద్రంలో వాజపేయి ప్రభుత్వం ఏర్పడినప్పుడు గ్రామీణాభివృద్ధి మంత్రిగా పనిచేశారు. 'ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన' వంటి విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుట్టారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా చాలా కాలం పనిచేసిన వెంకయ్య.. 2003లో జానా కృష్ణమూర్తి స్థానంలో జాతీయ అధ్యక్షుడయ్యారు. 2004 జనవరి 28న మూడేళ్లపాటు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే ఆ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత కూడా సీనియర్ ఉపాధ్యక్షుడిగా క్రియాశీలంగా పనిచేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి ప్రత్యేక హోదా కోసం యూపీఏ సర్కారుపై ఒత్తిడి తెచ్చి సాధించారు. 2014లో నరేంద్ర మోదీని జాతీయ యవనికపైకి తెచ్చి.. పార్టీ ప్రచార సారథిగా నియమించడంలో కీలక పాత్ర పోషించారు. మోదీ ప్రభుత్వంలో పట్టణాభివృద్ధి శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా పనిచేశారు. 2017లో ఆయన్ను ఉపరాష్ట్రపతి (రాజ్యసభ ఛైర్మన్)గా పంపాలని ప్రధాని మోదీ నిర్ణయించారు. ఇందుకోసం వెంకయ్య పార్టీకి బాధాతప్త హృదయంతో రాజీనామా చేయాల్సి వచ్చింది. ఉపరాష్ట్రపతిగా రాజ్యసభను ఐదేళ్లు సజావుగా నిర్వహించారు. 2022లో పదవీవిరమణ చేసి.. రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

వినమ్రంగా స్వీకరిస్తున్నా

పద్మవిభూషణ్ పురస్కారం తనను వరించడంపై వెంకయ్యనాయుడు హర్షం వ్యక్తంచేశారు. 'అమృత కాలం దిశగా భారతదేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న ప్రస్తుత తరుణంలో భారత్ ప్రభుత్వం ప్రకటించిన ఈ పురస్కారాన్ని వినమ్రంగా స్వీకరిస్తున్నాను. దేశంలోని రైతులు, యువత, మహిళలు సహా నవ భారత నిర్మాణంలో భాగస్వాములు అవుతున్న ప్రతి ఒక్కరికీ నా పురస్కారాన్ని సగర్వంగా అంకితం చేస్తున్నా. ఈ పురస్కారం నా బాధ్యతను మరింతగా పెంచిందని భావిస్తూ నవభారత నిర్మాణం దిశగా ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని ఆకాంక్షిస్తున్నాను. శక్తిమంతమైన, ఆత్మనిర్భర భారత నిర్మాణానికి ప్రజలతో కలిసి నడుస్తానని సవినయంగా తెలియజేస్తున్నా' అని 'ఎక్స్' వేదికగా స్పందించారు.

రాజకీయ ముఖచిత్రం..

1973-74: ఆంధ్ర వర్సిటీలో విద్యార్థి సంఘ నాయకుడిగా అరంగేట్రం
1974: జయప్రకాష్ నారాయణ ఛాత్ర సంఘర్ష సమితి ఉమ్మడి ఆంధ్ర కన్వీనర్.
1977-80: జనతా పార్టీ యువజన విభాగం ఏపీ అధ్యక్షుడు.
1978, 1983ల్లో ఉదయగిరి నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక
1980, 1983ల్లో బీజేపీ శాసన సభా పక్ష నేత.
1985, 1988: ఏపీ బీజేపీ ప్రధాన కార్యదర్శి.
1988, 1993: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు.
1993-2000: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి.. బీజేపీ పార్లమెంటరీ బోర్డు కార్యదర్శి.. బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ కార్యదర్శి, పార్టీ అధికార ప్రతినిధి..
1998-2016: 3 సార్లు కర్ణాటక నుంచి, ఒకసారి కర్ణాటక నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక.
2000-02: వాజపేయి ప్రభుత్వంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి.
2002 జూలై 1-2004 అక్టోబరు: బీజేపీ జాతీయ అధ్యక్షుడు.
2005-2017: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు.
2014-2017: కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి.
2017-22: భారత ఉపరాష్ట్రపతి

రాష్ట్రంలో 22 మందికి పోలీసు పతకాలు

న్యూఢిల్లీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ ప్రకటించిన సేవాపతకాలకు తెలంగాణ నుంచి 22 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 12 మంది ఎంపికయ్యారు. తెలంగాణలో ఆరుగురికి శౌర్య పతకాలు, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవాపతకం, మరో 14 మందికి విశిష్ట సేవాపతకాలు దక్కనున్నాయి. అదనపు డీజీపీ, ప్రస్తుతం తెలంగాణ పౌరసరఫరాల కమిషనర్‌గా సేవలందిస్తున్న దేవేంద్రసింగ్ చౌహాన్, మరో అదనపు డీజీపీ, జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రాకు రాష్ట్రపతి విశిష్ట సేవాపతకాలు లభించాయి. రిజర్వ్ సబ్-ఇన్‌స్పెక్టర్ గడ్డిపోగుల అంజయ్య, కానిస్టేబుళ్లు వడిచర్ల శ్రీనివాస్, నలివేణి హరీశ్, బి.సునిల్ కుమార్, ఎండీ ఆయూబ్, పి.సతీశ్‌కు శౌర్యపతకాలు దక్కాయి. సేవా పతకాలకు ఎంపికైన వారిలో.. డీఐజీ పరిమళ జాకబ్, ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ డి.చంద్రయ్య, ఏసీపీ/డీఎస్పీలు పి.నరేశ్‌రెడ్డి, ఎస్.మోహన్ కుమార్, ఎన్.త్రినాథ్(కమాండెంట్), కె.వీరయ్య(8వ బెటాలియన్ ఏసీ), ఎస్సైలు బి.జయచంద్ర, ఎం.సురేందర్ రెడ్డి, ఏఆర్ఎస్సైలు ఇ.వెంకట్ రెడ్డి, జి.యేసుపాదం, హెడ్‌కానిస్టేబుల్ జంగయ్య, జైళ్ల శాఖ డీఎస్పీ శ్రీధర్, జైలర్ రామయ్య ఉన్నారు.

కనుమరుగవుతున్న కళకు ఊపిరి!

» బుర్రవీణ కళాకారుడు దాసరి కొండప్ప



నారాయణపేట, జనవరి 25: బుర్రవీణ వాయించడం ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్న దాసరి కొండప్ప, ఒకరకంగా కనుమరుగవుతున్న ఆ కళకు ఊపిరిలూదారు. తాతల కాలం నుంచి ఆయన బుర్రవీణ వాయించే వృత్తిలో ఉన్నారు. బుర్రవీణ వాయిస్తున్న చివరి వ్యక్తి కూడా కొండప్పేనని చెబుతారు. ఆయనది నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రం. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం 2022లో రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళసై చేతులమీదుగా కొండప్ప ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

చిందు యక్షగానానికి గుర్తింపు

» ఐదు దశాబ్దాలుగా కళకు గడ్డం సమ్మయ్య దివిటీ



జనగామ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గడ్డం సమ్మయ్య ఐదు దశాబ్దాలుగా చిందు యక్షగాన కళకు దివిటీ పట్టారు. ఆయనది జనగామ జిల్లా. దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి. రామస్వామి, చండిగాంబ దంపతులకు 1958లో జన్మించారు. ఆ తర్వాత రామస్వామి దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లిలో స్థిరపడ్డారు. సమ్మయ్య ఆరో తరగతి దాకా చదివారు. సమ్మయ్య తమ కులవృత్తి అయిన చిందు యక్షగాన ప్రదర్శనల్లో పాల్గొనేవారు. 16ఏళ్ల వయసులో తొలిసారిగా తండ్రితో కలిసి చిన్ని కృష్ణుడి వేషధారణలో కళారంగ ప్రవేశం చేశారు. జాంబవపురాణం, భాగవతం, రామాయణం వంటి కథలను ప్రదర్శనల రూపంలో చెప్పడమే చిందు యక్షగానం. చిన్ననాటి నుంచి ఈ కళపై మక్కువతో 5 దశాబ్దాలుగా 19వేల ప్రదర్శనలు ఇచ్చారు. సమ్మయ్య లోహితాంకుడు, ప్రహ్లాదుడు, సిరియాలుడు, బాలవద్దిరాజు పాత్రల్లో ఎక్కువగా ప్రదర్శనలు ఇచ్చేవారు. సత్యహరిశ్చంద్ర, కీచక, కంసుడు, శ్రీకృష్ణుడు, అర్జునుడు, దుర్యోధనుడు, రావణబ్రహ్మ పాత్రల్లో అద్భుతంగా ఒదిగిపోతారు. గడ్డం సమ్మయ్యకు వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన ముత్తిలింగం కుమార్తె శ్రీరంజనితో 1983లో వివాహం జరిగింది. సమ్మయ్యకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. పెద్దకుమారుడు సోమరాజు చిందు కళలోనే ఉన్నారు. సమ్మయ్య 1991లో ఆలిండియా రేడియోలో 80 ప్రదర్శనలు, దూరదర్శన్‌లో 90 ప్రదర్శనలిచ్చారు. సాంస్కృతిక, పర్యాటక శాఖలో సుమారు 4000 ప్రదర్శనలు ఇవ్వడమే కాకుండా ఢిల్లీ, ఒడిసా, మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లోనూ అనేక ప్రదర్శనలు ఇచ్చారు.

శిల్పకళలో నిష్ణాతుడు.. ఆనందచారి వేలు



యాదాద్రి, యాదగిరిగుట్ట/భువనగిరిరూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన స్థపతి, సలహాదారుడిగా విధులు నిర్వహించిన వేలు ఆనందాచారి ఏపీలోని చిత్తూరు జిల్లా వెన్నంపల్లి గ్రామంలో 1952, జూన్ 1న జన్మించారు. 1972లో టీటీడీ శిల్ప కళాశాలలో నాలుగేళ్ల శిల్పకళా కోర్సులో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. థియలాజికల్ యూనివర్సిటీ యూకే సికింద్రాబాద్ బ్రాంచి ద్వారా పీహెచ్‌డీ అందుకున్నారు. 1975లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ శిల్పకళాశాలలో అధ్యాపకుడిగా చేరి 1978 వరకు విధులు నిర్వర్తించారు. 1980లో శ్రీశైలం దేవస్థానం ప్రాజెక్టులో పనిచేశారు. 1987లో ఆయనకు అఖిల భారత చిత్రకళా పోటీల్లో బంగారు పతకం లభించింది. 1990లో ఉపస్థపతిగా పదోన్నతి పొంది, ద్వారకా తిరుమల దేవస్థానంలో విధులు నిర్వహించారు. 2009లో ప్రధాన స్థపతిగా విధుల్లోకి చేరి, 2010లో పదవి విరమణ పొందారు. అనంతరం ఆయన డాక్టర్ సుందర రాజన్ స్థపతితో కలిసి 'మయమత', కాశ్యప శిల్ప గ్రంథాలను తెలుగులో అనువాదం ప్రచురణకు కృషి చేశారు. 2014లో శ్రీశైలం దేవస్థాన ఆస్థాన స్థపతిగా విధులు నిర్వహిస్తూ తెలంగాణ ఆవిర్భావ అనంతరం 2018లో అదనపు స్థపతి సలహారుడిగా నియమితులై 2019లో స్థపతి సలహాదారుగా ఆలయ ఉద్ఘాటన వరకు కొనసాగారు. ప్రస్తుతం ఆయన కర్ణాటక, కేరళ, తెలంగాణ తదితర రాష్ట్రాల్లోని వివిధ దేవాలయాల పునర్నిర్మాణ, జీర్ణోద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్నారు. వేలు ఆనందాచారి 101 మెడిసిన్ వర్ణ చిత్రాలను చిత్రీకరించి, 2002 సంవత్సరంలో గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ప్రయత్నం చేశారు. ఈయనకు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు, గ్లోబల్ ఇండియా, వండర్ బుక్ ఆఫ్ రికార్డు, ఎవరెస్ట్ బుక్ ఆఫ్ రికార్డు, మిరాకిల్ బుక్ ఆఫ్ రికార్డు వంటి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈయనను హైదరాబాద్ లలిత కళా తోరణం ఆధ్వర్యంలో అనేక అవార్డులు, రివార్డుల ద్వారా సన్మానించారు. అదే విధంగా రాయిగిరిలో బుద్ధుడి విగ్రహం రూపొందించే సమయంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. శిల్పకళలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను 2002, 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారానికి అందుకున్నారు. 2013లో కళారత్న అవార్డు సొంతమైంది.


బంజారా భాషలో భగవద్గీత

» 701 శ్లోకాలను అనువదించిన సోమ్లాల్



హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీతను బంజారా భాషలోకి అనువదించారు కేతావత్ సోమ్లాల్. 16నెలల పాటు అవిశ్రాంత కృషి చేసి భగవద్గీతలోని 701శ్లోకాలను బంజారా భాషలోకి అనువదించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం ఆకుతోటబావి తండా సోమ్లాల్ స్వస్థలం. నంద్యాలోని ఎస్‌బీఐలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సాహిత్యాభిలాషి అయిన సోమ్లాల్ 200కు పైగా పాటలు రాశారు. తండాల్లో తిరుగుతూ పాటలు పాడుతూ గిరిజనులను చైతన్యం చేస్తున్నారు. 1998 ఆగస్టు 8వ తేదీన భగవద్గీత అనువాదం మొదలుపెట్టి దాదాపు 16నెలల కృషితో పూర్తి చేశారు. భగవద్గీత అనువాదం 1989 పూర్తయినా అది అచ్చవ్వడానికి 25ఏళ్లు పట్టింది. 2014లో శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా అప్పటి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ హెచ్ఎల్ దత్తు, జడ్జి జస్టిస్ ఎన్వీ రమణ, టీటీడీ ఈవో ఎంజీ గోపాల్ ఆవిష్కరించారు. ద హిస్టరీ ఆఫ్ బంజారా, భారత్ బంజారా గీతమాల, తొలి వెలుగు వంటి రచనలు చేసిన సోమ్లాల్ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. సోమ్లాల్‌కు ఆరుగురు అక్కాచెల్లెళ్లు, నలుగురు అన్నాదమ్ములు. పేదరికం కమ్మేసినా తాత, మేనమామ ప్రోత్సాహంతో ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటూ చదువుకున్నారు. ఆయన పదో తరగతి చదువుతూ జనగాంలోని హాస్టల్ ఉండేవారు. పక్కనే గీతామందిరం ఉండటంతో ప్రతి రోజు ఉదయం లౌడ్ స్పీకర్‌లో వినిపించే గీతను విని అభిమానం పెంచుకున్నారు. గీతా సారాన్ని గిరిజనులకు అందించాలని ఆనాడే నిర్ణయించుకున్నారు.

ప్రధాని మెచ్చిన అక్షరయోధుడు



దాశరథిపురస్కార గ్రహీత, మధుర కవి కూరెళ్ల విఠలాచార్య ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రామన్నపేట మండలం నీర్నేముల గ్రామంలో తన అమ్మమ్మగారి ఇంట్లో 1938, జూలై 9న జన్మించారు. విఠలాచార్య తల్లిదండ్రులు కూరెళ్ల వెంకటరాజయ్య, లక్ష్మమ్మ. వీరి స్వగ్రామం రామన్నపేట మండలంలోని వెల్లంకి. చిన్నతనం నుంచే తెలుగులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచేవారు. 1959లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా రామన్నపేట మండలంలోని మునిపంపులలో ఉద్యోగం సాధించారు. 1960లో భువనగిరి సమితి పరిధిలోని వడాయిగూడెం పాఠశాలకు బదిలీ అయ్యారు. 1961లో 'బాహుభారతి'అనే చిన్న లిఖిత పత్రికను స్థాపించారు. విద్యార్థి దశలోనే రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టిన విఠలాచార్య అనంతరం కాలంలో విఠలేశ్వర శతకం, స్మృత్యంజలి, వెల్లంకివెలుగు, కూరెళ్లపద్యకుసుమాలు వంటి రచనలు బాగా ప్రాచుర్యం పొందాయి. విఠలాచార్యను అభినవ పోతన, మధురకవి, సుధీతిలకం బిరుదులతో వివిధ సందర్భాల్లో సన్మానించారు. మధురకవిగా ప్రాచుర్యం పొందారు. 1980లో తెలుగు ఉపన్యాసకుడిగా ఉద్యోగోన్నతి పొందారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనేగాక రాష్ట్రంలోని అనేక చోట్ల సాహితీ ప్రసంగాలు చేసేవారు. సాహిత్యంపై ఉన్న మమకారంతో 2014లో తన ఇంట్లోనే గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. వేల పుస్తకాలను సేకరించారు. విఠలాచార్య కృషిని 2021లో దేశ ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించడంతో విఠలాచార్య ఖ్యాతి జాతీయస్థాయిలో పలువురి దృష్టిని ఆకర్షించింది.

శివబాలకృష్ణ అక్రమ ఆస్తులు రూ.8.27 కోట్లు

- బహిరంగ మార్కెట్‌లో విలువ ఎన్నో రెట్లు అధికం
- అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచిన ఏసీబీ అధికారులు

హైదరాబాద్ సిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న కేసులో నిందితుడిగా ఉన్న శివ బాలకృష్ణ(54)ను అరెస్టు చేసి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు ప్రకటించారు. రెరా కార్యదర్శి, మెట్రో రైల్ ప్లానింగ్ ఆఫీసర్, ఎంఏయూడీ, హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన.. అధికార దుర్వినియోగానికి పాల్పడి అక్రమాస్తులు కూడబెట్టారన్న ఫిర్యాదులతో దాడులు చేశామని అధికారులు పేర్కొన్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచి గురువారం సాయంత్రం వరకు సుమారు 40 గంటల పాటు అధికారులు పలు చోట్ల సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో రూ.99.61 లక్షల నగదు, 1,988 గ్రాముల బంగారు ఆభరణాలు, 6 కిలోల వెండి, రూ.5.96 కోట్ల విలువ చేసే స్థిరాస్తులు కలిపి మొత్తం రూ.8.27 కోట్ల ఆస్తులను గుర్తించారు. అయితే ఈ లెక్కలన్నీ ప్రభుత్వ ధరలేనని.. మార్కెట్ విలువ ఎన్నో రెట్లు అధికంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

ఐహెచ్‌ఆర్సీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఖాద్రీ



హైదరాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఐహెచ్‌ఆర్సీ) మెదక్ జిల్లా కన్వీనర్‌గా పనిచేస్తున్న మహ్మద్ అసద్ ఖాన్ ఖాద్రీ సేవలను మెచ్చుకుంటూ ఆయన్ను తెలంగాణ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు ఐహెచ్‌ఆర్సీ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

హైకోర్టు ఆదేశిస్తే కాళేశ్వరంపై దర్యాప్తు

- రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏ సమాచారం లేదు
- హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన సీబీఐ

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశిస్తే కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి సిద్ధంగా ఉన్నామని సీబీఐ తెలిపింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని, ఉత్తర ప్రత్యుత్తరాలు జరగలేదని హైకోర్టుకు తెలియజేసింది. కాళేశ్వరంలో అవినీతిపై దర్యాప్తు చేయాలని ఫిర్యాదు చేసినా సీబీఐ నుంచి స్పందన లేదంటూ న్యాయవాది రామ్మోహన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సీబీఐ హైదరాబాద్ విభాగం హెడ్, ఐపీఎస్ అధికారి డీ కళ్యాణ్ చక్రవర్తి కౌంటర్ దాఖలు చేశారు. కాళేశ్వరానికి రుణాలు ఇచ్చిన బ్యాంకుల కన్సార్షియం నుంచి సైతం ఫిర్యాదు అందలేదని హైకోర్టుకు తెలిపారు. నేరుగా జోక్యం చేసుకుని దర్యాప్తు చేసే అంశంపై సీబీఐకి పరిమితులు ఉన్నాయని పేర్కొన్నారు. పిటిషనర్ అందజేసిన ఫిర్యాదుపై పరిశీలన జరుపుతున్నామని, ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వ పాత్ర తేలాల్సి ఉందన్నారు. కేవలం రాష్ట్ర ఉద్యోగులే ఉంటే నేరుగా జోక్యం చేసుకోవడానికి తమకు అవకాశం ఉండదని తెలిపారు. ఈ పిటిషన్ ఫిబ్రవరి 2న జస్టిస్ సూరేపల్లి నంద ధర్మాసనం ఎదుట మరోసారి విచారణకు వచ్చే రానుంది.

గ్రంథ హక్కుల వివాదంలో శేషేంద్రశర్మ కుమారుడికి ఊరట

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి గుంటూరు శేషేంద్ర శర్మ గ్రంథాల హక్కులకు సంబంధించిన కేసులో ఆయన కుమారుడు సాత్యకికి హైకోర్టులో ఊరట లభించింది. గ్రంథాలపై హక్కులన్నీ కుమారుడికే చెందుతాయని కోర్టు స్పష్టం చేసింది. గ్రంథాలపై హక్కులన్నీ శేషేంద్రశర్మ 1989లో కుమారుడికి రాసిచ్చారు. ఆయన మరణానంతరం సదరు గ్రంథాలపై తనకే హక్కులు ఉన్నాయని హైదరాబాద్‌కు చెందిన ఇందిరాదేవి సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కానీ, సిటీ సివిల్ కోర్టు సాత్యకికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ పిటిషనర్ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. హైకోర్టు దిగువ కోర్టు తీర్పును సమర్థిస్తూ హక్కులు సాత్యకికి చెందుతాయని తీర్పు వెలువరించింది.

‘రహదారికీ రైతుబంధు’పై కదిలిన సర్కార్

- సమగ్ర విచారణకు ఆదేశం
- వారంలో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలన్న సీఎం కార్యాలయం
- అక్రమాలు నిజమేనని ప్రాథమిక నివేదికలో తేల్చిన అధికారులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఆమనగల్లు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ‘ధరణి’ అక్రమాలపై ‘ఆంధ్రజ్యోతి’లో ఈ నెల 24న ప్రచురితమైన ‘రహదారికీ రైతుబంధు’ కథనంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి భూమికీ రైతుబంధులో పెట్టుబడి సాయం ఇస్తూ వస్తున్న విషయాన్ని ‘ఆంధ్రజ్యోతి’ వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీఎంవో ఆదేశించింది. దీంతో జిల్లా యంత్రాంగం ఆగమేఘాలపై విచారణ జరిపి ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపింది. ‘ఆంధ్రజ్యోతి’లో వచ్చిన కథనం వాస్తవమేనని, జాతీయ రహదారికి సేకరించిన భూమికి కూడా రైతుబంధు ఇస్తున్నట్లు అధికారులు ఆ నివేదికలో పేర్కొన్నారు. దీనిపై వారంలో పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లా కలెక్టర్ శశాంక ఉన్నతస్థాయి విచారణ జరుపుతున్నారు. జాయింట్ కలెక్టర్ భూపాల్ రెడ్డి, కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్ ఆదేశానుసారం కడ్తాల్, ఆమనగల్లు తహసీల్దార్లు ముంతాజ్, లలిత రెవెన్యూ అధికారులు, సిబ్బందితో వివరాల సేకరణకు చర్యలు చేపట్టారు. మూడు రోజులుగా రెండు మండలాల రెవెన్యూ అధికారులు ఇదే పనిలో నిమగ్నమయ్యారు. రోడ్డు ఉన్న సర్వే నెంబర్లలో ఎంతమంది రైతులకు రైతుబంధు పథకంలో సాయం అందుతోంది? భూమి లేకున్నా ధరణి రికార్డుల ఆధారంగా రోడ్డు మార్గంలో ఎవరెవరు రైతుబంధు కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు? అనే వివరాలు అందించాలని రెవెన్యూ శాఖ వ్యవసాయ శాఖను కోరింది. రెవెన్యూ, ఎన్‌హెచ్ఏఐ, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి భూమి వివరాల సేకరణలో నిమగ్నమైనట్లు తెలిసింది. పూర్తి వివరాలు అందాక, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మాణంలో భూమి కోల్పోయినా దాన్ని రికార్డుల్లో తొలగించని కారణంగా కొందరు రైతులు ఆ భూమిని ఇతరులకు విక్రయించగా.. కొన్నిచోట్ల ఇద్దరు ముగ్గురి చేతులు మారినట్లు సమాచారం. అలాంటి వివరాలను కూడా అధికారులు సేకరిస్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా రాష్ట్రంలో ఇంకా ఇతర ప్రాంతాల్లో కూడా రహదారులు నిర్మించిన భూములు రికార్డుల్లో నమోదై రైతుబంధు సాయం అందుతున్న వివరాలను కూడా ప్రభుత్వం సేకరిస్తున్నట్లు సమాచారం.

పెద్దల సభకు ఉద్యమ సారథి

ఎట్టకేలకు చట్టసభలోకి ప్రొఫెసర్ కోదండరామ్.. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియామకం

- మరో ఎమ్మెల్సీగా సియాసత్ న్యూస్ ఎడిటర్ అమీర్ అలీ ఖాన్
- ఇద్దరి నియామకానికి గవర్నర్ ఆమోదముద్ర
- ఎన్నికల కమిషన్ ఆమోదం కోసం ఫైలు



హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గవర్నర్ కోటా కింద ఇద్దరు ఎమ్మెల్సీలు నియమితులయ్యారు. ఒకరు తెలంగాణ ఉద్యమ సారథి, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ కాగా మరొకరు సియాసత్ ఉర్దూ పత్రిక రెసిడెంట్ ఎడిటర్ జావెద్ అలీ ఖాన్ కుమారుడు, సియాసత్ పత్రిక న్యూస్ ఎడిటర్ మీర్ అమీర్ అలీ ఖాన్. ఈమేరకు వీరి నియామకాన్ని గవర్నర్ తమిళిసై గురువారం ఆమోదించారు. అనంతరం ఎన్నికల సంఘం ఆమోదం కోసం ఫైలును పంపించారు. అక్కడి నుంచి అనుమతి రాగానే.. ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయనుంది. ఈ రెండు ఎమ్మెల్సీ పోస్టులు ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్నాయి. బీఆర్ఎస్ పార్టీ మొదట వీటి భర్తీ కోసం దాసోజు శ్రవణ్, కె.సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించింది. ఈ ఫైలును గవర్నర్‌కు పంపించగా ఆమె తిరస్కరించారు. గవర్నర్ కోటా కింద నియమించేవారికి సాహిత్యం, సైన్స్, కళలు, సామాజిక సేవా రంగాల్లో ఏదో ఒక రంగానికి చెందినవారై ఉండాలని ఈ విభాగాల కింద దాసోజు శ్రవణ్, సత్యనారాయణ పరిగణించలేమని ప్రకటించారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండు ఎమ్మెల్సీ పదవులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఒక ఎమ్మెల్సీ పదవిని ప్రొఫెసర్ కోదండరామ్‌కు ఇవ్వాలని మొదట్లోనే యోచించింది. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, టీజేఎస్ పొత్తు పెట్టుకున్నాయి. పొత్తులో భాగంగా కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇస్తామంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించారు. ఆ నేపథ్యంలోనే కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవి వరించింది. ఆయనను అప్పట్లోనే చట్టసభల్లోకి తీసుకుంటారన్న చర్చ జరిగింది. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి టర్మ్‌లో కోదండరామ్‌కు ఎమ్మెల్సీ లేదా రాజ్యసభ పదవి ఇస్తారన్న వార్తలు వెలువడ్డాయి. కానీ.. బీఆర్ఎస్ పార్టీకి, కోదండరామ్‌కు మధ్య పొరపొచ్చాలు పెరిగాయి. కోదండరామ్‌ను అప్పటి సీఎం కేసీఆర్ పక్కన పెట్టాయి. దాంతో కోదండరామ్ తెలంగాణ జన సమితి పార్టీని స్థాపించారు. అప్పటి నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ వచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆయనకు సానుకూల వాతావరణం ఏర్పడింది. ఎట్టకేలకు ఎమ్మెల్సీ పదవి వరించడంతో చట్టసభల్లోకి అడుగు పెట్టే అవకాశం చిక్కింది.

జర్నలిజంలో 30 ఏళ్ల అనుభవం



హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ఎంపికైన సియాసత్ ఉర్దూ దినపత్రిక న్యూస్ ఎడిటర్ మీర్ అమీర్ అలీఖాన్ 1973 అక్టోబరు 10న హైదరాబాద్‌లో జన్మించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రాథమిక విద్య, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ నుంచి బీకామ్, జర్నలిజం, సుల్తాన్ ఉల్ ఉలూం కాలేజ్ నుంచి ఎంబీఏ పట్టాలు పొందారు. ప్రస్తుతం ఆయన సియాసత్ ఉర్దూ దిన పత్రికలో న్యూస్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. దేశవిదేశాల్లో సియాసత్ దినపత్రికాభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు. సియాసత్ వీక్లీ, ఇంగ్లిష్ ఎడిషన్‌తో పాటు సియాసత్ టీవీ ఛానెల్ ప్రారంభించడంలో కీలక పాత్ర పోషించారు. జర్నలిజంలో దాదాపు ముప్పై ఏళ్ల అనుభవం ఆయన సొంతం. 1998 నుంచి దేశ ప్రధానులు విదేశాలకు వెళ్లినప్పుడు వారితో కలిసి వెళ్లారు. 2002లో జర్మనీలో గోతే ఇనిస్టిట్యూట్ నిర్వహించిన అంతర్జాతీయ విజిటర్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి, 2007లో బ్రిటన్‌లో జరిగిన గ్రేట్ బ్రిటన్ ఆన్ ఇస్లామ్ కార్యక్రమానికి, 2011లో యూఎస్ఏలో యూఎస్ ఫారిన్ పాలిసి లీడర్ షిప్ కార్యక్రమానికి, 2015లో టర్కీలో జరిగిన కార్యక్రమానికి, 2016లో ఇరాక్, కర్బలాలో ప్రార్థనాలయాల సందర్శన నిమిత్తం వెళ్లిన జర్నలిస్టుల పర్యటనలో, 2017లో ఇజ్రాయెల్ పర్యటనలో ఆయన పాల్గొన్నారు.

ఇదీ కోదండరామ్ ఉద్యమ చరిత్ర

ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేసిన ముద్దసాని కోదండరామ్ స్వగ్రామం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నెన్నెల మండలం జోగాపూర్. 1955 సెప్టెంబరు 5న ముద్దసాని వెంకటమ్మ, ఎం.జనార్దన్‌రెడ్డి దంపతులకు జన్మించారు. కాజీపేటలోని సెయింట్ గాబ్రియల్ స్కూల్‌లో టెన్త్ వరకు చదివారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ(పొలిటికల్ సైన్స్), జేఎన్‌యూలో ఎంఫిల్ పూర్తి చేశారు. ఓయూ ప్రొఫెసర్ రమా మేల్కొటే శిష్యుడిగా పేరున్న ఆయన ఆదివాసీల సమ్యలపై దివంగత హక్కుల నేత బాలగోపాల్, ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావుతో కలిసి పని చేశారు. ఆ తర్వాత తెలంగాణ విద్యావంతుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడిగా వ్యవహరించారు. దేశంలో ఆహార భద్రత సమస్యపై పని చేసిన సుప్రీంకోర్టు కమిషనర్‌కు సలహాదారుగా కూడా పని చేశారు. దివంగత ప్రొఫెసర్ జయశంకర్, ప్రొఫెసర్ కేశవరావు జాదవ్‌లతో సహా అనేక మంది ప్రముఖ తెలంగాణవాదులతో ప్రత్యక్షంగా కలిసి పని చేశారు. అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, కుల సంఘాల సమాహారమైన తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ(టీజేఏసీ)కి 2009 నుంచి రాష్ట్ర ఆవిర్భావం వరకు నాయకత్వం వహించారు. సహాయ నిరాకరణ, వంటావార్పు, సకల జనుల సమ్మె వంటి ఉద్యమ కార్యక్రమాలు ఆయన సారథ్యంలోనే జరిగాయి. తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా టీ జేఏసీని కొనసాగించారు. 2018లో తెలంగాణ జన సమితిని ఏర్పాటు చేసి, వివిధ సమస్యలపై బీఆర్ఎస్ సర్కారుకు వ్యతిరేకంగా పోరాడారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి

- మాజీ డీజీపీకి అత్యంత కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకంలో అత్యంత కీలకమైన తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)కు కొత్త సారథి వచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరుసగా ప్రశ్నపత్రాల లీకేజీతో అప్రదిష్టపాలైన సంస్థకు.. రిటైర్డ్ పోలీస్ బాస్ అధిపతిగా నియమితులయ్యారు. ఎన్నికల్లో ప్రకటించిన విధంగా.. కమిషన్‌ను ప్రక్షాళన చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి అడుగువేసింది. టీఎస్‌పీఎస్సీ పగ్గాలను మాజీ డీజీపీ ముదిరెడ్డి మహేందర్‌రెడ్డికి అప్పగించింది. సభ్యులుగా రిటైర్డ్ ఐఏఎస్ అనితారాజేంద్ర, ఇండియన్ పోస్టల్ సర్వీస్ రిటైర్డ్ అధికారి అమీర్ ఉల్లాఖాన్, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ నర్రి యాదయ్య, విద్యుత్తు శాఖకు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యరబడి రామ్మోహన్ రావు, కాంగ్రెస్ నాయకురాలు పాల్వాయి రజనీకుమారిని నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు గవర్నర్ తమిళిసై గురువారం ఆమోదం తెలిపారు. ఆ వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కాగా, చైర్మన్, సభ్యులు పదవీ బాధ్యతలు చేపట్టిన తేదీ నుంచి ఆరేళ్ల పాటు లేదా 62 ఏళ్ల వయసు నిండేలోపు పదవుల్లో ఉంటారు. ఈ నిబంధనల్లో ఏది ముందు వర్తిస్తే అది అమలవుతుంది. మరోవైపు ఈ ఆరుగురిలో ఓసీ, బీసీ సామాజికవర్గాలకు చెందినవారు ఇద్దరు ఉండగా, ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పించారు. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌తో కలిపి మొత్తం 11 మందిని నియమించవచ్చు. ప్రస్తుతం చేపట్టినవి పోగా.. ఇంకా ఐదుగురిని నియమించే అవకాశం ఉంది. వీటిపైనా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

భుజాలపై చాలా పెద్ద బాధ్యత

బీఆర్ఎస్ హయాంలో టీఎస్‌పీఎస్సీ తీవ్ర విమర్శలకు గురైంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం సంస్థ పేరును మసకబార్చింది. నిరుద్యోగుల ఆత్మహత్యల నేపథ్యంలో కమిషన్ దోషిగా నిలవాల్సి వచ్చింది. దీంతో అప్పటి చైర్మన్ జనార్దన్‌రెడ్డి, సభ్యులు రాజీనామా చేయాలంటూ విపక్ష నేతలు, ఓయూ విద్యార్థి సంఘాలు, నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. అయినా, బీఆర్ఎస్ ప్రభుత్వం వారిని కొనసాగించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. జనార్దనరెడ్డి, నలుగురు సభ్యులు వైదొలగారు. మిగతా ఇద్దరిలో ఒకరు ఇటీవల రాజీనామాను గవర్నర్‌కు పంపారు. మరొకరు ఇంకా వైదొలగలేదు. కాగా, టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రకటించారు. కొత్త కమిషన్ ఏర్పాటయ్యాక ఏడాది లోపు 2 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. టీఎస్‌పీఎస్సీ పారదర్శకంగా, పకడ్బందీగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డితో పాటు సభ్యులపై చాలా పెద్ద బాధ్యత ఉంది.

వ్యవసాయ కుటుంబం..



మహేందర్‌రెడ్డిది ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కిష్టాపురం గ్రామం. వ్యవసాయ కుటుంబానికి చెందిన నారాయణరెడ్డి, అచ్చమ్మలకు 1962 డిసెంబరు 3న జన్మించారు. నల్లగొండ జిల్లా సర్వేల్ గురుకులంలో ప్రాథమిక, కూసుమంచిలో హైస్కూల్ విద్యను అభ్యసించారు. నాగార్జున సాగర్ గురుకుల కళాశాలలో ఇంటర్, వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ (ఆర్ఈసీ) నుంచి 1984లో బీటెక్ సివిల్ పూర్తి చేశారు. ఢిల్లీ ఐఐటీలో ఎంటెక్ చదివారు. 1986లో మొదటి ప్రయత్నంలోనే సివిల్స్ సాధించారు. విశాఖపట్నం, గోదావరిఖని, గుంటూరులో ఏఎస్పీగా, బెల్లంపల్లి అడిషనల్ ఎస్పీగా, నిజామాబాద్, కర్నూలు జిల్లాల్లో ఎస్పీగా పనిచేశారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో ఈస్ట్ జోన్ డీసీపీ, జాతీయ పోలీస్ అకాడమీలో అసిస్టెంట్, డిప్యూటీ డైరెక్టర్‌గా సేవలందించారు. 2003-07 మధ్య సైబరాబాద్ కమిషనర్‌గా కొనసాగారు. గ్రేహౌండ్స్, ఇంటిలిజెన్స్ చీఫ్‌గా చేసిన మహేందర్‌రెడ్డి 2014-17 నడుమ హైదరాబాద్ సీపీగా, 2017-22లో డీజీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. పోలీసింగ్‌లో టెక్నాలజీకి పెద్దపీట వేశారు.

విద్యావంతుల ఇంటి నుంచి..



హైదరాబాద్ జూబ్లీ హిల్స్ ఫిల్మ్‌నగర్‌కు చెందిన 58 ఏళ్ల అమీర్ ఉల్లాఖాన్‌ది వీరిది విద్యావంతుల కుటుంబం. 1983 బ్యాచ్ ఇండియన్ పోస్టల్ సర్వీసు అధికారి. 1995లో వీఆర్ఎస్ తీసుకున్నారు. తర్వాత కేంద్ర ఆర్థిక శాఖ, యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(యూఎన్‌డీపీ)లో పనిచేశారు. ఉర్దూ వర్సిటీ, ఐఎస్‌బీ, నల్సార్, ఎంసీహెచ్ఆర్‌డీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. విద్య, ఆర్థిక రంగాలపై కథనాలు రాశారు.

ఉత్తమ అధికారిగా..



రిటైర్డ్ ఐఏఎస్ అనితారాజేంద్ర ఓయూలో ఎంఏ, ఎల్ఎల్ఎం చదివారు. 1963 ఫిబ్రవరి 4న జన్మించారు. 1998లో సివిల్స్ సాధించారు. 2011-12లో మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా, 2012లో ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా, 2013-14లో ఏపీఐడీసీ వీసీ అండ్ ఎండీగా, 2015లో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా, 2015-18లో హోం శాఖ కార్యదర్శిగా, 2018-20లో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా, 2020-22లో పశు సంవర్ధక శాఖ కార్యదర్శిగా పనిచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రెండుసార్లు అవార్డు పొందారు. అనితా గౌడ వర్గానికి చెందినవారు.

విద్యుత్తు శాఖ నుంచి..



విద్యుత్తు శాఖలోని జల విద్యుత్తు విభాగంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు యరబడి రామ్మోహన్‌రావు. ఎరుకల (ఎస్టీ) సామాజిక వర్గానికి చెందినవారు. 1963లో జన్మించిన ఆయన 1984లో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి బీఈ చదివారు.

సీనియర్ ప్రొఫెసర్..



యాదయ్య 1964 ఫిబ్రవరి 10న జన్మించారు. జేఎన్‌టీయూహెచ్‌లో ఎలక్ట్రానిక్స్ సీనియర్ ప్రొఫెసర్. 1988లో బీఈ, 1991లో ఎంటెక్, 2000లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2008-12 వరకు జేఎన్‌టీయూలోని ఈఈఈ విభాగం హెచ్‌వోడీగా, 2013-14లో సీఈహెచ్ విభాగం వైస్ ప్రిన్సిపల్‌గా, 2014-15లో ప్రిన్సిపల్‌గా, 2015-19 వరకు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఎంసెట్ కన్వీనర్‌గా పనిచేశారు. ఈయన కురుమ వర్గానికి చెందినవారు.

గ్రూప్-1 కొలువు వదిలి..



దళిత వర్గానికి చెందిన రజనీ 1972లో జన్మించారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎల్ఎల్‌బీ, బీఈడీ చదివారు. 2000 సంవత్సరంలో గ్రూప్-1 సాధించారు. 2004 వరకు ఖైరతాబాద్ సర్కిల్ మునిసిపల్ కమిషనర్‌గా పని చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఉమ్మడి ఏపీ సీఎంగా ఉండగా.. ఆయన ప్రోత్సాహంతో టీడీపీలో చేరారు. ఆ ఏడాది సూర్యాపేటలో, 2014లో తుంగతుర్తి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2023 అక్టోబరు 18న రేవంత్‌రెడ్డి పిలుపుతో కాంగ్రెస్‌లో చేరారు.



ఇక.. వేగంగా పోస్టుల భర్తీ!

- టీఎస్‌పీఎస్సీకి కొత్త రూపుతో ఉద్యోగార్థుల్లో ఆశాభావం
- ప్రభుత్వ చొరవపై హర్షం

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ)ను గాడిన పెట్టే అంశంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ పట్ల ఉద్యోగార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చైర్మన్, సభ్యులను నియమించి టీఎస్‌పీఎస్సీకి కొత్త రూపు తీసుకురావడంతో ఇక ఉద్యోగాల భర్తీనే తరువాయి అని ఆశగా ఎదురు చూస్తున్నారు. నిజానికి, గత ప్రభుత్వ హయాంలో టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్ 1, 2 సహా వివిధ పోస్టులకు పరీక్షలు జరిగాయి. కానీ, పేపర్ లీకేజీలు, పరీక్షకు హాజరైన అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకోకపోవడం తదితర కారణాల వల్ల ఆయా పరీక్షలు రద్దు అయ్యాయి. దీంతో టీఎస్‌పీఎస్సీ అప్రతిష్ట మూటకట్టుకోగా ఉద్యోగార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనపై నిరుద్యోగులకు హామీనిచ్చింది. అధికారం చేపట్టిన వెంటనే బోర్డును ప్రక్షాళన చేసి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని స్పష్టం చేసింది. ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనపై దృష్టి సారించింది. చైర్మన్, సభ్యుల ఎంపిక కోసం అనుభవజ్ఞులు, మేధావులతో ఓ కమిషన్ ఏర్పాటు చేసింది. అలాగే, వివిధ రాష్ట్రాల్లోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పనితీరు అధ్యయనానికి ఐఏఎస్ అధికారులను రెండు బృందాలుగా కేరళ, ఢిల్లీ పంపింది. ఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహణపై ప్రత్యేకంగా అధ్యయనం చేయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా యూపీఎస్సీ అధికారులతో స్వయంగా మాట్లాడారు. మొత్తంగా రాజకీయ ప్రమేయం లేకుండా చైర్మన్, సభ్యులను ఎంపిక చేసి జాబితాను గవర్నర్‌కు పంపగా వెంటనే ఆమోదం లభించింది. దీంతో కమిషన్ పూర్తి స్థాయిలో ఏర్పాటైంది. దీంతో ఉద్యోగాల భర్తీ ఇక పారదర్శకంగా జరుగుతుందని ఉద్యోగార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నియామకాల్లో సామాజిక న్యాయం

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల నియామకం విషయంలో దాదాపు అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం దక్కింది. చైర్మన్‌గా నియమితులైన మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి ఓపెన్ కేటగిరి, రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు. గౌడ సామాజిక వర్గానికి చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అనిత రామచంద్రన్, కుర్మ కులానికి చెందిన నర్రి యాదయ్య, ఎస్టీ (ఎరుకుల) సామాజిక వర్గానికి చెందిన రామ్మోహన్ రావు, ఎస్సీ (మాదిగ) సామాజిక వర్గానికి చెందిన గ్రూప్-1 అధికారిగా పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న పాల్వాయి రజని, ఇండియన్ పోస్టల్ సర్వీస్‌లో పని చేసిన అమీరుల్లాఖాన్ (ముస్లిం మైనార్టీ కోటాలో) సభ్యులుగా నియమితులయ్యారు. వీరంతా ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పని చేశారు.

బీఆర్ఎస్‌కు 11 ఎకరాల కేటాయింపుపై మరో పిల్

- ఇప్పటికేపెండింగ్‌లో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ పిటిషన్
- రెగ్యులర్ నెంబర్ ఇవ్వాలని రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కోకాపేటలో బీఆర్ఎస్ పార్టీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్సీ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణం కోసం 11 ఎకరాల భూమిని తక్కువ ధర కేటాయించడం అక్రమమని పేర్కొంటూ హైకోర్టులో మరో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది ఎ. వెంకట్రామిరెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే ఫోరంఫర్ గుడ్‌గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) ఈ వ్యవహారంపై పిల్ దాఖలు చేసింది. దీనిపై నోటీసులు సైతం జారీఅయ్యాయి. ఆ కారణంగా ప్రస్తుత పిటిషన్‌కు రిజిస్ట్రీ నెంబర్ కేటాయించలేదు. గురువారం రిజిస్ట్రీ అభ్యంతరాలతో రెండో పిటిషన్ చీఫ్ జస్టిస్ అలోక్‌అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ 11 ఎకరాల భూకేటాయింపు అంశం ఒక్కటే అయినా తమ పిటిషన్‌లో విస్తృత అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో ప్రస్తుత పిటిషన్‌కు రెగ్యులర్ నెంబర్ ఇవ్వాలని ధర్మాసనం రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది. ఎఫ్‌జీజీ దాఖలు చేసిన పిటిషన్‌తో కలిపి వాదనలు వింటామని పేర్కొంటూ విచారణను వాయిదా వేసింది.

సింగిల్ జడ్జి ఆదేశాలపై ‘వ్యూహం’ నిర్మాత అప్పీల్

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వ్యూహం సినిమాకు సెన్సార్ బోర్డు రివైజింగ్ కమిటీ జారీచేసిన సెన్సార్ సర్టిఫికెట్‌ను హైకోర్టు సింగిల్ జడ్జి కొట్టేయడంపై నిర్మాత డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై గురువారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. మూడువారాల్లో మళ్లీ నిర్ణయం తీసుకోవాలని సెన్సార్ బోర్డుకు సింగిల్ జడ్జి ఆదేశాలు ఇచ్చారని.. దీనిని ఒక వారానికి తగ్గించాలని పిటిషనర్ అయిన నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ తరఫు న్యాయవాది కోరారు. ఈనెల 30న పూర్తిస్థాయి విచారణ చేపడతామని.. ప్రస్తుతం ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.

6 నుంచి డ్యామ్ సేఫ్టీ కమిటీ పర్యటన

- కమిటీలో ఈఎన్‌సీ నాగేంద్రరావుకు చోటు

హైదరాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్, శ్రీశైలం డ్యామ్‌ల రక్షణ కోసం జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) వేసిన కమిటీలో తెలంగాణ నుంచి సభ్యుడిగా ఈఎన్‌సీ(ఓ అండ్ ఎం) బి.నాగేంద్రరావును ప్రతిపాదిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీ ఫిబ్రవరి 6 నుంచి 15వ తేదీ మధ్యలో రెండు డ్యామ్‌లనూ సమగ్రంగా పరిశీలించి, డ్యామ్‌ల రక్షణపై కేంద్ర జలశక్తి శాఖకు నివేదిక ఇవ్వనుంది. శ్రీశైలం డ్యాంను పరిశీలించే కమిటీకి ఎన్‌డీఎస్ఏ సభ్యుడు వివేక్ త్రిపాఠి నేతృత్వం వహిస్తున్నారు. ఈ కమిటీలో సభ్యులుగా డిప్యూటీ డైరెక్టర్ అమిత్ మిట్టల్, కన్సల్టెంట్ కమలేష్ జైన్ ఎన్‌డీఎస్ఏ నుంచి ఉండగా... సీడబ్ల్యూసీ చైర్మన్ నామినేట్ చేసే అధికారి, సీఎస్ఎంఆర్ఎస్ డైరెక్టర్ నామినేట్ చేసే సైంటిస్ట్‌తో పాటు తెలంగాణ తరఫున బి.నాగేంద్రరావు, ఏపీ నుంచి చీఫ్ ఇంజనీర్ తత్సమాన కేడర్ లేదా ఆ పై స్థాయి అధికారి ఉండనున్నారు.

బోధన్‌లో రైస్‌మిల్లుపై అధికారుల దాడులు

- రూ.5.40 కోట్ల అవకతవకలు జరిగినట్లు గుర్తింపు

బోధన్ రూరల్, జనవరి 25: నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని దాదాబాయి రైస్‌మిల్లుపై గురువారం పౌర సరఫరాల అధికారులు దాడులు నిర్వహించారు. రైస్‌మిల్లుకు సంబంధించి పలు రికార్డులను తనిఖీ చేశారు. మిల్లులో రూ.5.40కోట్లమేర అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. నిర్వాహకులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బోధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్రప్రకాశ్ మాట్లాడుతూ దాదాబాయి రైస్‌మిల్లులో 22,783 క్వింటాళ్ల ధాన్యానికి సంబంధించిన లెక్కలు తేలడం లేదని, దీని విలువ రూ.5.40కోట్లను ఉంటుందని వెల్లడించారు. ఈ మేరకు మిల్లు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చంద్రప్రకాశ్ వివరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
diksuchi@andhrajyothy.com
దిక్సూచి
హైదరాబాద్ ● శుక్రవారం 26 జనవరి 2024

ఐఐఎఫ్‌టీలో ఆన్‌లైన్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'ఎక్స్‌పరిమెంటల్ ప్రోగ్రామ్ ఆన్ ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది మూడు వారాల వ్యవధి గల ఆన్‌లైన్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు ఎక్స్‌పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లేస్‌ల విజిట్ కూడా ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో మూడు ఫేజ్‌లు ఉంటాయి. మొదటి మూడు వారాలను మొదటి ఫేజ్‌గా; నాలుగు, అయిదు వారాలను రెండో ఫేజ్‌గా; చివరి రెండు వారాలను మూడో ఫేజ్‌గా పరిగణిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా వారాంతాల్లో లైవ్ ఆన్‌లైన్ ఇంటరాక్టివ్ సెషన్స్, కేస్ స్టడీ అనాలిసిస్, అసెస్‌మెంట్‌లు ఉంటాయి. మిడిల్/సీనియర్ లెవెల్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు, ఆంత్రప్రెన్యూర్స్, ఎక్స్‌పోర్ట్ సర్వీసెస్ ప్రొఫెషనల్స్ దరఖాస్తు చేసుకోవచ్చు. నిబంధనల ప్రకారం రిపోర్ట్‌లు సబ్మిట్ చేసినవారికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.



ప్రోగ్రామ్‌లోని అంశాలు

- **మొదటి ఫేజ్:** ఇంట్రడక్షన్ & కీ ఎలిమెంట్స్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్, ఫారిన్ ట్రేడ్- పాలసీ & ప్రొసీజర్స్, కస్టమ్స్ ప్రొసీజర్స్
- **రెండో ఫేజ్:** విజిటింగ్ ఆఫ్ 6 పోర్ట్స్
- **మూడో ఫేజ్:** రిపోర్ట్ ప్రజంటేషన్

విజిటింగ్ పోర్ట్స్: స్పెషల్ ఎకనామిక్ జోన్, ఇన్‌లాండ్ కంటైనర్ డిపోట్స్, కంటైనర్ ఫ్రైట్ స్టేషన్స్, సీ పోర్ట్‌లు, ఎయిర్ పోర్ట్‌లు, ల్యాండ్ పోర్ట్‌లు(కస్టమ్స్ స్టేషన్స్), ఫ్రీ ట్రేడ్ వేర్‌హౌసింగ్ జోన్, ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్, ఎక్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్షన్ కౌన్సిల్, ఫ్రైట్ ఫార్వర్డ్స్, ఇండస్ట్రియల్ కారిడార్స్, ఎక్స్‌పోర్ట్ క్లస్టర్స్, డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ టర్మినల్స్, మల్టీ మోడల్ పార్క్స్, గతి శక్తి కార్గో టర్మినల్స్

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.20,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 14
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఫిబ్రవరి 17 నుంచి
- **వెబ్‌సైట్:** iift.ac.in

ఓయూలో సెకండ్ ఫేజ్ అడ్మిషన్స్



ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జీ రామిరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(పీజీఆర్‌ఆర్‌సీడీఈ)- డిగ్రీ, పీజీ, అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికిగాను 2023-24 సెకండ్ ఫేజ్ (2024 ఫిబ్రవరి అకడమిక్ సెషన్) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌లను ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) విధానంలో నిర్వహిస్తారు. ఇవి రెగ్యులర్ డిగ్రీకి సమానం.

డిగ్రీ: బీఏ, బీఏ(మేథమెటిక్స్&స్టాటిస్టిక్స్), బీకాం(జనరల్), బీబీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ

- **ఎంబీఏ, ఎంసీఏ:** ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. వీటిని ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాలి. కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు మాత్రం ఇంటర్/డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. టీఎస్ ఐసెట్ 2023/ఏపీ ఐసెట్ 2023 అర్హత ఉండాలి. లేదంటే 2024 ఫిబ్రవరిలో ఓయూ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.
- **ఎంఏ:** ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీష్, ఫిలాసఫీ, సోషియాలజీ, పబ్లిక్ పర్సనల్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ స్పెషలైజేషన్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. హిందీ, ఉర్దూ స్పెషలైజేషన్‌లకు ఆ మాధ్యమాల్లో పదోతరగతి వరకు చదివి ఉండాలి. లేదంటే డిగ్రీ స్థాయిలో ఆ లాంగ్వేజ్‌ను ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.
- ఎంకాం ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో చదవాలి. డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- **ఎమ్మెస్సీ:** ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో చదవాలి. మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. డిగ్రీ(మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్)/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు అర్హులు.

అడ్వాన్స్‌డ్ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మేథమెటిక్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్, బయోఇన్ఫర్మాటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, డేటా సైన్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో చదవాలి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. బయోఇన్ఫర్మాటిక్స్‌కు మాత్రం కనీసం 50 శాతం మార్కులతో బీఎస్సీ/ బీఎస్సీ అగ్రికల్చర్/ బీఫార్మసీ/ బీవీఎస్సీ/ ఎమ్మెస్సీ/ ఎంబీబీఎస్/ బీడీఎస్/ బీఏఎంఎస్/ బీయూఎంఎస్/ బీహెచ్ఎంఎస్/బీఈ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవాలి.

అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా: ఇందులో ప్రధాన స్పెషలైజేషన్ వేదిక్ ఆస్ట్రాలజీ. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. తెలుగు మాధ్యమంలో చదవాలి. వేదిక్ ఆస్ట్రాలజీ విభాగంలో డిప్లొమా/అడ్వాన్స్‌డ్ డిప్లొమా/పీజీ డిప్లొమా ఉత్తీర్ణులు అర్హులు.

డిప్లొమా: ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ వేదిక్ ఆస్ట్రాలజీ. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. తెలుగు మాధ్యమంలో చదవాలి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

సర్టిఫికెట్ కోర్సు: స్పెషలైజేషన్ యోగ. ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఆంగ్ల మాధ్యమంలో చదవాలి. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అర్హులు.

- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** osmania.ac.in

జేఎన్‌టీయూహెచ్‌లో పీహెచ్‌డీ

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్)- పీహెచ్‌డీ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైం, పార్ట్ టైం(ఎక్స్‌టర్నల్/ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్) కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. యూజీసీ, సీఎస్ఐఆర్, డీఎస్‌టీ ఇన్‌స్పైర్, ఇతర ప్రభుత్వ సంస్థల నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత పొందినవారు; నెట్/జీప్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు ఫుల్ టైం ప్రోగ్రామ్‌నకు అప్లయ్ చేసుకోవచ్చు. ఇంటర్వ్యూ, రీసెర్చ్ పబ్లికేషన్స్ వెయిటేజీ, ప్రపోజ్డ్ రీసెర్చ్ వర్క్ ప్రజంటేషన్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. జేఆర్ఎఫ్ అర్హత/జాతీయ పరీక్ష స్కోర్ లేనప్పటికీ యూనివర్సిటీ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాసి ఎక్స్‌టర్నల్ ప్రోగ్రామ్‌లో చేరవచ్చు.

విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- **ఇంజనీరింగ్:** సివిల్, మెకానికల్, మెటలర్జికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్
- **సైన్స్ అండ్ టెక్నాలజీ:** బయోటెక్నాలజీ, కెమికల్ సైన్సెస్-కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ నానో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ సైన్సెస్, వాటర్ రిసోర్సెస్ & ఎర్త్ అండ్ అట్మాస్ఫిరిక్ సైన్సెస్
- **మేనేజ్‌మెంట్ సైన్స్:** మేనేజ్‌మెంట్
- ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్ కేటగిరీలో మేథమెటిక్స్, ఫిజిక్స్, ఫైనాన్స్ స్పెషలైజేషన్‌లు కూడా ఉన్నాయి.

అర్హత వివరాలు: ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లకు సంబంధిత బ్రాంచ్‌లో బీఈ/బీటెక్/ఏఎంఐఈతో పాటు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ పూర్తిచేసి ఉండాలి. సైన్స్ అండ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లకు సంబంధిత సబ్జెక్టులతో ఎమ్మెస్సీ/ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. ఫార్మాస్యూటికల్ సైన్సెస్ స్పెషలైజేషన్‌కు బీఫార్మసీతోపాటు ఎంఫార్మసీ/ఫార్మాడీ పూర్తి చేసి ఉండాలి. మేనేజ్‌మెంట్ విభాగానికి ఎంబీఏ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులందరికీ పీజీ స్థాయిలో కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. దివ్యాంగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే కనీసం అయిదేళ్ల రీసెర్చ్ అనుభవం ఉండాలి. ఎక్స్‌టర్నల్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే అభ్యర్థులు రీసెర్చ్ ఆర్గనైజేషన్స్/ఆర్&డీ యూనిట్స్/ఇండస్ట్రీస్/అకడమిక్ ఇన్‌స్టిట్యూషన్స్/ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తూ ఉండాలి.

ఎక్స్‌టర్నల్ ప్రోగ్రామ్ ఎంట్రెన్స్ టెస్ట్: ఇందులో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను బ్లూ/బ్లాక్ బాల్‌పాయింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు 50 శాతం; బీసీ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు రావాలి. స్పెషలైజేషన్‌ల వారీ నిర్దేశించిన పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.



ముఖ్య సమాచారం

- **అడ్మిషన్ ఫీజు:** ఫుల్ టైం, ఎక్స్‌టర్నల్ ప్రోగ్రామ్‌లకు రూ.1500; ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్ ప్రోగ్రామ్‌నకు రూ.5000
- **యాన్యువల్ ట్యూషన్ ఫీజు:** ఫుల్ టైం ప్రోగ్రామ్‌నకు రూ.20,000; ఎక్స్‌టర్నల్ ప్రోగ్రామ్‌నకు రూ.30,000; ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్ ప్రోగ్రామ్‌నకు రూ.60,000
- **దరఖాస్తు ఫీజు:** ఫుల్ టైం ప్రోగ్రామ్‌నకు రూ.1500; ఎక్స్‌టర్నల్ ప్రోగ్రామ్‌నకు రూ.1000; ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్ ప్రోగ్రామ్‌నకు రూ.5000
- **రిజిస్టర్డ్ పోస్ట్/కొరియర్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 24
- **చిరునామా:** డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్-500085
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

లిటిల్స్



టక్కరి దొంగ.. నక్క!


అనగనగా ఓ జిత్తులమారి నక్క. టక్కరి దొంగ. దాని చేష్టలు మిగతా నక్కలకంటే విచిత్రం ఉండటంతో మిగతా నక్కలన్నీ కలసి తరిమేశాయి. అది తలదాచుకోవటానికి స్థలం వెతుక్కుంటూ ఓ వెర్రి వెంగళప్ప ఇంటికి వెళ్లింది. నక్క వాలకం, నటన చూసి దానితో స్నేహం చేశాడు వెంగళప్ప. ఇద్దరూ మంచి మిత్రులయ్యారు. ఎంతో గొప్ప స్నేహితుడు దొరికాడని వెంగళప్ప ఊహించుకున్నాడు. ఎంతో మంచి బకరా దొరికాడనుకుంది నక్క.

మరుసటి రోజు ఉదయాన్నే నక్క వచ్చి తన స్నేహితుడితో ఇలా అన్నది. నీ వృత్తి గడ్డం తీయటం, జుట్టు కత్తిరించటం. ఇంకో పని చేసుకోకపోతే ఎలా? అన్నది. నాకేం తెలుసన్నాడు వెంగళప్ప. దోసకాయ, టమోటా, ద్రాక్ష, గుమ్మడికాయ.. ఇలా పండించు. నీకు ఆహారానికి ఉంటాయి. అమ్మవచ్చు కూడా అన్నది. మరి పండ్లను రక్షించుకోవటం కష్టమే అన్నాడు. 'నాలాంటి సావాసం దొరకటమే నీ అదృష్టం' అన్నది. దీంతో వెంగళప్ప ఆలోచించకుండా తన భార్యను తీసుకుని పోయి.. ఇన్ని బీర, దోసకాయల విత్తనాలు చల్లాడు. అరటి, ద్రాక్ష చెట్లు నాటాడు. టమోటాలు, గుమ్మడికాయ పంట వేశాడు. నక్క కాపలా ఉంది. అయితే ఎప్పటికప్పుడు పిందెలను తినేది. పైగా ఏవీ రాకుండా కర్రపెత్తనం చేసేది.





ద్రాక్ష కాయటం మొదలెట్టాక రాత్రికి రాత్రి పాడుచేసేది. తన ఇతర నక్కలను విందుకు పిలిచి పండగ చేసుకునేది. ఇవన్నీ వెంగళప్పకు తెలీదు. 'స్నేహితుడా.. ద్రాక్షలే కనపడలేదు' అనేవాడు వెంగళప్ప. ఇప్పుడు వానాకాలం రాలిపోయాయి అనేది. ఆ తర్వాత చలికాలం అయితే కాయలు ఉంటాయనేది. తీరా చలికాలం వచ్చాక ఎండాకాలంలో కాయలు కాస్తాయి అనేది నక్క. నాలుగైదు ద్రాక్ష చెట్లను మాత్రం అలానే వదిలేసింది ఏమీ చేయకుండా. ఒక రోజు మళ్లీ తనతో కొట్లాడిన నక్కల గుంపును పిలిచి తన గొప్పతనం చూపించింది. ద్రాక్షనంతా ఇష్టం వచ్చినట్లు కొరికేశాయి. బైటపడేసాయి. ఆ మరుసటి ఉదయాన వెంగళప్ప తోటకెళ్లాడు. నక్క మోసం అర్థమైంది. పంటను చూసి కన్నీళ్లు కార్చాడు.

దొంగ స్నేహితుడికి బుద్ధి చెప్పాలనుకున్నాడు. పక్క ఊరిలో జుట్టు కత్తిరించటానికి వెళ్లే వెంగళప్పకు ఓ ఆలోచన వచ్చింది. తోటంతా తేరిపార చూశాడు. అక్కడ ఓ గుమ్మడికాయ కనపడింది. ఆకుల మధ్య ఆ గుమ్మడికాయ ఉన్నది. దాని పక్కన తన చేతుల్లోని కత్తులను నాటాడు. రాత్రికి నక్కబావ వచ్చింది. తోటంతా కలియదిరిగింది. గుమ్మడికాయ కనపడ్డది. ఆశతో ఎగిరి దూకింది. కత్తులు గుచ్చుకున్నాయి. ఒకటే రక్తం. తన స్నేహితుడిని విపరీతంగా తిట్టింది. శాపనార్థాలు పెట్టింది. వీడు వెర్రి వెంగళప్ప కాదని గట్టిగా అరిచింది. తోటలోనే ప్రాణం విడిచింది ఆ టక్కరి దొంగ.



7 తేడాలను గుర్తించండి





ఎన్‌ఆర్‌ఎస్‌సీలో సైంటిస్టులు

నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్‌ఆర్‌ఎస్‌సీ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు: 41**

1. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(అగ్రికల్చర్): **2 పోస్టులు**
2. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(ఫారెస్ట్రీ ఎకానమీ): **4 పోస్టులు**
3. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(జియో ఇన్ఫర్మాటిక్): **7 పోస్టులు**
4. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(జియాలజీ): **4 పోస్టులు**
5. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(జియో ఫిజిక్స్): **4 పోస్టులు**
6. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(సాయిల్ సైన్స్): **4 పోస్టులు**
7. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(అర్బన్ స్టడీస్): **3 పోస్టులు**
8. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(వాటర్ రిసోర్సెస్): **7 పోస్టులు**
9. మెడికల్ ఆఫీసర్ 'ఎస్‌సీ': **1 పోస్టు**
10. నర్స్ 'బి': **2 పోస్టులు**



అర్హత: పోస్టును అనుసరించి ఎస్ఎస్ఎల్‌సీ/ఎస్ఎస్‌సీ, డిప్లొమా, బీఎస్సీ, బీఈ, బీటెక్, ఎమ్మెస్సీ ఎంటెక్, ఎంఈ ఉత్తీర్ణులై ఉండాలి.
జీతం: సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'; మెడికల్ ఆఫీసర్ 'ఎస్‌సీ' పోస్టుకు నెలకు రూ.81,906. నర్స్ 'బి', లైబ్రరీ అసిస్టెంట్ 'ఏ' పోస్టుకు రూ.65,554
వయోపరిమితి: 18-35 ఏళ్లు మించరాదు
దరఖాస్తు ఫీజు: రూ.750
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 12
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
వెబ్‌సైట్: https://www.nrsc.gov.in/

జాబ్ కార్నర్

రైట్స్‌లో అసిస్టెంట్ మేనేజర్లు

రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్(రైట్స్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి విడివిడిగా నోటిఫికేషన్లు విడుదల చేసింది.

ఫైనాన్స్ విభాగంలో ఖాళీలు: 16

పోస్టు: అసిస్టెంట్ మేనేజర్(ఫైనాన్స్)
అర్హత: చార్టర్డ్ అకౌంటెంట్/కాస్ట్ అకౌంటెంట్ ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
జీతం: నెలకు రూ.40,000 - రూ.1,40,000
వయోపరిమితి: 32 ఏళ్లు మించరాదు
దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.300, ఇతరులకు రూ.600.
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
ఆన్‌లైన్ ఫీజుకు చివరి తేదీ: జనవరి 29
రాత పరీక్ష తేదీ: ఫిబ్రవరి 4

ఇతర విభాగాల్లో ఖాళీలు: 12

1. అసిస్టెంట్ మేనేజర్(జియో టెక్నికల్): **1 పోస్టు**
2. అసిస్టెంట్ మేనేజర్(స్ట్రక్చరల్ ఇంజనీరింగ్): **4 పోస్టులు**
3. అసిస్టెంట్ మేనేజర్(అర్బన్ ఇంజనీరింగ్): **3 పోస్టులు**
4. అసిస్టెంట్ మేనేజర్(ఎలక్ట్రికల్):**1 పోస్టు**
5. అసిస్టెంట్ మేనేజర్(ఎస్ అండ్ టీ): **1 పోస్టు**
6. అసిస్టెంట్ మేనేజర్(ఎకనామిక్ అండ్ స్టాటిస్టిక్స్): **1 పోస్టు**
7. అసిస్టెంట్ మేనేజర్(సివిల్): **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీలో సివిల్, ఎన్విరాన్‌మెంటల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎకనామిక్స్, బిజినెస్ ఎకనామిక్స్, పీజీలో జియో-టెక్నికల్, స్ట్రక్చరల్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, ఎంబీఏ(ఫైనాన్స్)తో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
జీతం: నెలకు రూ.40,000 - రూ.1,40,000
వయోపరిమితి: 32 ఏళ్లు మించరాదు
దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.300. ఇతరులకు రూ.600.
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
ఆన్‌లైన్ ఫీజు చివరి తేదీ: జనవరి 27
రాత పరీక్ష తేదీ: ఫిబ్రవరి 4
పరీక్ష కేంద్రం: ఢిల్లీ - ఎన్‌సీఆర్
వెబ్‌సైట్: https://rites.com/

హిందుస్థాన్ కాపర్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రెయినీలు

కోల్‌కతాలోని హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్... వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు: 40**
విభాగాలు: మైనింగ్, జియాలజీ, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, మెకానికల్, సిస్టమ్.
అర్హత: 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్-2021/2022/2023 స్కోర్ కలిగి ఉండాలి.
వయోపరిమితి: 2024 జనవరి 1 నాటికి 28 సంవత్సరాలు మించకూడదు
ఎంపిక ప్రక్రియ: గేట్ స్కోరు, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తు రుసుము: రూ.500
ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: జనవరి 29
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 19
వెబ్‌సైట్: www.hindustancopper.com/

ఎన్‌సీఈఆర్‌టీలో పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్(ఎన్‌సీఈఆర్‌టీ)... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న వివిధ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. **అసిస్టెంట్ ఎడిటర్: 60 పోస్టులు**
2. **ప్రూఫ్ రీడర్: 60 పోస్టులు**
3. **డీటీపీ ఆపరేటర్: 50 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా, డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: అసిస్టెంట్ ఎడిటర్‌కు 50 ఏళ్లు; ప్రూఫ్ రీడర్‌కు 42 ఏళ్లు; డీటీపీ ఆపరేటర్‌కు 45 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు అసిస్టెంట్ ఎడిటర్‌కు రూ.80,000; ప్రూఫ్ రీడర్‌కు రూ.37,000; డీటీపీ ఆపరేటర్‌కు రూ.50,000.
ఇంటర్వ్యూ తేదీలు: 2024 ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు
వేదిక: పబ్లికేషన్ డివిజన్, ఎన్‌సీఈఆర్‌టీ, శ్రీ అరబిందో మార్గ్, న్యూఢిల్లీ.
వెబ్‌సైట్: https://ncert.nic.in/

డైలీ సుడోకు - 213

	7	1		4		3		
2		3	5				1	9
					3		2	
				7	2	9		
		6	8	5				
	1		4					
3	9				8	5		4
		5		2		1	6	

సుడోకు - 212 సమాధానం

2	5	4	1	8	6	7	3	9
8	3	1	9	7	2	6	4	5
9	6	7	3	4	5	1	8	2
5	2	8	6	3	7	4	9	1
3	4	6	8	9	1	5	2	7
7	1	9	5	2	4	8	6	3
1	7	3	4	6	9	2	5	8
6	8	2	7	5	3	9	1	4
4	9	5	2	1	8	3	7	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.